ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

గుంటూరు

: fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

23-8-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 203 పేజీలు: 12వెల: 6.50

శ్రీలంక మాజీ అధ్యక్షుడు విక్రమ్ సింఘే అరెస్టు
బెంగాల్ జైళ్లలో ఎఐ: కరడుగట్టిన ఖైదీలపై నిఘా
9లో



## కుక్కలకు వీధుల్లో ఆహారం పెట్టొద్దు

### సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 22:** వీధి కుక్కల బెడదకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు వెలువరించింది. వీధులు లేదా బహిరంగ ప్రదేశాల్లో వీటికి ఆహారం అందించడం చట్టవిరుద్ధమని స్పష్టం చేసింది. వీధి కుక్కలకు నిర్దేశిత ప్రాంతాల్లోనే ఆహారం అందించాలని, ఇందుకోసం అధికారులు ప్రతి వార్డులో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయాలని పేర్కొంది. ఆ ప్రాంతాల్లో మాత్రమే ఆహారం అందించాలని సూచిస్తూ నోటీసు బోర్డులు ఏర్పాటు చేయాలని వెల్లడించింది. ఎట్టి పరిస్థితుల్లోనూ వీధుల్లో కుక్కలకు ఆహారం ఇవ్వకూడదని, ఈ ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు ఉంటాయని సుప్రీం కోర్టు స్పష్టం >>2

# వరదలపై అప్రమత్తం

### అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు

### ఎరువుల లభ్యత, సరఫరాపై ఢిల్లీ నుంచి సమీక్షించిన సిఎం

### కాకినాడ సమీపంలో గ్యాస్ లీక్‌పై ఆరా

**విజయవాడ, ఆగస్టు22,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో అత్యధిక పంటల సాగు ఉన్న జిల్లాలో వరద పరిస్థితులపై నిరంతర నిఘా అవసరమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. వరద అనంతర పరిస్థితులపైన అధికారులు అవగాహనతో వ్యవహరించాలన్నారు.ఎక్కడా ఎరువుల కొరత ఉండకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు.గోదావరి, కృష్ణా నదులకు ఎగువ నుంచి వస్తున్న భారీ ప్రవాహాలు, వరదల పరిస్థితిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఢిల్లీ నుంచి సీఎస్ కె.విజయానంద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తాలతో పాటు ఇతర ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా తాజా పరిస్థితులపై సీఎం ఆరా తీశారు. రెండు నదులకు వస్తున్న వరద ప్రవాహాలు, పలు ప్రాంతాల్లో నీట మునిగిన పంటలు, నివాస సముదాయాలకు సంబంధించి అధికారులు సీఎంకు వివరించారు. కృష్ణా నదికి ఎగువ నుంచి వస్తున్న ప్రవాహాలతో శ్రీశైలం నుంచి 5.20 లక్షలు, నాగార్జున సాగర్ నుంచి 4.32 లక్షలు, పులిచింత నుంచి 4.07 లక్షలు, ప్రకాశం బ్యారేజ్ నుంచి 4.53 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. గోదావరి నదిలోనూ భారీగానే వరద ప్రవాహాలు వస్తున్నాయని ప్రస్తుతం ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి 13,42,307 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల అవుతోందని సీఎంకు వివరించారు. గోదావరి వరదల కారణంగా పరివాహక ప్రాంతంలోని లంక గ్రామాలు, పోలవరం ముంపు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయని అధికారులు వివరించారు. ఈ ప్రాంతాల్లో ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయడంతో పాటు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. అధికార యంత్రాంగం సమస్య వచ్చిన తరువాత స్పందించటం కంటే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముందుగానే సన్నద్ధతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని చెప్పారు. వరదలు, భారీ వర్షాలపై ఆయా ప్రాంతాల ప్రజల ఫోన్లకు నిరంతరం ఖచ్చితమైన సమాచారం ఇచ్చి,తప్పుడు ప్రచారాలకు తావు లేకుండా చూడాలని చెప్పారు.

రాష్ట్రంలో ఎరువులు, పురుగుమందుల లభ్యత, సరఫరా అంశంపైనా సీఎం సమీక్ష చేశారు. ఎరువుల కొరత అనే సమస్య లేకుండా అధికార యంత్రాంగం పనిచేయాలని సూచించారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టించినా, దారి మళ్లించినా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విజిలెన్స్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండి ఎరువులు దారి మళ్లకుండా, ధర పెరగకుండా చూడాలని సీఎం సూచించారు. ఎరువుల కొరత అనే సమస్య ఉన్నట్లు ఎక్కడ నుంచి సమాచారం వచ్చినా రాష్ట్ర స్థాయి నుంచి >>2



శుక్రవారం న్యూఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయిన సిఎం చంద్రబాబు

### 'సాస్కి'కింద అదనంగా

## రూ.5వేల కోట్లు ఇవ్వండి

### కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరిన సిఎం చంద్రబాబు

**విజయవాడ, ఆగస్టు 22,ప్రభాతవార్తప్రతినిధి:** సాస్కి కింద అదనంగా రూ.5,000 కోట్లు కేటాయించాలని ఏపీ సీఎం చంద్రబాబునాయుడు కేంద్ర ఆర్థికమంత్రిని కోరారు.ఢిల్లీ వెళ్లిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శుక్రవారం కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిశారు. రాష్ట్రంలో చేపట్టే పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆర్థికసహాయం అందించవలసిందిగా కేంద్ర ఆర్థికమంత్రిని ముఖ్యమంత్రి కోరారు. ఆంధ్రప్రదేశ్‌కు ఇప్పటివరకు ప్రత్యేకమూలధన పెట్టుబడిసహాయం (సాస్కి)పథకం కింద రూ. 2,010కోట్లు లభించాయని తెలిపారు. >>2



సిపిఐ అగ్రనేత సురవరం

## ఇక లేరు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఆగస్టు22:** కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా పార్టీలో తీవ్ర విషాదం నెలకొంది. సిపిఐ అగ్రనేత,మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి తుదిశ్వాస విడిచారు. గత కొంత కాలంగా సుధాకర్‌రెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నారని సమాచారం. శుక్రవారం రాత్రి పరిస్థితి మరింత విషమించడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో కన్నుమూశారు. పాలమూరు జిల్లాకు చందిన సుధాకర్‌రెడ్డి 1998,2004లో రెండుసార్లు నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ఎంపికగా ఎన్నికయ్యారు. సీపీఐ అగ్రనాయకులు మాజీ పార్లమెంట్ సభ్యులు సురవరం సుధాకర్ రెడ్డి మృతి పట్ల ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సురవరం సుధాకర్ రెడ్డి నల్గొండ జిల్లా నుంచి జాతీయ >>2



శుక్రవారం విద్యాశాఖ ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న మంత్రి నారా లోకేష్

### ఇక యేటా డిఎస్సీ

## టీచర్ పోస్టుల భర్తీ

### ప్రభుత్వ విద్యలో గత 14 నెలలుగా పలు సంస్కరణలు

### పాఠశాలల్లో కీలక మౌలిక సదుపాయాలు

### అమరావతిలో యేడాదిలోగా సెంట్రల్ లైబ్రరీ: మంత్రి లోకేష్

**విజయవాడ,ఆగస్టు22,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఇకపై టీచర్ పోస్టుల భర్తీకి ప్రతి ఏడాది డీఎస్సీ నిర్వహిస్తామని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీశాఖల మంత్రి నారాలోకేష్ స్పష్టం చేశారు. ప్రభుత్వ విద్యలో విద్యాప్రమాణాలను మెరుగుపర్చేందుకు గత 14నెలలుగా సమర్థవంతంగా సంస్కరణలు అమలు చేశామని ఉద్ఘాటించారు. ఫలితాలు రాబట్టే బాధ్యత అధికారులు, ఉపాధ్యాయులదేనని దిశానిర్దేశం చేశారు. దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో కీలక మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని నొక్కిచెప్పారు. అమరావతిలో ఏడాదిలోగా సెంట్రల్ లైబ్రరీ నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. విద్యాశా ప్రభుత్వ విద్యలో విద్యాప్రమాణాలను మెరుగుపర్చేందుకు గత 14నెలలుగా సమర్థవంతంగా సంస్కరణలు అమలు చేశామని ఉద్ఘాటించారు. ఫలితాలు రాబట్టే బాధ్యత అధికారులు, ఉపాధ్యాయులదేనని దిశానిర్దేశం చేశారు. దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో కీలక మౌలిక సదుపాయాలు కల్పిస్తు >>2

### భద్రాచలానికి దీటుగా

## ఒంటిమిట్ట రామాలయం

### సిఎం ఆదేశాలతో టిటిడి మాస్టర్ ప్లాన్

### తొలి విడతగారూ.100 కోట్లతో అభివృద్ధి



**రాజంపేట, ఆగస్టు22ప్రభాతవార్త :** ఆంధ్ర అయోధ్యగా ప్రసిద్ధిగాంచిన ఉమ్మడి కడప జిల్లా ఒంటిమిట్ట శ్రీకోదండ రామాలయం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ సిద్ధమవుతోంది. తెలంగాణలోని భద్రాచలం కు దీటుగా ఒంటిమిట్ట రామాలయాన్ని నా భూతో నా భవిష్యత్ అన్న చందంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుసంకల్పించారు. ఒంటమిట్ట శ్రీరామనవమి >>2




### మాజీ డి.సిఎం నారాయణ స్వామిని

## మూడోసారి సిట్ విచారణ!



### ఇప్పటికే రెండు సార్లు వర్చువల్‌గా సాగిన విచారణ

### లిక్కర్ కేసులో కీలక పరిణామం

**విజయవాడ,ఆగస్టు22,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ లిక్కర్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామిని సిట్ విచారణ రావాలని ఆదేశించింది.లిక్కరు స్కామ్ కేసులో సిట్ దూకుడు ప్రదర్శింస్తూంది. నిందితులను ఒక్కొక్కరిగా బయటకు లాగుతుంది. తాజాగా మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామిని సిట్ అధికారులు అదుపులోకి తీసుకోనున్నట్లు ప్రచారం జరుగుతుంది. గతంలో రాయణ స్వామిని విచారణకు రావాలని సిట్ అధికారులు కోరినట్లు తెలిపారు.లిక్కరు స్కామ్‌కు సంబంధించి ఆయన కీలక సాక్షిగా ఉండారని గతంలో ప్రచారం జరిగింది.ఈ క్రమంలో ఆయన ఆరోగ్య కారణాలతో విచారణకు గైర్హాజరు కాలేనని చెప్పడంతో వర్చువల్‌గా సిట్ విచారినట్లు సమాచారం. ఇక శుక్రవారం నారాయణ స్వామిని సిట్ మరో పర్యాయం ఆయన ఇంట్లోనే వర్చువల్‌గా విచారించింది.దాదాపు ఆయన ఆరుగుంటల పాటు విచారించిన సిట్ నారాయణస్వామిని మరోసారి విజయవాడలో విచారిస్తామని తెలిపి నట్లు సమాచారం,అయితే తాజా విచారణ తరువాత ఆయనను అదుపులోకి తీసుకొనే >>2

### హైకోర్టుకు

## 8 మంది ఎజిపిలు

**విజయవాడ,ఆగస్టు22,ప్రభాతవార్తప్రతినిధి:** హైకోర్టులో సహాయ ప్రభుత్వ న్యాయవాదులు (ఎజిపి)గా 8మందిని నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు శాసన వ్యవహారాలు, న్యాయశాఖ కార్యదర్శి జి.ప్రతిభాదేవి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సహాయ ప్రభుత్వన్యాయవాదులుగా చల్లా శ్రీనివాస్, కె.ఉజ్వలదేవి, బి.సమీరా, >>2

## నెలకు రూ.400కే ఫైబర్ టివి బేసిక్ ప్లాన్

### సిజిఎం శేషాచలం వెల్లడి

**విజయవాడ,ఆగస్టు 22,ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతిలోనూ బీఎస్ఎన్ఎల్ సేవల్ని విస్తరిస్తామని,దీనికి గాను త్వరలో టవర్లు ఏర్పాటు చేస్తామని బీఎస్ఎన్ఎల్ ఏపీ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ శేషాచలం తెలిపారు. వినియోగదారుల కోసం ఏపీ సర్కిల్‌లో నెలకు రూ.400లకే ఫైబర్ టీవీ బేసిక్ ప్లాన్ తెచ్చామని, ఇందులో ఇంటర్నెట్,టీవీ,ఫోన్ సదుపాయాల్ని కల్పిస్తున్నామని వివరించారు. రాబోయే మూడు నెలల్లో 5జీ సేవల్ని అందుబాటులోకి తెచ్చేందుకు కసరత్తు చేయనున్నట్లు వెల్లడించారు.విజయవాడ లోని బీఎస్ఎన్ఎల్ భవన్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ఈ ప్లాన్‌లో ఈటీవీ సహా 400కు పైగా ఛానళ్ళు,తొమ్మిదికి పైగా ఓటీటీలు ఉంటాయి. దేశవ్యాప్తంగా అపరిమిత కాల్స్ చేసుకోవచ్చు. 20 ఎంబీపీఎస్ ఇంటర్నెట్ వేగం అందిస్తున్నాం. >>2

## చిరంజీవికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన చంద్రబాబు

**విజయవాడ,ఆగస్టు 22,ప్రభాతవార్త ప్రతినిధి:** మెగాస్టార్ చిరంజీవికి సిఎం చంద్రబాబు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.సినిమా, దాతృత్వంలో ఆయన అద్భుత ప్రయాణం లక్షల మందికి స్ఫూర్తినిచ్చిందన్నారు. సేవ,అంకితభావంతో ఇంకా ఎందరో జీవితాలను ప్రభావితం చేయాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. నిండు నూరేళ్ళు ఆరోగ్యం,ఆనందాలతో ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు 'ఎక్స్'లో పోస్టు చేశారు.

## మట్టి మహా గణపతి!

**విజయవాడ,ఆగస్టు 22,ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడలోని విద్యాధరపురం బస్ డిపో పక్కన 72అడుగుల మహా గణపతి రూపుదిద్దుకుంటున్నాడు. తెలుగు రాష్ట్రాల్లో అతి పెద్ద గణపతి విగ్రహాల్లో ఒకటైన ఈ ప్రతిమను పూర్తిగా పర్యావరణ హితంగా తయారుచేస్తున్నారు. మట్టితో చేసి, సహజ సిద్ద రంగులతో అలంకరించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సింహాసనంపై కూర్చొని వరాలందిస్తున్న ఈ కార్యసిద్ధి మహాశక్తి గణపతికి రెండు వైపులా నగరేశ్వరస్వామి,వాసవీ కన్యకాపరమేశ్వరీ విగ్రహాలను రూపొందిస్తున్నారు. 40మంది కళాకారులు2నెలలుగా తయారీలో నిమగ్నమయ్యారు.

## గోదావరి-కావేరి అనుసంధానంపై ఆరో విడత సంప్రదింపులు

**విజయవాడ,ఆగస్టు 22,ప్రభాతవార్త ప్రతినిధి:** గోదావరి-కావేరి నదుల అనుసంధానంపై జాతీయ నీటి అభివృద్ధి సంస్థ అధ్వర్యంలో ఆరో విడత సంప్రదింపుల సమావేశం ప్రారంభమైంది. కేంద్ర జలసంఘం చైర్మన్ అతుల్‌జైన్ నేతృత్వంలో జలసౌధలో జరుగుతున్న ఈ భేటీకి ఆంధ్రప్రదేశ్,తెలంగాణ,చత్తీస్‌గఢ్ రాష్ట్రాల అధికారులు హాజరయ్యారు. మధ్యప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల అధికారులు వర్చువల్‌గా హాజరయ్యారు. గోదావరి జిల్లాల్లో చత్తీస్‌ఘడ్‌కు కేటాయించిన 145 టిఎంసీల నీటికి కావేరికి అనుసంధానించాలన్నది ప్రతిపాదన. ఇందు కోసం ఇచ్చంపల్లి వద్ద ఆనకట్ట నిర్మించి అక్కడి నుంచి గోదావరి నీటిని కావేరికి మళ్ళించాలని భావిస్తున్నారు.దీని కోసం అన్ని భాగస్వామ్య రాష్ట్రాలతో మాట్లాడి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్ళే ప్రక్రియ గత కొంత కాలంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగానే ఇవాళ ఆరో విడత సంప్రదింపులు జరుగుతున్నాయి.

# వరదలపై అప్రమత్తం

>> క్షేత్రస్థాయి వరకు ఉన్నతాధికారులు స్వయంగా పరిశీలించి సమస్య లను పరిష్కరించాలని స్పష్టం చేశారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం ధరియాల తిప్ప సమీపంలో సముద్రంలో ఓఎన్జీసీ గ్యాస్ పైప్ లీక్ ఘటన పైనా సీఎం అధికారులతో మాట్లాడారు. రాత్రి 1.30 గంటకు గ్యాస్ లీక్ తో మంటలు భారీగా ఎగిసి పడ్డాయని గంటన్నర వ్యవధిలోనే గ్యాస్ సరఫరా నిలిపివేసి లీక్ ను అరికట్టారని అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం, ఆస్తినష్టం జరగలేదని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. లీక్ అయిన పైప్ ను మొత్తం తనిఖీ చేసి సమీప గ్రామాల ప్రజలు ఆందోళనకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని సీఎం అధికా రులను ఆదేశించారు.

**అర్హులైన ఏ ఒక్కరి పెన్షన్ రద్దుకాదు:** అర్హులైన ఏ ఒక్కరి పెన్షన్ రద్దుకాదని సీఎం చంద్రబాబు స్పష్టం చేసారు.గత ప్రభుత్వంలో అడ్డదారిలో సదరం సర్టిఫికెట్లు తీసుకుని పెన్షన్ పొందుతున్నవారిపై ఇటీవల జరిపిన పునఃపరిశీలన వివరాలను పరిశీలించమని అధికారులను ఆదేశించామన్నారు. ఈ ప్రక్రియలో అనర్హులను గుర్తించినట్టు, అన్నివిధాలా పూర్తి ఆరోగ్యవంతులుగా ఉండి ఎలాంటి వైకల్యం లేకుండానే కొంతమంది పెన్షన్ పొందుతున్నట్టు పరిశీలనలో తేలిందని తెలిపారు. అనర్హులైన పెన్షన్లు ధృవీకరించడానికి ప్రత్యేక వైద్య బృందాలను నియమించి నిర్ధారించినట్టు వెల్లడించారు. అయితే నకిలీ పెన్షన్లను మాత్రమే తొలిగించాలని, అర్హులైన ఏ ఒక్క దివ్యాంగ పింఛనుదారుకు పెన్షన్ రద్దు కాకూడదని సమీక్షలో ముఖ్యమంత్రి స్పష్టంగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అర్హులైన పెన్షన్లు యధావిధిగా కొనసాగుతాయని, దివ్యాంగులు ఎవరూ ఈ విషయంలో ఆందోళన చెందాల్సిన పనిలేదని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అన్నారు. అలాగే తాత్కాలిక సర్టిఫికెట్ల ద్వారా దివ్యాంగుల పెన్షన్, హెల్త్ పెన్షన్ పొందేవారికి కూడా ఎప్పటిలా నెలనెలా పింఛన్ అందించాలని స్పష్టం చేశారు. వారికి పం పించిన నోటీసులు సైతం వెనక్కి తీసుకోవాలని సీఎం చెప్పారు.

# రూ.5వేల కోట్లు ఇవ్వండి

>> రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న మూలధన ప్రాజెక్టుల కోసం అదనంగా రూ. 5,000 కోట్లు కేటాయించాలని వినతి పత్రం సమర్పించారు. అలాగే 202425 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సింగిల్ నోడల్ ఏజెన్సీ (ఎస్ఎన్ఏ స్పార్)'ప్రోత్సాహక పథకం మార్గదర్శకాల ప్రకారం రూ. 250 కోట్ల విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలపై తగు ఉత్తర్వులు ఇవ్వాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. తూర్పు ప్రాంత రాష్ట్రాల సమగ్రాభివృద్ధి కోసం కేంద్రం ప్రకటించిన పూర్వోదయ పథకాన్ని స్వాగతిస్తున్నామని చెప్పిన ముఖ్యమంత్రి...ఈ పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రయోజనం పొందగలదని తెలిపారు. దీని విధివిధానాలు రూపొందించి త్వరగా ఈ పథకాన్ని అమల్లో తేవాలని ముఖ్యమంత్రి కోరారుఏపీ సమగ్రాభివృద్ధిలో కేంద్రం కీలక భాగస్వామ్యం వహించాలని కోరారు.అమరావతి,పోలవరం సకాలంలో పూర్తి చేయడానికి నిధులు విడుదల్లో జాప్యం లేకుండా సహకరించాలని విజ్ఞప్తి చేసారు.రాష్ట్ర విభజన అనంతర పెండింగ్ నిధులను విడుదల చేయాలని విజ్ఞప్తి చేసారు.మిషన్ పూర్వోదయ" పథకం ద్వారా ఈశాన్య ప్రాంత ఆర్థికాభివృద్ధి కోసం కేంద్రం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. ఈ పథకం ద్వారా ఆంధ్ర ప్రదేశ్ తో పాటు, బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిశాలో పారిశ్రామికాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక సహాయం చేస్తుంది. "వికసిత్ భారత్" లో భాగంగా అంతగా అభివృద్ధి సాధించని రాష్ట్రాలకు ప్రత్యేక సహాయం చేయాలని"మిషన్ పూర్వోదయ" పథకాన్ని కేంద్ర ప్రారంభించింది ఈ పథకం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన ఆర్థికంగా వెనుకబడిన ఆంధ్రప్రదేశ్‌ను అన్నివిధాలుగా ఆదుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రాన్ని కోరారు.

సీఎం చంద్రబాబుతో పాటు కేంద్ర మంత్రులు కింజరపు రామ్మోహన నాయుడు,డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్,టీడీపీ పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీకృష్ణదేవ రాయలు,రాష్ట్రఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌శవ్ పాల్గొన్నారు.ఇక నిర్మలా సీతారామన్‌ను సీఎం చంద్రబాబు ఏపీ ప్రభుత్వ పక్షాన సముచిత రీతిన సత్కరించి,జ్ఞాపికను అందజేసారు.

## భద్రాచలానికి దీటుగా ఒంటిమిట్ట రామాలయం

>> బ్రహ్మోత్సవాల సందర్భంగా జరిగిన సీతారాముల కళ్యాణం లో ఒంటిమిట్ట రామాలయం అభివృద్ధిని ఎవరు ఊహించని విధంగా చేపడతామని సీఎం ప్రకటించారు. అందులో భాగంగా గత నెలలో జరిగిన పాలకమండలి సమావేశంలో ఒంటిమిట్ట రామాలయం అభివృద్ధికి మాస్టర్ సిద్ధం చేయాలని నిర్ణయం తీసుకున్నారు. మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసేందుకు దేశంలోనే మూడు మూడు ప్రఖ్యాత సంస్థల్లో ఒకటైన దానికి అప్పగించారు. ఈ మేరకు టీటీడీ ప్లానింగ్ అధికారి రాముడు ఆధ్వర్యంలో నిపుణుల బృందం శుక్రవారం ఒంటిమిట్ట రామాలయాన్ని పరిశీలించింది. రామాలయ పరిసరాలను పరిశీలించారు. అభివృద్ధి చేపట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై క్షుణ్ణంగా శోధించారు. అంతేకాకుండా రామాలయం నాలుగు వైపులా అభివృద్ధి చేసేందుకు కార్యచరణ సిద్ధం చేస్తున్నారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా ప్రస్తుతం తూర్పు వైపు ఉన్న కోదండ రామాలయాన్ని పడమటి వైపున ఉన్న సీతారాముల శాశ్వత కళ్యాణ వేదిక వరకు అభివృద్ధి చేసేందుకు నిర్ణయించారు. దక్షం వైపున ఒంటిమిట్ట రామాలయ అభివృద్ధికి టెంకాయ చిప్పతో చేతబట్టి నిధులను సమీకరించి అభివృద్ధి చేసిన ఆంధ్ర వాల్మీకి వావిలకొలను సుబ్బారావు కొండను అభివృద్ధి చేస్తారు .అందులో భాగంగా గ్రీనరీ పెంపొందిస్తారు. కడప రేణిగుంట జాతీయ రహదారి పక్కనే ఆలయం, పక్కనే ఉన్న ఒంటిమిట్ట చెరువులో బోటింగ్ తో పాటు జాంబవంతుడు విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు పరిశీలించారు. ముఖ్యంగా పడమటి వైపున ఉన్న సీతారాముల కళ్యాణ వేదిక నుంచి ఒంటిమిట్ట రామాలయం కనిపించేలా మాస్టర్ సిద్ధం చేస్తున్నారు. అందులో భాగంగా జాతీయ రహదారిని కూడా అభివృద్ధి చేసే ఆలోచన ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. శాశ్వత అన్నదాన క్యూ కాంప్లెక్స్, అన్నదాన కేంద్రం, రామాలయం తూర్పు వైపున ఉన్న కొండలను పెద్ద ఎత్తున పచ్చదనం పెంపొందించేలా చూడాలని చూస్తున్నారు. ముఖ్యంగా ఇక్కడ ఉష్ణోగ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో కనీసం 7 లేక 8 డిగ్రీల ఉష్ణోగ్రతను తగ్గించే స్థాయిలో పచ్చదనం పెంపొందించాలని టిటిడి భావిస్తోంది. ఉత్తరం వైపున ఉన్న నాగేటి తిప్పను కూడా అభివృద్ధి చేసేందుకు అక్కడ ఏమేమి అభివృద్ధి పనులు చేపట్టాలో చూస్తున్నారు. ఒంటిమిట్ట రామాలయాన్ని టిటిడి కిడ్నీలో విలీనం చేసిన తర్వాత నాడు చంద్రబాబు నాయుడు 100 కోట్లతో అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. 100 కోట్ల నిధులతో చేపటాల్సిన ముఖ్యమైన పనులలో తూర్పు వైపున శ్రీరామ్ ప్రాజెక్టును రామాయణ చరిత్ర కళ్ళకు కట్టినట్లు పర్యాటకులను ఆకర్షించేలా ఏర్పాటు చేయాలని నాడు నిర్ణయించారు. అయితే పరిశీలన దశలోనే ఈ ప్రాజెక్టు ఉండిపోయింది. తాజాగా మాస్టర్ ప్లాన్ లో ఈ పనులను చేపట్టే అవకాశం కనిపిస్తోంది. మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసిన తర్వాత విడతల వారీగా అభివృద్ధి పనులు చేపట్టాలని టిటిడి యోచిస్తోంది. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పెద్ద ఎత్తున యాత్రికులకోసం ఓ పెద్ద సముదాయాన్ని నిర్మించాలని భావిస్తున్నారు. అంతేకాకుండా సిబ్బందికికూడా గృహ సముదాయాన్ని నిర్మించే ఆలోచన ఉన్నట్లు సమాచారం. ఏది ఏమైనా మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసిన తర్వాత మొదటి విడతలోనే కనీసం 100 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రంగం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. సీఎం ఆదేశాలతో తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి చైర్మన్ బివిఆర్ నాయుడు ఒంటిమిట్ట రామాలయ అభివృద్ధి మాస్టర్ ప్లాన్ అమలు చేసేందుకు ప్రత్యేకంగా చొరవ చూపుతున్నట్లు సమాచారం. దీంతో టిటిడి అధికార యంత్రాంగంలో ప్రత్యేక శ్రద్ధ కనిపిస్తోంది. దీన్ని బట్టి చూస్తే దక్షిణ భారతదేశంలోనే ఒంటిమిట్ట రామాలయం ఒకప్రముఖ పుణ్యక్షేత్రంగా త్వరలోనే అభివృద్ధి చెందే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## అవినీతి వ్యతిరేక చర్యలపై ఇంత వ్యతిరేకతా?
### ఆర్జేడి, కాంగ్రెస్ నేతలు ఉంటే జైలు, లేకుంటే బెయిలు: ప్రధాని మోడీ విమర్శ

పాట్నా, ఆగస్టు 22: తప్పు చేస్తే సిఎం, ప్రధానినైనా తొలగించే బిల్లును విపక్షాలు వ్యతిరేకిస్తుండటంపై ప్రధాని మోడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్జెడీ, కాంగ్రెస్ నేతలతు ఉంటే జైల్లో, లేకపోతే బెయిల్‌పై ఉన్నారని ఎద్దేవా చేశారు. అందుకే అవినీతికి వ్యతిరేకంగా పోరాడటానికి ప్రవేశపెడుతున్న బిల్లును వ్యతిరేకిస్తున్నారని విమర్శించారు. 50 గంటలు జైలు శిక్ష అనుభవిస్తే ఒక ప్రభుత్వ ఉద్యోగి తన ఉద్యోగాన్ని కోల్పోతున్నప్పుడు జైలు శిక్ష అనుభవించిన ఒక ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి తమ స్థానం నుంచి దిగిపోకుండా ఎలా ఉంటారని మోడీ ప్రశ్నించారు. బీహార్‌లోని గయాజీలో జరిగిన బహిరంగ సభలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. కొంతకాలం క్రితం కొందరు నేతలు జైళ్ల నుంచి ఫైళ్లపై సంతకాలు చేయడం, ప్రభుత్వ ఆదేశాలు ఇవ్వడం మనం చూశాం. అవినీతికి పాల్పడే నేతలే పరిపాలన చేస్తే ఇక దేశంలో అవినీతిని ఎలా తొలగించగులుతాం? అని మోడీ ప్రశ్నించారు. ఇకపై క్రిమినల్ నేతలకు అటువంటి అవకాశం ఇవ్వబోమని అన్నారు. అవినీతికి వ్యతిరేకంగా పోరాడటానికి ఎన్డీఏ ప్రభుత్వం తీసుకువస్తున్న చట్టానికి ఎవరూ అతీతులు కారని ప్రధాని కూడా దీని పరిధిలోకి వస్తారని పేర్కొన్నారు. తీవ్రమైన నేరారోపణలతో అరెస్టయి వరుసగా 30 రోజులపాటు నిర్బంధంలో ఉంటే ప్రధానమంత్రినైనా, కేంద్ర మంత్రినైనా పదవి నుంచి తొలగించేందుకు వీలు కల్పించే బిల్లును అమిత్ షా ఇటీవల లోక్‌సభలో ప్రవేశపెట్టారు. అనంతరం వాటిని సంయుక్త పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు పంపారు. తీవ్ర నేరారోపణకు గురై అరెస్టయినప్పుడు కేంద్రమంత్రిని, రాష్ట్ర లేదా కేంద్రపాలిత ప్రాంత ముఖ్యమంత్రిని, రాష్ట్ర మంత్రిని పదవి నుంచి తొలగించేందుకు ఈ బిల్లు అనుమతిస్తుంది. కనీసం అయిదేళ్ల శిక్ష పడే నేరానికి పాల్పడి, అరెస్టయి, నెల రోజులు నిర్బంధంలో ఉంటే 31వ రోజున వారి పదవి పోయేలా నిబంధనను ఈ బిల్లులో చేర్చారు. వారంతట వారు రాజీనామా చేయకపోయినా కొత్త నిబంధన ప్రకారం పదవి కోల్పోతారు.



శుక్రవారం న్యూఢిల్లీలో ఉపరాష్ట్రపతి అభ్యర్థిని కలిసిన సిఎం చంద్రబాబు. చిత్రంలో కేంద్రమంత్రులు, ఎంపిలు

## ఉపరాష్ట్రపతి అభ్యర్థి రాధాకృష్ణన్‌తో సిఎం చంద్రబాబు భేటీ
### మర్యాద పూర్వకంగా కలిసిన సిఎం

**విజయవాడ,ఆగస్టు22,ప్రభాతవార్తప్రతినిధి:** ఎన్డీఏ కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌ను మర్యాదపూర్వకంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం ఢిల్లీలో కలిశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. ఎన్డీఏ కూటమి నేతలందరి సహాకారంతోనే ఉపరాష్ట్రపతి అభ్యర్థిని నిర్ణయించామని స్పష్టం చేశారు. రాధాకృష్ణన్‌తో ఎప్పటి నుంచో తనకు పరిచయం ఉందని గుర్తుచేసుకున్నారు. ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి తన మద్దతును తెలియజేశానని పేర్కొన్నారు. దేశంలో గౌరవించదగ్గ వ్యక్తి, అత్యున్నత స్థానానికి మంచి అభ్యర్థి, దేశానికి గౌరవం తీసుకొస్తారని సీఎం చంద్రబాబు చెప్పారు. సీపీ రాధాకృష్ణన్ ఉపరాష్ట్రపతి కుర్చీకి ప్రతిష్ట పెంచుతారని అలాంటి వ్యక్తికి మద్దతు ఇవ్వడం చాలా ఆనందంగా ఉందని వ్యాఖ్యానించారు. తనకు రాజకీయాలు ముఖ్యం కాదని, తెలుగుదేశం పార్టీ ఎన్నికల ముందు నుంచి ఎన్డీఏ కూటమితో పొత్తులో ఉందని ఉద్ఘాటించారు. ఒకసారి ఎన్డీఏ అభ్యర్థి పెట్టిన తర్వాత ఓడిపోతామనే తెలిసి ఇండియా కూటమి మళ్లీ అభ్యర్థిని పెట్టడం ఎందుకు? అని ప్రశ్నించారు సీఎం చంద్రబాబు. గెలిచే పరిస్థితి ఉన్నప్పుడు తెలుగువారిని పెట్టుకోవాలని సూచించారు. గతంలో పీవీ నరసింహారావుకు నాటి సందర్భంలో తెలుగువారు అనే ఉద్దేశంతో కాంగ్రెస్‌లో ఉన్న తెలుగుదేశం మద్దతు తెలిపిందని స్పష్టం చేశారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు రెండు ఎన్డీఏ కూటములేనన్నారు.అలాంటి సందర్భంలో మద్దతు ఆశించడం. మాట్లాడటం సరికాదని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# మూడోసారి సిట్ విచారణ!

>> అవకాశం ఉందని కథనం ప్రచారంలోకి వచ్చింది. ఎందుకనో సిట్ ఆయనను వర్చువల్ గానే విచారించింది.ఈ క్రమంలో ఎక్సైజ్ పాలసీలో మార్పుల వెనుక ఉన్నవారి పాత్రపై సిట్ విచారణ చేయనున్న అధికారులు. లిక్కర్ పాలసీ ఆమోదానికి సంబంధించి ఆరా తీయనున్నట్లు సమాచారం. కాగా, లిక్కర్ కేసులో నారాయణ స్వామి పాత్ర కూడా కీలకమని సిట్ అధికారులు భావిస్తున్నారు.లిక్కర్ కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డికి చెందిన మరిన్ని విలువైన ఆస్తులు, బ్యాంకు ఖాతాలను సీజ్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది.ఈ కేసులో కెసిరెడ్డి సహా పలువురు నిందితులు, పలు సంస్థలకు చెందిన రూ.62 కోట్ల విలువైన ఆస్తులు జప్తు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రెండు జీవోల ద్వారా ఇప్పటికే అనుమతులు ఇచ్చింది.మరో రూ.13 కోట్లకు పైగా విలువ చేసే ఆస్తులు, బ్యాంకు ఖాతాలను జప్తు చేసేందుకు సీఐడీకి అనుమతులు జారీ చేసింది. గత ప్రభుత్వ హయాంలో అక్రమ మద్యం అమ్మకాలతో వచ్చిన ముడుపుల ద్వారా పలు చోట్ల తన కుటుంబ సభ్యులు, బంధువుల పేరిట రూ.కోట్ల విలువ చేసే ఆస్తులు కొనుగోలు చేసినట్టు సీఐడీ విచారణలో తేలింది. వీటిని సీజ్ చేసేందుకు అనుమతించాలని సీఐడీ రాష్ట్రప్రభుత్వాన్ని కోరడంతో అనుమతి మంజూరు చేసింది. కేసిరెడ్డి ప్రస్తుతం విజయవాడ జిల్లా జైల్లో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు.

# ఇక యేటా టీచర్ పోస్టుల భర్తీ

>> న్నామని నొక్కిచెప్పారు. అమరావతిలో ఏడాదిలోగా సెంట్రల్ లైబ్రరీ నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. విద్యాశాఖ ఉన్నతాధికారులతో మంత్రి లోకేష్ (శుక్రవారం ఏపీ సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఏపీ చరిత్రలో తొలిసారిగా 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించి, విజయవంతంగా నిర్వహించామని వ్యాఖ్యానించారు అనవసరమైన శిక్షణా కార్యక్రమాలతో ఉపాధ్యాయుల విలువైన సమయాన్ని వృథా చేయొద్దని సూచించారు. సంస్కరణల అంతిమ లక్ష్య అభ్యసన ఫలితాలేనని తెలిపారు. అసర్ నివేదిక ప్రకారం ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ) ప్రోగ్రామ్ అమల్లో జాతీయస్థాయిలో ఏపీ 14వ స్థానంలో ఉందని ఉద్ఘాటించారు. ఈ పరిస్థితిలో మార్పు రావాలని మెరుగైన ర్యాంక్ సాధించేందుకు నిర్మాణాత్మకమైన చర్యలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. దేశంలోనే తొలిసారిగా ప్రతి బిడ్డకు గ్యారెంటీడ్ ఎఫ్ఎల్ఎన్ ఒక హక్కుగా ఇవ్వబోతున్నామని స్పష్టం చేశారు. తల్లికి వందనం చివరి దశ నిధులను విడుదల చేశామని ప్రకటించారు. తల్లికి వందనం కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేశామని గుర్తుచేశారు. చివరి విడతగా పెండింగ్ దరఖాస్తులను ఆమోదిస్తూ రూ. 325కోట్లు విడుదల చేశామని వెల్లడించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా 2024 -2025 ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏపీలో కొత్తగా మంజూరైన జవహర్ నవోదయ విద్యాలయాలు, కేంద్రీయ విద్యాలయాలకు దాతల సహకారంతో భూసేకరణకు చర్యలు తీసుకోవాలని మంత్రి నారా లోకేష్ మార్గనిర్దేశం చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, మోడల్ స్కూళ్లలో కీలకమైన మౌలిక సదుపాయాల అభివృద్ధికి దేశ, విదేశాల్లో స్థిరపడిన ప్రముఖులు, దాతల సహకారం తీసుకోవాలి. ఆసక్తిగల తమ గ్రామాల్లోని స్కూళ్లను దత్తత తీసుకునేలా ఆయా స్కూళ్లకు అవసరమైన మౌలికసదుపాయాలతో ప్రత్యేకమైన వెబ్ సైట్ రూపొందించాలి. జాతీయస్థాయిలో పేరెన్నికగన్న కార్పొరేట్ సంస్థల సహకారాన్ని కూడా తీసుకోవాలి. రాష్ట్రంలోని అనంతపురం, నెల్లూరు, ఏలూరు, కడప చిత్తూరులలో ఆధునీకరించిన సైన్స్ సెంటర్లను త్వరగా ప్రారంభించి, విద్యార్థులకు ఉపయోగకరంగా తీర్చిదిద్దండి. రాష్ట్రవ్యాప్తంగా మంజూరైన 125 ఆటిజం సెంటర్ల నిర్మాణాలను వెంటనే ప్రారంభించి, ఏడాదిలో పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలి. దేశంలోనే అత్యుత్తమ మోడల్ తో అమరావతిలో సెంట్రల్ లైబ్రరీ నిర్మాణాన్ని చేపట్టాలి. 2లక్షల చదరపు అడుగుల్లో డిజైన్ చేస్తున్న ఈ లైబ్రరీ నిర్మాణాన్ని ఏడాదిలోగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోండి. విశాఖపట్నం జగదాంబ సెంట్రల్‌లో ప్రతిపాదించిన రీజనల్ లైబ్రరీని 50వేల అడుగుల్లో నిర్మించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాల్సిందిగా మంత్రి లోకేష్ ఆదేశించారు. రాష్ట్రంలో పబ్లిక్ లైబ్రరీల బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలపై మంత్రి లోకేష్ చర్చించారు. స్థానిక సంస్థల నుంచి సుమారు రూ.213 కోట్ల రూపాయల మేర సెస్సు బకాయిలు పెండింగ్ లో ఉన్నాయి. వాటిని రాబట్టి లైబ్రరీలను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజు, ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ కృతికా శుక్లా, సర్వశిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరక్టర్ బి.శ్రీనివాసరావు, విద్యా మౌలిక సదుపాయాల సంస్థ ఎండి సిఎన్ దీవెన్ రెడ్డి, పబ్లిక్ లైబ్రరీస్ డైరక్టర్ కృష్ణమోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధి శాఖపై మంత్రి నారా లోకేష్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోర్టల్ డెమోను మంత్రి లోకేష్ పరిశీలించారు.దేశానికే రోల్ మోడల్‌గా నైపుణ్యం పోర్టల్‌ను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఏడాదికి 50వేలమంది యువతకు నైపుణ్య శిక్షణకు అవకాశం ఉంటుందని వివరించారు. పీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్‌తో నైపుణ్యం పోర్టల్ అనుసంధానం చేస్తున్నామని మంత్రి వెల్లడించారు.



## కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఇంటికి చంద్రబాబు

**విజయవాడ.ఆగస్టు22,ప్రభాతవార్తప్రతినిధి:** పసి పిల్లలతో గడపటంలో ఎంతో సంతృప్తిని కల్పిస్తోందని సీఎం చంద్రబాబు అన్నారు.పిల్లలతో ఆడితే అదో ఉపశమన్నారు. ఢిల్లీలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు నివాసానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెళ్లారు. రామ్మోహన్ నాయుడు దంపతులకు ఇటీవల జన్మించిన బాబుకు దీవెనలు అందించారు. రామ్మోహన్ నాయుడు కుటుంబ సభ్యులతో ముచ్చటించారు.

## కుక్కలకు వీధుల్లో ఆహారం పెట్టొద్దు

>> చేసింది. నియంత్రణ లేకుండా ఆహారం ఇవ్వడం వల్ల అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుంటున్నాయని వచ్చిన నివేదికలను పరిగణనలోకి తీసుకుని ఈ ఆదేశాలు జారీ చేస్తున్నట్లు చెప్పింది. సామాన్య పౌరులు వీధుల్లో నడిచేటప్పుడుతీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇటువంటి పద్ధతికి స్వస్తి పలకాలని అభిప్రాయపడింది. ఢిల్లీ ఎన్‌సిఆర్‌ప్రాంతం నుంచి వీధి కుక్కలన్నింటిని తరలించాలంటూ ఆగస్టు 11న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. వీటి దాడులు పెరిగిపోవడంపై ఆందోళన వ్యక్తం చేసిన ద్విసభ్య ధర్మాసనం ఢిల్లీలో అవి ఎక్కడా కనిపించడానికి వీల్లేదని, వీటిని షెల్టర్లకు తరలించాలని తీర్పు చెప్పింది.

## యాదాద్రి విద్యుత్ కేంద్రం జనవరి 15కు జాతికి అంకితం: తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని 4 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన యాదాద్రి పవర్ ప్లాంట్‌ను జనవరి 15 నాటికి జాతికి అంకితం చేస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. అంతేకాకుండా దేశంలోనే ఉత్తమ గ్రీన్ పవర్ ఉత్పత్తి కేంద్రంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. హైదరాబాద్‌లో శుక్రవారం యాదాద్రి పవర్ ప్లాంట్ భూ నిర్వాసితులైన 500 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందచేశారు. అనంతరం మాట్లాడుతూ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ పర్యావరణ అనుమతులపై స్టే ఇవ్వగా దాదాపు రెండు సంవత్సరాల పాటు యాదాద్రి పవర్ ప్లాంట్ పనుల గురించి గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. వేలకోట్ల పెట్టుబడి తో ప్రారంభించిన ఈ యూనిట్ ఒక్కరోజు ఆలస్యమైన నేపథ్యంలో ఆర్థిక భారం తీవ్రంగా రాష్ట్ర ప్రజలపై పడిందని చెప్పారు. గత ఏడాది ఫిబ్రవరిలో మరోసారి ప్రజాభిప్రాయ సేకరణ జరిపించి పర్యావరణ అనుమతులను వెంటనే తీసుకువచ్చామని వివరించారు. అప్పటి నుండి ఈ పవర్ ప్లాంట్ పనులను పర్యవేక్షణ చేస్తూ, ప్రతి వారం ప్రాజెక్టులో పూర్తి చేయాల్సిన పనులకు క్యాలెండర్ నిర్దేశించి ఆ మేరకు ముందుకు వెళ్తున్నామని వెల్లడించారు. వీటితోపాటు పవర్‌ప్రాజెక్టుకు బొగ్గు సరఫరా చేసేందుకు రైల్వే లైన్, కార్మికులు అధికారులు ఉండేందుకు టౌన్‌షిప్‌ఏర్పాటును సకాలంలో పూర్తి చేస్తామన్నారు. ముఖ్యంగా పవర్ ప్లాంట్ పరిసరాల్లోని గ్రామాల్లో ప్రపంచ స్థాయివిద్యను,కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందిస్తామని పేర్కొన్నారు. పవర్ ప్లాంట్ పరిసరాలలోని ప్రతి మండలానికి ఒక అంబులెన్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు.

## వారం - వర్జ్యం

23-08-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు,
అమావాస్య, ఉ.11.39
మఖ రా.12.57
వర్జ్యం : ఉ.9.20-11.01
దు.తె.5.54-7.32
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం :** జీవితభాగస్వామి ద్వారా ధనలాభం పొందుతారు. నూతన వస్తులాభం.

**వృషభం :** నూతన విద్య ఉద్యోగావకాశాలు లభిస్తాయి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తిచేస్తారు.

**మిథునం:** కుటుంబసభ్యులతో కలిసి ఆనందంగా గడుపుతారు. ఇంటాబయటా అనుకూలం.

**కర్కాటకం :** దూరప్రాంతాలనుండి శుభవార్తలు అందుకుంటారు. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం.

**సింహం:** వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగులకు హోదాలు పెరుగుతాయి.

**కన్య :** భూముల విషయంలో నెలకొన్న వివాదాలు కొంతవరకు పరిష్కారమవుతాయి.

**తుల :** ఉద్యోగులకు హోదాలు పెరుగుతాయి. ఆరోగ్యం, వాహనాల విషయంలో నిర్లక్ష్యం తగదు.

**వృశ్చికం:** పరిశోధనలు, సాంకేతిక విషయాలపై ఆసక్తి చూపుతారు. ఆర్థిక పరిస్థితి అనుకూలం.

**ధనుస్సు:** పొదుపు పథకాలలో వైఫల్యం చెందకుండా జాగ్రత్తను పటించండి.

**మకరం:** సంతాన విద్యా విషయాలపట్ల శ్రద్ధ కనబరుస్తారు. సంఘంలో ప్రత్యేక గౌరవం పొందుతారు.

**కుంభం:** మిత్రుల సహాయంతో అనుకున్న కార్యక్రమాలు పూర్తిచేస్తారు.

**మీనం :** ఇంటాబయటా అనుకూల స్థితి ఉంటుంది. ఆర్థికపరిస్థితి మెరుగుపడుతుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## 8 మంది ఎజిపిలు

>> పి.గణేష్, ఆర్.మల్లిఖార్జునరావు, యు.లోవరాజు, జి.నవీన్, ఐ.సాయిగోపి మనోజ్ కృష్ణలను నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వీరు ఈ బాధ్యతల్లో 3 ఏళ్లపాటు కొనసాగనున్నారు, కన్వీనియన్స్ అలవెన్స్‌తో కూడిన గౌరవ వేతనం నెలకు రూ.44 వేలు చెల్లించనున్నట్లు పేర్కొన్నారు.

## 14 మంది నాన్ క్యాడర్ ఎస్పీ అధికారులకు ఐపిఎస్‌లుగా పదోన్నతి

**విజయవాడ, ఆగస్టు22,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర పోలీసు సర్వీసుకు చెందిన 14 మంది నాన్ క్యాడర్ ఎస్పీలకు కన్ఫర్డ్ ఐపీఎస్లుగా పదోన్నతి లభించింది. బి.లక్ష్మీనారాయణ, కె. ఈశ్వరరావు, కె.చౌడేశ్వరి, ఇ.సుప్రజ, కేవీ శ్రీనివాసరావు, కె.లావణ్యలక్ష్మి,ఎ.సురేష్బాబు,డి.హిమావతి, కె.లతామాధురి, పి.వెంకటరత్నం, కె.కృష్ణ ప్రసన్న,ఎం.సత్తిబాబు, కరీముల్లా షరీఫ్, పి.శ్రీనివాస్‌లు పదోన్నతిపొందిన వారిలో ఉన్నారు.

## నెలకు రూ.400కే ఫైబర్ టివి బేసిక్ ప్లాన్

>> దీని కోసం ఆన్‌లైన్ విధానం,సమీపంలోని బీఎస్ఎన్ఎల్ సర్వీస్ సెంటర్లను సంప్రదించచ్చు.బీఎస్ఎన్ఎల్ఎఫ్ టీటీహెచ్ వినియోగదారులు కేవలం రూ.140 చెల్లించి ఈ సేవలు పొందవచ్చు. లెఓక్ కేబుల్ ఆపరేటర్లు బీఎస్ఎన్ఎల్ టెలికాం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పార్టనర్లుగా(టీఐపీ) నమోదు చేసుకోవచ్చు. దీని గురించి అవగాహన కల్పించేందుకు మేళాలు నిర్వహిస్తాం' అని శేషాచలం వివరించారు. ఇటీవల ప్రకటించిన ఫ్రీడం ప్లాన్‌కు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చిందని,వినియోగదారుల సంఖ్య 3 రెట్లు పెరిగిందని తెలిపారు. అంత్యోదయ మిషన్‌లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 1380 4జీ టవర్లను అప్‌డేట్ చేస్తున్నట్లు తెలిపారు. సమావేజశంలో బిఎస్ఎన్ఎల్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్లు బుంగ రవికుమార్,ఎల్.శ్రీను,జిఎంలు మురళీకృష్ణ,వెంకటప్రసాద్‌లు పాల్గొన్నారు.

## సిపిఐ అగ్రనేత సురవరం ఇక లేరు

>> స్థాయి నేతగా ఎదిగారు. సురవరం సుధాకర్ రెడ్డి కొండ్రవుపల్లి అనే మారుమూల పల్లెలో జన్మించి సీపీఐ పార్టీలో జాతీయ స్థాయి నేత గా ఎదిగారని, వారు ఎన్నో ప్రజా పోరాటాలు, ఉద్యమాలు చేశారు.

23-08Pg3 gnt GNT_23-08Pg3 gnt.qxd 8/23/2025 12:48 AM Page 1





# విఘ్నేశ్వరుని పండగకు సిద్ధమౌతున్న దక్షిణ కైలాసం

**(శ్రీకాళహస్తి, ప్రభాతవార్త):** శ్రీకాళహస్తి పట్టణం వినాయక చవితి సంబరాలకుసిద్ధమౌతుంది. కొన్ని సంవత్సరాలుగా యువత రంగంలో దిగింది. ఏర్పాట్లలో యువకులు చురుగ్గా చందాలు వసూలు చేసుకూంటూ ఏర్పాట్లలో తలమునలకయ్యారు. పరిచయాలున్న చోట్లల్లా వసూలు చేసుకుంటున్నారు. అయితే విఘ్నేశ్వరుని పండగకు ఈ ఏడాది రెవెన్యూ, పోలీసు అధికారులు ఎనలేని నిబంధనలను ప్రకటించారు. విగ్రహం 12 అడుగుల దాటరాదని ఏర్పాటుకు ముందస్తు అనుమతి తీసుకోవాలని ఎన్ని రోజులు ప్రతిష్టిస్తారు? ఎన్ని రోజులకు నిమజ్జనం చేస్తారు? అనే వివరాలు ఇవ్వాలి. వినాయకుని పండగకు మరో నాలుగు రోజులు మాత్రమే సమయం ఉంది. ఈ ఏడాది శ్రీకాళహస్తీశ్వరాలయం సారధ్యంలో అతి పెద్ద విగ్రహం ఏర్పాటు చేయుటకు సన్నాహాల చేస్తున్నారు. నిబంధనలతో నిర్వాహాకులు సందిగ్దంలో ఉన్నారు. గతంలో పలుమార్లు దేవస్తానమే చవితి సంబరాలు నిర్వహిస్తుందని ప్రకటించిన ప్రకటనలు ఏమయ్యాయో? మళ్ళీ అ ఏడాది ఆర్‌డిలో దేవస్థానం అతిపెద్ద విగ్రహం ఏర్పాటు చేస్తారని ప్రకటించారు. 2014లో ఆంధ్ర రాష్ట్రంలో ఏర్పడ్డ తెలుగుదేశం ప్రభుత్వంలో ఇక మీదట దేవస్థానమే వినాయక చవితి సంబరాల్ని అధికారికంగా నిర్వహించాలని మంత్రి హోదాలో అప్పటి శాసనసభ్యుడు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ప్రకటించారు. అప్పటి చైర్మెన్ కూడా ఈ ప్రతిపాదనను అమలు చేయాలని పట్టుబట్టారు. కొంత కాలం ధర్మకర్తల మండలి కూడా ఉంది కానీ ఈ ప్రతిపాదనలు ఏమయ్యాయే ముక్కంటీశునికే ఎరుక. వారి పరిపాలన ముగిసింది. కొత్త పాలకులు మాత్రం ఉత్సవాల జోలికి పోలేదు. పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలో పండగలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. అంతేకాక పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన దివ్యక్షేత్రంలో దేవస్థానమే నెల నెలా ఒక్కొక్క ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ హిందూ పండగలకు సంబంధించి ఈ తరం వారికి అవగాహన కల్పిస్తున్నారు. ఈ నేపధ్యంలో గత 20 సంవత్సరాలుగా వినాయకచవితి సంబరాల్ని హైదరాబాదును మరిపించే విధంగా నిర్వహించారు. ఇందులో ప్రధానంగా పట్టణ నడిబొడ్డులోని బేరివారి మండపం, పెండ్లి మండపం వద్ద ప్రత్యేక కమిటిలుగా ఏర్పడి యువకులు నాలుగుమాడావీధుల్లోని వ్యాపారస్తుల భాగస్వామ్యంతో నిర్వహించారు. చవితి సంబరాలు 9 నుంచి 11 రోజులు నిర్వహించటం ఆనవాయితిగా మారింది. అయితే కొంత కాలం జోరు తగ్గింది. 9 రోజులకే పరిమితమైంది. అంతేకాక పట్టణంలోని సుమారు 400 చోట్ల వినాయక విగ్రహాల్ని ఏర్పాటు చేసి మూడు, ఐదు, ఏడు రోజులు సంబరాలు జరిపి నిమజ్జనం చేయటం జరుగుతుంది. ఈ ఏడాది ప్రధానంగా బేరి వారి మండపం వద్ద వినాయక చవితి సంబరాలను బిజెపి నాయకుడు కోలా ఆనంద్, తెలుగుదేశం నాయకుడు దుర్గాప్రసాద్‌ల సారధ్యంలో, పెండ్లిమండపం వద్ద చవితి సంబరాలను కైకాల వారి సంఘం అధ్యక్షుడు ఒబ్బుమధుసూధన్ సారధ్యంలో నిర్వహించుటకు సన్నాహాలు చేస్తున్నారు.

## సీమలో మరో రెండు కీలక సెక్షన్‌లలో ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థ

**గుంతకల్లు రైల్వే, ఆగస్టు 22,ప్రభాతవార్త** రైల్వే మంత్రిత్వ శాఖ ప్రతిష్టాత్మకంగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చేపట్టిన ఆటోమేటిక్ సిగ్నల్(ఎబిఎస్) వ్యవస్థను రాయలసీమలోని దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ పరిధిలో మరో రెండు కీలక సెక్షన్‌లలో తెచ్చేందుకు సంబంధిత ఉన్నతాధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. సుమారు రూ.750కోట్ల అంచనా వ్యయంతో 536.57కి.మీల రైలు మార్గాన్ని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు రైల్వే అధికార వర్గాలు తెలిపాయి. భద్రత, సమయ పాలనలను దృష్టిలో ఉంచుకుని భారతీయ రైల్వేలోని అత్యధిక కి.మీలను ఆటోమేటిక్ సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేస్తోంది. దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో ఈ రైళ్ల విభాగంలో ఎలాంటి అవరోధం, ఆలస్యం కలుగకుండా ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నల్ వ్యవస్థను డబ్లింగ్ రైలు (అప్‌అండ్‌డౌన్)రైలు మార్గాలను ఏకకాలంలో పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగం ప్రణాళిక సిద్ధం చేసింది. గుతకల్లు డివిజన్‌లో రేణిగుంట-గుంతకల్లు-వాడి మార్గం లో పనులను ప్రారంభించిన విషయం పాఠకులకు విధితమే. తాజాగా వాడి-గుత్తి-వాడి సెక్షన్‌లో మొలగవల్లి-ఆదోని మధ్య మొత్తంగా 31.25కి. మీలలో ఆటోమేటిక్ సిగ్నల్ వ్యవస్థను అందు బాటులో తీసుకోరానుంది. ఇందుకు సంబంధించిన నాన్-ఇంటర్లాంకింగ్ సాంకేతిక పనులను 29న చేపట్టి పూర్తి చేసి ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ వ్యవస్థను అందుబాటులో తీసుకోరానున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి.

## సీమ మీదుగా బెంగళూరు-బీదర్ మధ్య తిరిగే రైళ్లు సెప్టెంబరు వరకు పొడిగింపు

**గుంతకల్లు రైల్వే, ఆగస్టు 22,ప్రభాతవార్త** ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రాయలసీమ జిల్లాల మీదుగా బెంగళూరు-బీదర్-బెంగళూరుల మధ్య నడుపుతున్న ప్రత్యేక బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులను సెప్టెంబరు వరకు పొడిగించినట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. బెంగళూరు నుంచి బీదర్ వెళ్లే నెంబర్ 06539ప్రత్యేక బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ సెప్టెంబరు 5నుండి 28వరకు పొడిగించారు. ఈరైలు ప్రతి శుక్ర, ఆదివారాల్లో బెంగళూరు నుండి రాత్రి 9.15గంటలకు బయలుదేరి మరుసటి రోజు బీదర్ చేరుకుంటుంది.

# భారీ మొత్తంలో గంజాయి పట్టివేత

## - రైల్వే పోలీసులపై ప్రశంసల వెల్లువ



**నెల్లూరు క్రైమ్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** నెల్లూరు రైల్వే పోలీసుల తనిఖీల్లో భారీ మొత్తంలో గంజాయి పట్టుబడింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గత కొంతకాలంగా రైళ్లలో గంజాయి అక్రమ రవాణాను నిరోధించేందుకు నెల్లూరు ప్రభుత్వ రైల్వే పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. ఈ క్రమంలోనే చెన్నై నగరానికి చెందిన ఇద్దరు వ్యక్తులు గంజాయిని అక్రమంగా రవాణా చేస్తూ పోలీసులకు చిక్కారు. ఈ సంఘటన సంబంధించిన వివరాలను నెల్లూరు రైల్వే డిఎస్పి మురళీకృష్ణ శుక్రవారం తన కార్యాలయంలో వెల్లడించారు. ఆయన తెలిపిన సమాచారం మేరకు, గంజాయి రవాణాను నిరోధించే చర్యల్లో భాగంగా రైల్వే పోలీస్ సిబ్బంది తమ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నెల్లూరు, గూడూరు కావలి తదితర రైల్వేస్టేషన్లో తరచూ విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. ఈ క్రమంలో నెల్లూరు జిఆర్పి సిఐ సుధాకర్ తన సిబ్బందితో కలిసి తనిఖీలు చేపడుతున్న సమయంలో ఒరిస్సా రాష్ట్రం రాయగడ్ నుండి చెన్నై వెళ్లే 18189 రైలు నుండి దిగిన ఒక మహిళ, మరొక వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతూ ఉండడంతో వారిద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి బ్యాగులను తనిఖీ చేయగా చెన్నై నగరం ఫిషర్మెన్ పేటకు చెందిన పళని రాజేష్ వద్ద 14.5 కిలోల గంజాయి, అదే ప్రాంతానికి చెందిన జెబునిషా అనే మహిళ వద్ద 8 కిలోల గంజాయిని ప్యాకెట్ల రూపంలో పార్సిల్ చేయబడి ఉండడాన్ని గుర్తించారు. దాని విలువ రూ. 4.50 లక్షలు ఉంటుందని తెలిపారు. నిందితులు ఇద్దరిని అదుపులోకి తీసుకున్న రైల్వే పోలీసులు కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ కు ఆదేశించారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన సిఐ సుధాకర్‌తో పాటు రైల్వే ఎస్సై హరిచందన,

ఆర్పిఎఫ్ ఎస్ఐ శివరావత్, కానిస్టేబుళ్ల జయప్రకాష్, మణికంఠ, కిరణ్ కుమార్ లను ఈగల్ ఐజి రవికృష్ణ, రైల్వే డిఐజి సత్య ఏసుబాబులు ప్రత్యేకంగా అభినందించినట్లు డిఎస్పి తెలిపారు.

# ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోంది

## సెంట్రల్ జైలు బయట బారికేడ్ల వ్యవహారం దారుణం

## నా కుమారుడి పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారు

## మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

**ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బ్యూరో ఆగస్ట్ 22 (ప్రభాతవార్త):** రాష్ట్రంలో అభూతకల్పనలతో కూడిన లిక్కర్ స్కాం వ్యవహారంలో చంద్రబాబు ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి, పుంగ నూరు శాసనసభ్యుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆరోపించారు. స్థానిక సెంట్రల్ జైలులో లిక్కర్ కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న తన కుమారుడు, రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డిని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పి.విఠల్ రెడ్డి, రాజారెడ్డిలు ములాఖత్ లో భాగంగా శుక్రవారం ఉదయం కలసి మాట్లాడారు. అనంతరం జైలు బయట రామచంద్రారెడ్డి మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు తమ ప్రభుత్వ హయాంలో సెంట్రల్ జైలులో ఉన్నపుడు అన్ని రకాల సౌకర్యాలు కల్పించామని, జైలు బయట కూడా మీడియాతో సహా స్వేచ్ఛాపూరిత వాతావరణం ఉండేద న్నారు. అయితే ఇప్పుడు అందుకు భిన్నంగా పరిస్థితులున్నాయన్నారు. జైలు దరిదాపుల్లోకి కూడా మీడియాను రాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. కోర్టు ఇచ్చిన ఆదేశాలను సైతం విస్మరిస్తూ మిథున్ రెడ్డికి జైలులో సౌకర్యాలు కల్పించడంలో ఇబ్బందులు పెడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రజలందరికీ చంద్రబాబు సర్కార్ వ్యవహరిస్తున్న తీరును తెలియజేస్తామన్నారు. ఇప్పుడు ప్రవర్తిస్తున్న తీరుకు భవిష్యత్తులో తప్పనిసరిగా ప్రతిఫలం తీసుకోక తప్పదన్నారు. ములాఖత్ కు వస్తే అనేక ఇబ్బందులు కలుగజేస్తూ ఆంక్షలు విధిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం నగర వైసీపీ అధ్యక్షులు మార్గాని భరత్, కొవ్వూరు, నిడదవోలు నియోజకవర్గాల వైసీపీ కో ఆర్డినేటర్లు తలారి వెంకట్రావు, జి.శ్రీనివాస్ నాయుడు, యువ నాయకులు జక్కంపూడి గణేష్, మార్తి లక్ష్మి ..., కానుబోయిన సాగర్, న్యాయవాది సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

## చిరంజీవికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మంత్రి కందుల దుర్గేష్



**విజయవాడ, ఆగస్టు22, ప్రభాత వార్తప్రతినిధి:** తెలుగుజాతికి కళామతల్లి అందించిన ముద్దుబిడ్డ చిరంజీవి అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మెగాస్టార్ చిరంజీవి 70వ పుట్టిన రోజు సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. తన నటన, డ్యాన్స్, ఫైట్స్, మ్యానరిజంతో తెలుగు తెరకు కమర్షియల్ సినిమాల అర్థం చెప్పిన హీరో, కమర్షియల్ సక్సెస్ ల మధ్య నటనా ప్రావీణ్యాన్ని చూపించిన నటుడు చిరంజీవి అని అన్నారు. ఎన్నో కష్టాలు, సవాళ్లు, అవమానాలను తట్టుకొని స్వయంకృషితో సినీవినీలాకాశంలో మెగాస్టార్ గా ఎదిగిన ఆయన ప్రస్థానం ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు. అకుంఠిత దీక్షతో ప్రతి అవకాశాన్ని పట్టువిడవకుండా అందిపుచ్చుకొని నటనలో శిఖరాగ్రాన్ని అధిరోహించిన వ్యక్తి చిరంజీవి అన్నారు.

**చిరంజీవికి బిజెపి ఎపి చీఫ్‌మాధవ్ అభినందనలు**

మెగాస్టార్ చిరంజీవికి ఆయన జన్మదినం సందర్భంగా బిజేపీ ఏపీ చీఫ్‌మాధవ్ అభినందనలు తెలిపారు. స్వయం కృషితో చిరంజీవి చలనచిత్ర జీవితంలో అద్భుత ఫలితాలను సాధించారన్నారు. రక్తదానం, నేత్రదానం వంటి కార్యక్రమాలతో ఆయన సామాజిక సేవలో అందరికి ఆదర్శంగా నిలిచారన్నారు.

## బుడమేరుపై దుష్ప్రచారం చేస్తే కఠిన చర్యలు

### ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు

**విజయవాడ, ఆగస్ట 22,ప్రభాతవార్త ప్రతినిధి:** బుడమేరు పొంగుతుందని సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేస్తున్నారని అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎంఎల్ఏ బోండా ఉమామహేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఉదయం కండ్రిక వద్ద నుంచి గుణదల 33 తూముల వరకు బుడమేరు, కాలువలను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ …గత వర్షాకాలంలో బుడమేరు కాలువల్లోకి ఎగువ ప్రాంతాల నుంచి క్కొసారిగా భారీగా వరద నీరు వచ్చి చేరడంతో సింగ్‌నగర్ ప్రాంతం వరద ముప్పును ఎదుర్కొన్న సంగతి తెలిసిందే అని అన్నారు

# బిజెపి రాష్ట్ర నూతన కార్యవర్గం ప్రకటన

## - పార్టీ కీలక నేతలకు ప్రాధాన్యతతో కూడిన పదవులు

**విజయవాడ,ఆగస్టు 22,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ బిజెపి రాష్ట్ర నూతన కొత్త కార్యవర్గాన్ని ప్రకటించింది. ఎపి బిజెపి చీఫ్ పివిఎన్ మాధవ్ ఈ మేరకు వివరాలు వెల్లడించారు. కార్యవర్గంలో పార్టీ కీలక నేతలందరికి ప్రాధాన్యతతో కూడిన పదవులు అప్పగించారు .దాదాపు ప్రతి పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి కీలక నేతలకు నూతన కార్యవర్గంలో చోటు దక్కింది. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బిట్ర శివన్నారాయణ,( గుంటూరు) గారపాటి సీతారామాంజనేయ చౌదరి,( ఏలూరు) కాపు రామచంద్రారెడ్డి, (అనంతపురం) పుట్టేటి సురేందర్ రెడ్డి,(నెల్లూరు ) పైడి వేణు గోపాలం,( శ్రీకాకుళం) శ్రీ.కోలా ఆనంద్( తిరుపతి), బొల్లిన నిర్మలా కిషోర్ ( ఏలూరు), గుడిసె దేవానంద్, (శ్రీ సత్యసాయి) డాక్టర్ అశోక్ రాజు(చిత్తూరు) ఆడారి ఆనంద్ కుమార్(అనకాపల్లి) నియమితులయ్యారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా సన్నారెడ్డి దయాకర్ రెడ్డి( తిరుపతి) నాగోతు రమేష్ నాయుడు, (అన్నమయ్య) మట్టా ప్రసాద్(కృష్ణ), సాలగ్రామ లక్ష్మీప్రసన్న(కాకినాడ) నియమితులయ్యారు. రాష్ట్ర కార్యదర్శులుగా కె సురేంద్ర మోహన్,( విశాఖపట్నం)రెడ్డి పావని ( విజయనగరం) బొమ్ముల దత్తు, (తూర్పు గోదావరి), సురవరం గీతా మాధురి(కర్నూలు). బొద్దు నాగ లక్ష్మీ,(ఎన్టీఆర్. విజయవాడ). మేకల హనుమంత రావు,( పల్నాడు) ,సందిరెడ్డి శ్రీనివాసులు (అనంతపురం) బోగిరెడ్డి ఆదిలక్ష్మీ( పశ్చిమ గోదావరి) ఉమ్మిడి సుజాత (విశాఖపట్నం), ఈరోజి స్వప్న కుమారి (అల్లూరి సీతారామరాజు) రాష్ట్ర కోశాధికారిగా మొగళ్ల నాగేంద్రరావు(విశాఖపట్నం) రాష్ట్ర సంయుక్త కోశాధికారిగా కందుకూరి సత్య నారాయణ (నెల్లూరు) రాష్ట్ర కార్యాలయ కార్యదర్శిగా బి.ఎల్.ఎన్.పవన్ (ఎన్టీఆర్ విజయవాడ) ,రాష్ట్ర సెల్స్ కన్వీనర్‌గా .కె.చిరంజీవి రెడ్డి (అనంతపురం) రాష్ట్ర సెల్స్ కోకన్వీనర్ గా.నిడమనూరి సూర్య కళ్యాణ్ చక్రవర్తి( ప్రకాశం) నియమితులయ్యారు.


# రాష్ట్రంలో కూటమి ఎమ్మెల్యేల అరాచకాలు శ్రుతిమించాయి: మాజీ మంత్రి సాకే శైలజానాథ్



**విజయవాడ,ఆగస్టు22,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో కూటమి ఎమ్మెల్యేల అరాచకాలు శృతిమించాయని, అయినా ఒక్కరిపైనా కేసు నమోదు కావడం లేదని మాజీ మంత్రి వైసిపి నేత సాకే శైలజానాథ్ విమర్శించారు. గురువారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ అరాచకాలకు పాల్పడుతున్న ఎమ్మెల్యేలకు చంద్రబాబు వంతపాడుతున్నారని అన్నారు. దీంతో రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపుతప్పాయని, మహిళలు, ఉద్యోగులు ప్రతిపక్ష నాయకులపై దాడులు యథేశ్చగా సాగుతున్నాయని పేర్కొన్నారు. 14 నెలల పాలనలో దాడులు, దౌర్జన్యాలతో సుపరిపాలన అనే అర్థాన్నే మార్చేశారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎక్కడా పరిపాలన సాగడం లేదని పేర్కొన్నారు. వ్యవస్థలను ప్రణాళికాబద్ధంగా నాశనం చేస్తున్నారని విమర్శించారు. టిటిడి ఛైర్మన్ పదవికి మచ్చ పవిత్రమైన శ్రీవారి క్షేత్రంలో ఉండి బిఆర్ నాయుడు అనకూడని పదాలు వాడుతున్నాడని మాజీ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. హిందువుల మనోభావాలు దెబ్బతినేలా ఆయన వ్యవహారశైలి ఉందని పేర్కొన్నారు. నూజెన్, ఆర్థోఅయిల్ పేరుతో ప్రజలను వంచించాడని అన్నారు. అలాగే అటవీ సిబ్బందిపై దాడిచేసిన బుడ్డా రాజశేఖర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని, అటవీ సిబ్బందిపై దాడిచేస్తే పవన్‌కల్యాణ్‌లో స్పందన లేదని విమర్శించారు.

# తిరుమల సమాచారం

## శాస్త్రోక్తంగా కామాక్షి అమ్మవారికి లక్ష కుంకుమార్చన



**తిరుమల,ఆగస్టు 22ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడిఆధ్వర్యంలోని తిరుపతిలోని ప్రముఖ శైవాలయం కపిలేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం లక్షకుంకుమార్చన శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయఅర్చకులు కామాక్షిఅమ్మవారికి శ్రావణమాసంలో చివరి శుక్రవారం పవిత్రంగా లక్షకుంకుమార్చన వేదోక్తంగా నిర్వహించారు. ఉదయం 6 గంటల నుండి మద్యాహ్నం 12గంటల వరకు గణపతిపూజ, లక్షకుంకుమార్చనతో మొదలుపెట్టిన అర్చకులు మధ్యాహ్నం లక్షకుంకుమార్చన చేశారు. సాయంత్రం 6గంటలకు స్వామిఅమ్మవార్లు తిరువీధి ఉత్సవంలో ఊరేగింపుగా భక్తులకు దర్శనమిచ్చారు. .ఆలయ డిప్యూటీ ఇఒ నాగరత్న, ఎఇఒ సుబ్బరాజు, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, అర్చకులు పాల్గొన్నారు.

## రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందాలని వేడుకున్నా

### - మంత్రి డోలాబాలవీరాంజనేయులు



**తిరుమల,ఆగస్టు 22ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలోని ఎన్‌డిఎ ప్రభుత్వ సహకారంతో ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంక్షేమానికి పెద్దపీట వేశారని, పేదప్రజల ఆర్థిక అభివృద్ధికి ప్రాధాన్యత నిస్తున్నారని రాష్ట్రమంత్రి డోలబాల వీరాంజనేయులు తెలిపారు. ఏడాదిపాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడం జరిగిందన్నారు. మరిన్ని సంక్షేమపథకాలు అమలుచేయాలని సిఎం చంద్రబాబు కృత నిశ్చయంతో ఉన్నారన్నారు. రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందాలని, ఇందుకు దేవదేవుడు ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులుండాలని ప్రార్ధించానన్నారు. తిరుమలలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం అభినందనీయమన్నారు. కుటుంబంతో కలసి శుక్రవారం ఉదయం విఐపి బ్రేక్‌దర్శనంలో మంత్రి బాలవీరాంజనేయులు శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## శ్రీవారి ఆశీస్సులతో అన్నీ శుభాలు



**తిరుమల,ఆగస్టు 22ప్రభాతవార్తప్రతినిధి:** అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శనం చేసుకుని ఆశీస్సులందుకుంటే అన్నీ శుబాలు కలుగుతాయని ప్రముఖులు విశ్వాసం వెలిబుచ్చారు. శుక్రవారం ఉదయం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్‌కరోలే కుటుంబంతో కలసి, సినీనిర్మాత డివివి దానయ్య, ఎస్‌పిఎఫ్ డిజి డాక్టర్ త్రివిక్రమ్‌వర్మ దంపతులు ఆలయంలోనికి చేరుకున్నారు. టిటిడి అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. శ్రీవారి వారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## దేవుని ఆశీస్సులు దేశప్రజలందరిపై ఉండాలి

### - బిసివై పార్టీ అధినేత రామచంద్రయాదవ్



**తిరుమల,ఆగస్టు 22ప్రభాతవార్తప్రతినిధి:** లోకక్షేమం కాంక్షిస్తూ పుంగనూరులో మూడురోజులపాటు శ్రీలక్ష్మీనరసింహస్వామి సహిత మహా సుదర్శన యాగం నిర్వహించడం జరిగిందని బిసివై పార్టీ అధినేత బోడేరామచంద్రయాదవ్ తెలిపారు. కలియుగదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులు దేశప్రజలందరిపై ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. మహాసుదర్శనయాగం పూర్తయిన సందర్భంగా శుక్రవారం ఉదయం తిరుమలకు చేరుకుని కుటుంబంతో కలసి స్వామివారిని దర్శించుకోవడం జరిగిందన్నారు. ఉదయం విఐపి బ్రేక్‌లో కుటుంబసభ్యులతో కలసి ఆయన ఆలయంలోనికి చేరుకుని గోవిందుడి ఆశీస్సులందుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## మొదటి ఘాట్‌లో రెండు ప్రమాదాలు

### - బ్రేక్ ఫెయిల్‌తో ఆర్టీసి బస్సును ఢీ కొన్న కారు - కొండను ఢీకొన్న వ్యాన్

**తిరుమల,ఆగస్టు 22ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలనుండి తిరుపతికి వెళ్ళే మొదటిఘాట్‌లో శుక్రవారం మధ్యాహ్నం రెండు ప్రమాదాలు జరిగాయి. శ్రీవారి దర్శనానంతరం కారులో తిరుపతికి దిగుతున్న భక్తులు ఘాట్‌లో 26వ మలుపువద్ద బ్రేక్‌ఫెయిలవడంతో ముందువెళుతున్న తిరుమల డిపో ఆర్టీసి బస్సును ఢీ కొంది. ఈ సంఘటనలో కారులోప్రయాణీకులకు స్వల్పగాయాలయ్యాయి. బ్రేక్ ఫెయిలవడంతో జరిగిన ప్రమాదంతో ఘాట్‌లో ట్రాఫిక్ స్తంభించింది. వాహనాలకు అంతరాయం ఏర్పడింది. అలిపిరి ఏవిఎస్ఒ రమేశ్‌కృష్ణ సిబ్బందితో అక్కడకు చేరుకుని కారును తప్పించడంతో ట్రాఫిక్ సమస్య పరిష్కారమైంది. అలాగే సాయంత్రం మొదటిఘాట్‌లో తిరుగుప్రయాణమైన విజయవాడ భక్తుల వ్యాన్ అదుపుతప్పి గోడను ఢీకొంది. ముందుభాగం దెబ్బతింది. 10మంది విజయవాడ భక్తుల్లో ముగ్గురు పిల్లలు ఉన్నారు. వీరంతా స్వల్పగాయాలవడంతో 108లో తిరుపతికి తరలించారు. ప్రమాదాలకు గురైన వాహనాలను అలిపిరికి తరలించారు. తిరుమల ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు.


పాండిచ్చేరి యూనివర్సిటీ
(కేంద్రీయ విశ్వవిద్యాలయం - NAAC చే "A+" గ్రేడ్ గుర్తింపుతో)
డైరక్టరేట్ ఆఫ్ డిస్టన్స్ ఎడ్యుకేషన్
(AICTE & DEB, UGC చే ఆమోదింపబడిన ప్రోగామ్‌లు)
R.V. నగర్, కాలాపేట్, పుదుచ్చేరి - 605014

DDE ప్రవేశాలు 2025-26 (విద్యా సంవత్సరం)

UG ప్రోగ్రామ్‌లు: BCom, BBA, BA (హిస్టరీ), BA (ఇంగ్లీష్), BA (ఎకనామిక్స్), BA (సోషియోలజీ), BA (పొలిటికల్ సైన్స్), BA (జర్నలిజం & మాస్ కమ్యూనికేషన్) — వార్షిక ఫీజు రూ.4,975/-**
MBA ప్రోగ్రామ్‌లు: MBA (ఫైనాన్స్), MBA (జనరల్), MBA (టూరిజం), MBA (మార్కెటింగ్), MBA (ఇంటర్నేషనల్ బిజినెస్), MBA (హ్యూమన్ రిసోర్స్ మేనేజిమెంట్), MBA (ఆపరేషన్స్ & సప్లై చైన్ మేనేజిమెంట్) — 1వ సెమిస్టర్ ఫీజు రూ.17,500/-**; MBA (హాస్పిటల్ మేనేజిమెంట్) — 1వ సెమిస్టర్ ఫీజు రూ. 26,750/-**
PG ప్రోగ్రామ్‌లు: MA ఇంగ్లీష్, MA సోషియోలజీ, MA హిందీ, MCom (ఫైనాన్స్) — వార్షిక ఫీజు రూ.7,425/-**
ప్రోగ్రామ్‌లు AICTE & DEB-UGC చే ఆమోదింపబడినవి
ప్రవేశాలు "ఫస్ట్‌కమ్, ఫస్ట్ సర్వ్‌డు" బేసిస్‌పై ఇవ్వబడును
మరిన్ని ఫీజు వివరాలకు అడ్మిషన్ ఫీజుతో సహా వెబ్‌సైట్‌ను చూడండి

ఫీజు రాయితీలు:
దివ్యాంగ వ్యక్తులకు 100% ట్యూషన్ ఫీజు కన్సెషన్
50% ట్యూషన్ ఫీజు కన్సెషన్ వీరికి:
భారతీయ సేనా దళం మరియు పారామిలటరీ ఫోర్సెస్‌లో సేవలందించే రక్షణ శాఖా సిబ్బందికి
ఖైదీలు • తృణించబడిన మహిళలు • వితంతువులు • నపుంసకులు
పాండిచ్చేరి యూనివర్సిటీ యొక్క ఉపాధ్యాయేతర ఉద్యోగులు మరియు వారి బిడ్డలు (గ్రూప్ B, C & D మాత్రమే)
ఉపకార వేతనం
DDE ప్రోగ్రాంలలో ప్రవేశం పొందిన SC/ST విద్యార్థులు వారి సంబంధిత రాష్ట్ర/UT ప్రభుత్వాల నుండి వివిధ ఉపకార వేతనాలు పొందవచ్చును.

డిస్టన్స్ నమూనా క్రింద ప్రత్యేక ముఖ్యాంశాలు
ఒక కేంద్రీయ యూనివర్సిటీ నుండి డిగ్రీ
క్వాలిటీ ప్రింటెడ్ కోర్సు మెటీరియల్
అతి తక్కువ సౌలభ్యంతో ట్యూషన్ ఫీజు
విశ్వసనీయమైన సాంకేతికపరమైన ప్లాట్ ఫాం/వనరులు
ఎంపికైన కేంద్రాలలో PCP తరగతులు

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయండి
చివరి తేది : 15-09-2025*
*UGC ప్రకటనకు సంబంధించి

తదుపరి వివరాల కొరకు
వెబ్ సైట్ : https://dde.pondiuni.edu.in
ఇ మెయిల్ : ddehelpdesk@pondiuni.ac.in
ఫోన్ : 0413-2654439/441
CBC 21232/12/0001/2526 డైరెక్టర్

వార్త

కోపంగా ఉన్నప్పుడు నీవు ఏ పనీ చేయొద్దు,
అప్పుడు అన్నీ పొరపాట్లే చేస్తావు.

-బల్తజాన్

# రైతు బతుకుతో ఆటలొద్దు!

ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో రైతు ఎడాపెడా సమస్యలతో నిరాశానిస్పృహలతో బతుకుతున్నాడు. ఒకపక్క రుతుపవనాల కారణంగా ఎడతెరిపి లేని భారీవర్షాలతో పంట సంరక్షణకు ఆస్కారం లేక రైతాంగాన్ని కృంగదీస్తుంటే,మరోపక్క 'యూరియా' కొరత రైతు భవిష్యత్‌నే ప్రశ్నిస్తోంది. దేశవ్యాప్తంగా యూరియా సమస్య ఉన్నట్లు వార్తలు వస్తున్నా తెలంగాణ రాష్ట్రంలో ఉన్నంత కొరత మరెక్కడా లేదు. ఈ కొరత వాస్తవమైనదా! కృత్రిమ కొరతో అర్థంకాని పరిస్థితుల్లో రైతు వ్యవసాయశాఖ దయ కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. ఏటా వ్యవసాయ సీజనుకు ముందుగానే ఫలానా సీజన్‌లో యూరియా తదితర ఎరువులు ఎంత మేరకు కావాలి? ఈసారి ఎంత విస్తీర్ణంలో పంటల సాగు జరుగుతుంది. ఆ మేరకు ఎంత యూరియా, ఎరువులు అవసరమౌతాయో నిర్ణయించి కేంద్రాన్ని కేటాయింపులు కోరడం అనాదిగా వస్తోంది. ప్రకృతి ప్రకోపాల బారిన పడిన కర్షకుడు భారమంతా దేవుడి మీదవేస్తాడు.కానీ యూరియా కొరత భారం ఎవరి మీద వేయాలో తెలియని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. ఏకధాటిగా కురుస్తున్న వానలు, మునిగిపోయి చేలు, ఒకపక్క విచారిస్తుండడం ఒకటైతే, యూరియా కోసం అంగళ్ల చుట్టూ తిరుగుతూ,మార్క్‌ఫెడ్ దుకాణాల దయాదాక్షిణ్యాల కోసం పొద్దస్తమానం ఎదురుచూసే రైతాంగం ఒకవైపు. పైగా తమకు కావాల్సిన మొత్తం యూరియా కన్నా ఎంతో కొంత దొరికే ఎరువుకోసం ఆయా మార్కెటింగ్ దుకాణాల వద్దకు తెల్లవారుజామునే సీరియల్ కోసం తమ చెప్పులు పెట్టివస్తున్నారని ప్రత్యక్షంగా కనబడే దృశ్యాలు. గ్రామీణ ప్రాంతాల్లో మంచినీటికోసం తిప్పలుపడే మహిళలుఇలాగే వారి వంతు కోసం బిందెలు పెట్టి వచ్చే ఆనవాయితీ తెలిసిందే. ఇప్పుడు పురుషుల వంతొచ్చింది. ఆధునిక వ్యవసాయ పరికరాలు, ఎరువులు, సాగుయంత్రాలు, అందుబాటులోకి వచ్చినప్రస్తుత సమయంలో యూరియా కోసం 'చెప్పుల' వరుసలు చూడటం మనం పురోగమనంలో ఉన్నామా! తిరోగమనంలో ఉన్నామా అనే అభిప్రాయం! కలుగకమానదు. కారణమేదైనా యూరియా కొరతకు వాస్తవ కారణం కేంద్రం రాష్ట్రానికి అవసరమైనంత యూరియా ఎరువులు కేటాయించకపోవడమేనని సుస్పష్టం. రాష్ట్ర ప్రభుత్వం లోపాన్ని ఎత్తిచూపే వారెవరైనా కేంద్రం కేటాయింపుల మీద నోరెత్తరు. పదేపదే రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ఎరువుల శాఖామంత్రి జెపి నడ్డాకు తమ అవసరాలు చెప్పి వినతులు పంపుకున్నా ఎరువుల సరఫరాలో లోటు కనపడుతూనే ఉంది. అందుకే రైతుకు తగినంత యూరియా, ఎరువులు అందించలేక రాష్ట్ర ప్రభుత్వం చేతులెత్తేసింది. ప్రభుత్వం మిస్ మేనేజ్‌మెంట్ చేసిందనో కృత్రిమ కొరత సృష్టించిందనో ఆరోపణలు చేసి రైతు నుంచి సానుభూతి పొందాలని కొన్ని రాజకీయ పార్టీలు ఆది లోనే రంగప్రవే శం చేసినా అవస్థలు పడుతున్న రైతాంగానికి 'యూరియా' లోటు కేటాయింపుల సంగతి గుర్తించలేనిది కాదు.ఈ ఆగస్టు నాటికే 8.3 లక్షలమెట్రిక్ టన్నుల యూరియా తెలంగాణకు అవసరమౌతుంది. ప్రభుత్వం నుంచి ఎన్నో అభ్యర్థనలు, ఆఖరికి నాలుగు రోజుల క్రితం పార్లమెంటు ముందు ఎంపిల నిరసన ప్రదర్శన తర్వాతనే కేంద్రం దిగివచ్చింది. 50వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరాకు ఎరువులశాఖ సన్నాహాలు చేస్తోంది. రైతులకు తగినంత యూరియా సర్దలేక ప్రభుత్వం తంటాలు పడుతోంది. ఈ రేషన్ ప్రక్రియలో ఎకరాకు ఒక బస్తా యూరియా కూడా ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ లో నైతే రైతుకు రెండు, మూడు బస్తాలే. విచిత్రమేమిటంటే యూరియా కొరతను దృష్టిలో ఉంచుకొని ఓ రైతు తన స్నేహితుని ఇంట్లో వేడుకకు కానుకగా ఒక బస్తా యూరియా తీసుకెళ్లి సమర్పించుకున్నాడు. ఇలాంటి ఎన్నిసందర్భాలైనా యూరియా కొరతను చాటిచెప్పేవే. మరికొన్ని చోట్లఎరువుల దుకాణాల వాళ్లు రైతుఆదుర్దాను ఆసరా చేసుకొని తమ వద్దనున్న మ్యురేట్ ఆఫ్ పొటాష్, ఎన్‌పికె ఎరువుల చలామణికి ప్రతి రెండు బస్తాలకు ఒక బస్తా యూరియా తమ కొనుగోలు రేటుపై తీసుకోవాలని లింకు పెడ్తున్నారు. సరిగ్గా యూరియా వేయాల్సిన ఈ సమయంలో వేయకపోతే పంటకు సాగుపోషకాలుఅందక దిగుబడిపై ప్రభావం చూపుతుంది. అందుకే రైతు యూరియాను అధికధరకు బ్లాక్ మార్కెట్‌లో కొనేందుకైనా సిద్ధపడుతున్నాడు. సాధారణంగా ఇతర ఎరువులతో లింకు పెట్టి యూరియా విక్రయించడం నాలుగు దశాబ్దాల నాటి బ్లాక్ మార్కెటింగ్ విధానం ఆధునికంగా ఎంతో ఎదిగినా పూర్వకాలపు నాటివిధానాల్లో రైతు దోపిడీని కొనసాగించడం విచారకరం. కేంద్రం ఆయా రాష్ట్రప్రభుత్వాలకు వారి అవసరాలకు అనుగుణంగా కేటాయింపులు,సరఫరా చేయలేకపోవడమే నేటి రైతు దుస్థితికి కారణం. దేశీయ అవసరాలకు తగిన ఉత్పత్తి లేదు. పైగా ముందుచూపు నిర్ణయాలు తీసుకున్న దాఖలాలు లేవు. ప్రస్తుత సీజన్‌లో తెలంగాణలో 1.15 కోట్ల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేసినందున యూరియా డిమాండ్ ఎక్కువ ఉంది. వారికి కావల్సిన యూరియా అందించలేని ప్రభుత్వాలు రైతులు సాగులో అవసరమైన మోతాదు యూరియా కన్నా అధి కంగా వేస్తున్నారనే ఆరోపణలు చేస్తున్నాయి. 'ఆడలేక మద్దెల' ఓడ అన్న చందాన యూరియా కొరత వ్యవహారం నడుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో కూడాయూరియా కొరత వ్యవహారం బయటకొచ్చింది. వ్యవసాయ సీజన్‌కు అవసరమైన ఎరువులు అందించలేని పరిస్థితికి ప్రభుత్వాలే బాధ్యత వహించాలి.ఏదిఏమైనా యూరియా కొరతకు ఎవరు బాధ్యులైనా రైతుల బతుకుతో ఆటలాడుకోవడం ఏమాత్రం సమంజసం కాదు.

# అమలు చేయలేని చట్టాలెందుకు?

**ఏ తల్లిదండ్రులు తమ పిల్లలను మనస్ఫూర్తిగా అలాంటి పనులకు ఆ వయసులో పంపరనేది వాస్తవం. అయినా పేగు తెంచుకొని పుట్టిన కన్నబిడ్డలను పదిరాళ్ల కోసం పరాయిపంచకు పంపడానికి కారణం కేవలం వారి ఆర్థిక పరిస్థితే అన్నది నగ్నసత్యం. ఆ పిల్లలు చేయలేని, చేయరాని పనులెన్నో చేస్తూ మరెన్నో బాధలు అనుభవిస్తున్నారనే విషయం కూడా తల్లిదండ్రులకు తెలియంది కాదు. అయినా వారి ఆర్థిక పరిస్థితులే వారిని నోరు విప్పనీయడం లేదు. అంతేకాదు ఆ తల్లిదండ్రులకు దూరమైన ప్రేమవాత్సల్యాల కోసం ఆ పసిహృదయాలు ఎంత వేదన పడుతుంటాయో చెప్పడానికి మాటలు దొరకవు. అటు తల్లిదండ్రులను వదలి, ఇటు తమకు ఇష్టం లేని వ్యవస్థలోకి బలవంతంగా పిల్లలు ప్రవేశిస్తున్నారు. అందుకు కేవలం ఆ కుటుంబాన్ని పట్టిపీడిస్తున్న పేదరికమే ఏకైక కారణం. ఆ కోణంలో ఆలోచిస్తే కొంతలో కొంతవరకైనా ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. అంతేకానీ మూలాన్ని వదిలి చట్టాలను తెచ్చుకుంటూ కాలం గడుపుకోవడమంటే మనల్ని మనం మోసం చేసుకోవడమే.**

దామెర్ల సాయిబాబ

చేయబోయే పనిని గూర్చి తెలుసుకోవడం వివేకం, ఎలా చేయాలో తెలుసుకోవడం నైపుణ్యం, పూర్తి చేయడమే సామర్థ్యం. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు చట్టాల మీద చట్టాలు తెస్తున్నా, కఠిన శిక్షలు తప్పవని ప్రకటనలు, హెచ్చరికలు చేస్తున్నా అవి అమలు చేయడంలో జరుగుతున్న నిర్లక్ష్యం, అలక్ష్యం వంటి వాటితో ఆశించిన ఫలితాలు సాధించలేకపోతున్నారు. ఆట పాటలు, చదువు సంధ్యలతో ఆనందంగా గడపాల్సిన కోట్లాది మంది బాలల జీవితాలు కళ్లముందే బుగ్గిపాలవుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర పాలకుల మాటలు నీటి మూటలవుతున్నాయి. పాత చట్టాలకు మరింత పదును పెట్టి పకడ్బందీగా సరికొత్త చట్టాలు తీసుకువచ్చామని నేతలు చెప్పుకుంటున్నా శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలన్నట్లు ఏదో ఒక మార్గంద్వారా ఈ వ్యవస్థ కొనసాగుతూనే ఉన్నది. అన్నింటికంటే ముఖ్యంగా ఏళ్లతరబడి మగ్గుతున్న బాలకార్మికులను ఆ కూపం నుంచి బయటకు తీసుకువచ్చినా వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమవుతున్నాయి. క్షేత్రస్థాయిలో జరుగుతున్న వాస్తవ విషయాలను పరిగణనలోకి తీసుకొని నిర్దిష్ట చర్యల వైపు అడుగులు వేయలేకపోతున్నాయి. ఇది అధికారులకు అందరికి తెలిసిన సత్యమే అయినా ప్రభుత్వాన్ని నమ్మించేందుకు కాగితాల మీద ఏవేవో రాసుకొని కాలం గడుపుతున్నారు. అందుకే చట్టాలు, శిక్షలు కాగితాలకే పరిమితం కావడంతో ఈవ్యవస్థ నేటికీ నిరాటంకంగా కొనసాగుతున్నది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మొదలు ప్రస్తుత ప్రధాని నరేంద్రమోడీ వరకు అటు రాష్ట్రపతులందరితోపాటు ఎందరో దేశాధినేతలు బాలలపట్ల అత్యంత ప్రేమాదరణలు చూపిన వారే. ఈ బాలలే భావిభారత పౌరులని, వారి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆశించిన వారే. ఆ దిశలో ఎన్నో కార్యక్రమాలు, మరెన్నో పథకాలు ప్రవేశపెట్టి ప్రోత్సహించినవారే. రాజ్యాంగంలోని 24వ అధికరణం బాల కార్మిక వ్యవస్థను సమూలంగా వ్యతిరేకిస్తున్నది. వయసుకు మించిన పనుల్లో పిల్లలను వ్యక్తులు కానీ, సంస్థలు కానీ పనిలో పెట్టుకోకూడదని నిర్దేశిస్తున్నది. రాజ్యాంలోని 39(ఇ) అధికరణం కూడా ఇదే విషయాన్ని స్పష్టంగా పేర్కొంటున్నది. లేత వయసులో ఉన్న పిల్లలను వారి వయసుకు మించిన పనుల్లో పెట్టుకోకూడదని రాజ్యాంగ నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. తల్లిదండ్రులు కూడా తమ ఆర్థిక అవసరాల నిమిత్తం పిల్లలను వయసుకు మించిన భారం అప్పగించకూడదని రాజ్యాంగ నిబంధనలు ఘోషిస్తున్నాయి. మరోకపక్క ప్రమాదాలకు అవకాశం ఉన్న పరిశ్రమలు, గనుల వంటి ప్రదేశాల్లో బాలలను నియమించరాదని మరో చట్టాన్ని తీసుకువచ్చారు. రాజ్యాంగ నిర్దేశాలు, చట్టాల వల్ల అంతగా ఫలితం లేకపోవడంతో బాల కార్మిక వ్యవస్థలో మార్పులు లేకపోగా మరింత పెరుగుతుండడంతో 1979లో గురుపాద స్వామి కమిటీని కేంద్రప్రభుత్వం నియమించింది. ఆ కమిటీ అధ్యయనం అనంతరం చేసిన సిఫార్సుల ఆధారంగా 1986లో బాలకార్మిక వ్యవస్థ నిషేధ నియంత్రణ చట్టం తీసుకువచ్చారు. ప్రమాదకర వృత్తుల్లో పనిచేసేవారికి పునరావసంపై దృష్టిసారించేందుకు 1947లో జాతీయ విధానాన్ని రూపొందించారు.1988 నుంచి కార్మిక ఉపాధికల్పన మంత్రిత్వశాఖ బాల కార్మికుల పునరావాసానికి పెద్ద సంఖ్యలో పథకాలను అమలు చేసింది. అయినా ఆశించిన ఫలితాలు చేకూరలేదు. 1994లో ఈ విషయంలో ఆందోళన చెందిన కేంద్ర ప్రభుత్వం అప్పటి ప్రధాని పి.వి

ఒక్క మాట

నర్సింహారావు పటిష్టమైన చర్యలకు ఆదేశించారు. 2000 సంవత్సరం నాటికి బాలకార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించగలమని ప్రకటించారు. అది కూడా కాగితాలకే పరిమితమైంది. రోజురోజుకు పెరిగిపోతున్న బాలకార్మికుల సంఖ్యను చూసి ఆందోళన చెందిన సర్వోన్నత న్యాయస్థానం కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించింది. దీంతో కేంద్ర ప్రభుత్వం ఉన్న చట్టాలతో బాలకార్మిక నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయడం సాధ్యంకాదని భావించి మరో కొత్తచట్టాన్ని తీసుకువచ్చారు. దేశవ్యాప్తంగా ఇళ్లల్లో పనిచేస్తున్న లక్షలాది మంది బాలకార్మికుల భవిష్యత్‌కు భరోసా కల్పించి వారికి అక్షరాలు నేర్పించి చైతన్యవంతులను చేయాలని నడుం బిగించింది. ఆ చట్టప్రకారమే ఇళ్లల్లోనూ, హోటళ్లు, రెస్టారెంట్లు, బార్లు, తదితర చోట్ల పనిచేసే బాల కార్మికులకు విముక్తి కల్పించి ప్రత్యామ్నాయం చూపాలని నిర్దేశించారు. ఇందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని బాలలను పనిలో నియమించుకునేవారిపై క్రిమినల్ కేసులు పెట్టి జరిమానాలతోపాటు జైలుశిక్షలు కూడా విధించే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు ప్రకటించారు. ఈ హడావుడి హంగామా చూసి కొంతలో కొంత మార్పు వస్తుందని ఆశించారు. క్షేత్రస్థాయి విషయాలపై ఎయిర్‌కండిషన్ గదుల్లో ఉంటే అధికారులకు తెలియకపోవడం, అవసరమైన సిబ్బంది లేకపోవడంతో ఆశించిన ఫలితాలు చేకూరలేదు. ఇళ్లల్లో, హోటళ్లలో, రెస్టారెంట్లలో ఇటుక బట్టీల్లో తదితర ప్రాంతాల్లో పనిచేస్తున్న బాలకార్మికులను కొందరిని బయటకు తీసుకువచ్చారు. వారికి విముక్తి కల్పిస్తున్నట్లు ప్రచారం చేసుకున్నారు. అంతవరకు బాగానేఉంది. కానీ వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో విఫలమయ్యారు.ఆనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా లక్షలసంఖ్యలో బాలకార్మికులు ఉంటే వేల మందిని బయటకు తీసుకువచ్చారు. వందల సంఖ్యలో మాత్రమే పునరావాసం కల్పించారు. ఆ వందల సంఖ్యలో ఉన్న పిల్లలు కూడా పునరావాసం సంతృప్తికరంగా లేకపోవడంతో తిరిగి పాత బాటే మేలని భావించి అందులోకే వెళ్లిపోయారు. పిల్లల పునరావాసం కోసం రెసిడెన్షియల్, బ్రిడ్జ్ సెంటర్లు ఎంతో విజయవంతంగా పనిచేశాయని రికార్డుల్లో రాసుకున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. తల్లిదండ్రులకు కూడా ప్రభుత్వం కల్పించే పునరావాసం కార్యక్రమాల మీద నమ్మకం లేకుండాపోయింది. ఇటు చదువు రాక, అటు పనిరాక రెంటికిచెడ్డ రేవడిలా తయారై మరోమార్గంలో పయనిస్తారన్న భయంలో పాత బాటే పట్టించారు.ఇక ప్రభుత్వపాఠశాలల్లో చేర్చే ఈ బాలల పరిస్థితి మరోరకంగా మారింది. పన్నెండు, పదమూడేళ్ల వయసున్న పిల్లలను ఒకటో, రెండో తరగతిలోనో నాలుగైదేళ్ల వయసు ఉన్న పిల్లలతో కలిపి కూర్చోబెడితే ఏమవుతుందో పెద్దలు ఆలోచించకపోవడం దురదృష్టకరం. ఉపాధ్యాయులు కూడా ఎంతో ఇబ్బంది పడ్డారు. ప్రధానంగా తొమ్మిది, పదేళ్ల తేడా ఉన్న పిల్లలతో కలిసి చదువుకోడానికి వారు నమూషిగా భావించారు. ఫలితంగా ఏదో కొన్ని రోజులుపాటు పాఠశాలలకు వెళ్లినా ఆ తర్వాత స్వస్తి చెప్పి పాతబాటే పట్టారు. వారికి భవిష్యత్ గురించి వివరించి, కౌన్సిలింగ్ సమర్థవంతంగా, సక్రమంగా చేయలేకపోవడం కూడా పెద్ద లోపంగా చెప్పొచ్చు. అందుకే బాలకార్మికులను కూపం నుంచి బయటకు తెచ్చి పునరావాసం కల్పించామని చేసినప్రకటనలు ప్రచారార్భాటాలుగానే మిగిలిపోయాయి. బ్రిడ్జ్ సెంటర్లు,పాఠశాలల్లో చేర్పించామని చెప్పుకున్నపిల్లల్లో అధికశాతం పాతపనుల్లోకే వెళ్లిపోయారు. ఇప్పటికైనానేతలు వాస్తవాలు గ్రహించాలి. చట్టాలు తెస్తే సరిపోదు. చట్టాలు ఎన్ని తెచ్చినా ఒరిగే ప్రయోజనం ఉండదు. వాటిని త్రికరణ శుద్ధిగా అమలు చేసే సిబ్బంది కావాలి. దీనికితోడు లేత వయసులో చదువు సంధ్యలతో ఆడుతూ పాడుతూ కళ్ల ముందు ఉండాల్సిన పిల్లలు ఎక్కడో కన్పించని ప్రాంతాలకు పనికోసం పంపుతున్న ఆ తల్లిదండ్రులు ఎంతటి మానసిక క్షోభకు గురవుతారో ఒక్కసారి మనసుపెట్టి ఆలోచించాలి. ఏ తల్లిదండ్రులు తమ పిల్లలను మనస్ఫూర్తిగా అలాంటి పనులకు ఆ వయసులో పంపరనేది వాస్తవం. అయినా పేగు తెంచుకొని పుట్టినకన్నబిడ్డలను పదిరాళ్ల కోసం పరాయిపంచకు పంపడానికి కారణం కేవలం వారి ఆర్థిక పరిస్థితే అన్నది నగ్నసత్యం. ఆ పిల్లలు చేయలేని, చేయరాని పనులెన్నో చేస్తూ మరెన్నో బాధలు అనుభవిస్తున్నారనే విషయంకూడా తల్లిదండ్రులకు తెలియంది కాదు. అయినా వారి ఆర్థిక పరిస్థితులే వారిని నోరువిప్పనీయడం లేదు. అంతేకాదు ఆ తల్లిదండ్రులకు దూరమైన ప్రేమవాత్సల్యాల కోసం ఆ పసిహృదయాలు ఎంత వేదన పడుతుంటాయో చెప్పడానికి మాటలు దొరకవు.అటు తల్లిదండ్రులను వదిలి,ఇటు తమకు ఇష్టంలేని వ్యవస్థలోకి బలవంతంగా పిల్లలు ప్రవేశిస్తున్నారు. అందుకు కేవలం ఆ కుటుంబాన్ని పట్టిపీడిస్తున్న పేదరికమే ఏకైక కారణం. ఆ కోణంలో ఆలోచిస్తే కొంతలో కొంతవరకైనా ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. అంతేకానీ మూలాన్ని వదిలి చట్టాలను తెచ్చుకుంటూ కాలం గడుపుకోవడమంటే మనల్ని మనం మోసం చేసుకోవడమే. •

చదరంగంలో మాదిరిగానే జీవితంలో కూడా ముందు చూపు ఎంతో అవసరం.



వి.జాన్సన్

ధైర్యం ఒక ఆయుధం. దాన్ని పట్టుకుంటే అసాధ్యాలన్నీ సుసాధ్యాలౌతాయి.



జార్జి. ఎలియట్

# చందమామ అందిన పండుగ రోజు..

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

ఆగస్టు 23, 2025 రోజున భారతదేశవ్యాప్తంగా 2వ జాతీయ అంతరిక్ష దినోత్సవం, లేదా 'నేషనల్ స్పేస్ డే' వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్న శుభ సందర్భంగా భారతీయులు అందరూ, ముఖ్యంగా విద్యాలయాల్లో చదువుకుంటున్న విద్యార్థినీ విద్యార్థులు,యువతరం భావించాలి. 23 ఆగస్టు 2023 రోజున భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ, ఇస్రో చేపట్టిన చంద్రయాన్3 ప్రయోగం విజయవంతమైన రోజుగా భారత అంతరిక్ష చరిత్రలో లిఖించబడింది. ఆ రోజున విక్రమ్ ల్యాండర్ చంద్రుడి ఉపరితలంపై సురక్షితంగా, సాఫ్ట్ ల్యాండింగ్ కావడం జరిగింది.అంతేకాకుండా ప్రపంచంలోనే తొలిసారి చంద్రుడి దక్షిణ ధృవ ప్రాంతంలో ల్యాండింగ్ కావడం ఒక విశేషంగా చెప్పబడింది. చంద్రమండల దక్షిణ ధ్రువం ప్రాంతంలో ల్యాండ్ అయిన ప్రదేశాన్ని 'శివశక్తి పాయింట్'గా కూడా నామకరణం చేయడం జరిగింది. ఈ విధంగా విజయవంతంగా చంద్రమండలంపైల్యాండ్ అయిన రోజుకు గుర్తుగా ప్రతి ఏటా 23 ఆగస్టున దేశ వ్యాప్తంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం జరుపుకోవాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం ముదావహం. జాతీయ అంతరిక్ష దినోత్సవ వేదికగా ఇస్రో సాధించిన ఘనకార్యాలను నేటి యువతకు వివరించడం,భారత అంతరిక్ష టెక్నాలజీలో వస్తున్న పెను ఆధునిక మార్పులను ఎక్కుపెట్టడం, నేటి యువతరాన్ని అంతరిక్ష రంగం వైపుకు ఆకర్షించడం, అంతరిక్షరంగంలో వస్తున్న టెక్నాలజీ మార్పులను ఆసక్తికరంగా ప్రయోగ పూర్వకంగా వివరించడం లాంటి కార్యక్రమాలను నిర్వహించడం ఉచితంగా ఉంటుంది. భారతీయ యువతను స్టెమ్ కోర్సుల వైపు ఆకర్షించడానికి 'స్పేస్ ఆన్ వీల్స్' 'స్పేస్ ట్యూటర్స్'లను వినియోగించడం, అంతరిక్ష ఆవిష్కరణ గూర్చి విడమర్చి తెలుపడం, జాతీయ అభివృద్ధితో పాటు సమైక్యతను సాధించడం, విద్యాలయాల్లో అంతరిక్ష అంశాల్లో పలు పోటీలను నిర్వహించడం లాంటివి నిర్వహించాలి. 'పురాతన పరిజ్ఞానం నుంచి అనంత అవకాశాలు' అనబడే అంశాన్ని తీసుకొని వివరించడం కొనసాగుతున్నది. సాంప్రదాయ ఖగోళ శాస్త్రంతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసంధానం చేస్తూ ముందుకు సాగడం ముఖ్యమని కూడా అవగాహన కల్పించడం జరుగుతోంది. అంతరిక్ష శాస్త్రంపట్ల యువత దృష్టిని ఆకర్షిస్తూ, వారిని అంతరిక్ష కోర్సుల వైపు మరల్చడం అనే ప్రధాన ఉద్దేశంతో పలు కార్యక్రమాలను పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించడం నేటి అవసరంగా భావించాలి. ఇస్రో శాస్త్రవేత్తలతో ముఖాముఖి,ప్లానిటోరియం సందర్శనం,శాస్త్రజ్ఞులతో ప్రసంగాలు, అంతరిక్ష అంశాల్లో పోటీలు, శుభాంశ్ శుక్లా లాంటి వ్యోమగాములతో ప్రసంగాలు లాంటి వన్నీ ఏర్పాటు చేయడం వల్ల మంచి ఆశించిన ఫలితాలు సిద్ధిస్తాయని నమ్మాలి.భారత అంతరిక్ష పరిశోధనలతో మానవాళికి ఎనలేని ప్రయోజనాలు ఒనగూరుతాయని తెలుసుకోవాలి. కమ్యునికేషన్స్,వాతావరణ మార్పులు, విపత్తుల ముందస్తు అంచనాలు, టెలివిజన్‌ప్రసారాలు, వ్యవసాయరంగ ప్రయోజనాలు,దేశ ఆర్థికాభివృద్ధి, స్మార్ట్‌ఫోన్,ఆన్‌లైన్ లాంటి అనువర్తనాలను కలిగిస్తున్న ఇస్రో సేవలు మరిచిపోలేనివి. •

# ప్రజావాక్కు



### మెరిట్ లిస్ట్ ప్రకటించిన తర్వాత డిఎస్సీ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ నియామకాల కోసం డిఎస్సీ 2025 నిర్వహించింది. రేపో మాపో ఫలితాలు వెల్లడించే అవకాశాలు ఉన్నాయి. అయితే నేరుగా డిఎస్సీ నియామకాలకు సంబంధించి ఎంపికజాబితా విడుదల చేయాలని ప్రభుత్వం సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. కానీ డీఎస్సీ 2025 అభ్యర్థుల మెరిట్ లిస్ట్ ప్రకటించిన తర్వాత సెలక్షన్ లిస్ట్ ప్రకటించి నియామకాలు జరపాలి. డిఎస్సీ 2025 నియామకాలకు సంబంధించి మెరిట్ లిస్ట్ ముందు ప్రకటించి తర్వాత సెలెక్షన్ జాబితా విడుదల చేయాలి. కానీ నేరుగా సెలక్షన్ జాబితా ప్రకటించి సర్టిఫికేట్‌ల వెరిఫికేషన్ చేయడం సరికాదు. నేరుగా సెలెక్షన్ జాబితా విడుదల చేయడం జరిగితే రిజర్వ్ కేటగిరీ అభ్యర్థులకుఅనగాఎస్సీ,ఎస్టీ,బీసీ, మహిళా అభ్యర్థులకు నష్టం జరిగే అవకాశం ఉంది. గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదు. మెరిట్ లిస్ట్ ప్రకటించి అన్ని రిజర్వ్ కేటగిరీలకు కటాఫ్ మార్కులుతెలియజేసిన అనంతరం నియామకాలు చేపట్టేవారు.కాబట్టి ప్రస్తుతప్రభుత్వం గతంలోలాగా మెరిట్‌లిస్ట్ ప్రకటించిన తరువాతే నియామకాలు చేపట్టాలి.

- వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

### ఉద్యోగం నుండి తొలగించే బిల్లు

ప్రభుత్వ ఉద్యోగులు ఐపిఎస్, ఐఎఎస్ నుండి అటెండర్ వరకూ అన్ని శాఖల అధికారులు లంచం తీసుకొని దొరికితే, ప్రభుత్వ ఉద్యోగులకు సస్పెండ్ కాకుండా ఉద్యోగం నుండి తొలగించే బిల్లునుతేవాలి.అప్పుడే ప్రభుత్వ సంక్షేమ పథకాలనుపేదప్రజలకు అందుతాయి.అప్పుడు ప్రభుత్వానికి ప్రజలకు నమ్మకం, గౌరవం ఉంటుంది. ప్రభుత్వానికి జవాబుదారీతనం నిలుస్తుంది. ఈ బిల్లు వాళ్ల ఎందరికో దక్కాల్సిన ప్రభుత్వ ఫలాలు, అన్యాక్రాంతం కాకుండా ఉంటుంది.

- సరాఫ్ ప్రభాకర్ చారి, మేడ్చల్

### ఢిల్లీ సిఎం మీద దాడి హేయం

ప్రజల నుంచి ఫిర్యాదులు అందుకునేందుకు ప్రతీవారం నిర్వహిస్తున్న జన్ సున్‌వాయి కార్యక్రమంలో పాల్గొన్న ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తాపై దాడి అమానుషం. ముఖ్యమంత్రికే రక్షణ లేకపోతే మామూలు వారి పరిస్థితి ఏమిటి అనే సందేహం కలుగుతుంది. మరో మారు ఇలాంటి ఘటనలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

### కుక్కల బెడద నుంచి రక్షణ కావాలి

మనుషుల్లో మానవత్వం కరవవుతున్నట్లే కుక్కల్లో విశ్వాసం సన్నగిల్లుతోంది.వీటి సంతానం దినాభివృద్ధి చెందుతోంది. ఏ వీధిలో చూసినా ఈ కుక్కలు వీరవిహారం చేస్తూ పాదచారులనుకరుస్తున్నాయి.రోజూ వందమందిని గాయపరుస్తున్నా యని ఓ దినపత్రికలో వచ్చిన వార్త. స్కూటర్లు మీదవెడుతున్న వారిని వెంబడించి మరీ కాటేస్తున్నాయి. కొందరు మహిళలు భయపడి కింద పడిపోతున్నారు. కాళ్ళు, చేతులు విరిగి ఆసుపత్రుల పాలవుతున్నారు.ఈకుక్కలు పొరబాటున చిన్న కారుల కిందో, స్కూటర్ల కింద పడి కాలు విరిగో, చనిపోతేనో జంతు ప్రేమికుల సంఘాలు వెంటనే పోగయి విపరీతంగా గొడవలు సృష్టించి నానాయాగీ చేస్తూ వాటి వైద్యానికి డబ్బు ఇవ్వాలంటున్నారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ వారు వచ్చివీధులలో సంచరించే కుక్కలను పట్టి ఎక్కడైనా వదలాలి. ప్రజల ప్రాణాలను కాపాడవలసిన బాధ్యత ప్రభుత్వానిదే.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### ఆన్‌లైన్ గేమింగ్‌పై నిషేధం

ప్రస్తుతం మొబైల్ వినియోగం అందరికీ తప్పనిసరి అయింది. ఈ స్థితిలో ఆన్లైన్ గేమింగ్, క్రికెట్ బెట్టింగ్ యాప్‌ల ద్వారా వివిధ మధ్యవర్తులను ఉపయోగించి జూదం ద్వారా సొమ్ము ఆర్జిస్తున్నారు. పోయినవాడు వాడి గతికి వ్యాపారం చేయించిన వాడు లాభాన్నే చూస్తాడు. కావున పార్లమెంట్‌లో దీనిపై చట్టం తేవడం అవసరమే. అమలు చేయడం కూడా ప్రభుత్వ బాధ్యతతో అధికార యంత్రాగం కూడా పనిచేస్తే చాలా మంచిది. ముఖ్యంగా నిరుద్యోగులు, చెడు అలవాట్లకు బానిసైన వ్యక్తులు విముక్తి చెందుతారు. ఇప్పటికే విద్యార్థులను పరోక్షంగా వారి చదువులను భంగపరచి అనూహ్య పరిణామాలు వస్తున్నాయి. విజ్ఞులు ఈ విషయాన్ని వారి స్థాయిలో సహకరించి చట్టాన్ని అమలు చేయడం, సమాజ శ్రేయస్సు కోరడం తమ బాధ్యత.

-బొల్లోజు మేఘనాథం, విశాఖపట్నం

### సమస్యలను తక్షణం పరిష్కరించాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోప్రతీసోమవారం కలెక్టర్‌లు,ఎస్పీలు నిర్వహించే స్పందనకు వచ్చే సమస్యలను తక్షణం తక్కువ సమయంలో పరిష్కరించేలా ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలి.ప్రజలు వారివారి ఎన్నో సమస్యలను పరిష్కరించుకునేందుకు స్పందనకు వస్తూ ఉంటారు.స్పందనకు వచ్చే సమస్యలను పరిష్కరించేలా చర్య తీసుకోవాలి.

-డి. చాంద్ బాషా, కర్నూలు

# ఆదివాసుల్లోకి అన్య సంస్కృతుల ప్రమాదం!



గుమ్మడి లక్ష్మీనారాయణ

'ఆదివాసీలు హిందువులే' అంటూ ఇటీవల కొందరు వ్యాసకర్తలు రాస్తున్నారు. ఆదివాసులు హిందువులే అనే కంటే హిందు మతాన్ని 'అనుసరించే వాళ్లు' మాత్రమే అంటే బాగుంటుంది. సాధారణంగా హిందూ మత పండుగలను, ఆచార వ్యవహారాలను నవీన కాలంలో కొన్ని తెగల ఆదివాసీలు పాటిస్తున్నారు. కానీ హిందూ ఆచారాలు, అనేక దేవుళ్ల పుట్టుక చరిత్ర వెనుక ఆదివాసీల చారిత్రక నేపథ్యం దాగున్నదని మరచిపోతున్నారు మేధావులు. పురానేతిహాసాల్లో, వేదాలలో భక్త కన్నప్ప, ఏకలవ్యుడు, చెంచులక్ష్మి, శబరి తదితరులు గిరిజన ఆదివాసీలు కాదా? ఆదివాసులను మతపర ఉచ్చులోకి లాగడానికి ఒక అసంబద్ధ ప్రయత్నం జరుగుతోంది! ఆదిమానవులైన ఆదివాసుల సంస్కృతీ, సంప్రదాయ, ఆచారాలే క్రమంగా హిందూ మతాచారాలుగా మారాయి. కాబట్టి ఈ మూలవాసులది పురాతన 'ఆదివాసీ మతం' అనటం సమంజసంగా ఉంటుంది. విలక్షణమైన జీవితం ఆదివాసులది. వీరు ఆదిమ కాలం నుంచి ఆచార సంస్కృతులకు చిరునామాదారులు. మూలవాసీ సంస్కృతి ఆచారాలను తప్పక పాటిస్తారు.నేడు కాలానుగుణంగా వస్తున్న ఆధునిక మార్పుల్లో భాగస్వాములు అవుతున్నారు. ఆధ్యాత్మికత, భక్తి భావానికి గల భేదాలు తెలియని ఈ గిరిజనులకు తెలిసిందల్లా నమ్మకంతో ముడిపడ్డ భక్తి మాత్రమే. దానినే ఆచరిస్తారు. వారికి ఉన్నది సాధారణ పరిజ్ఞానం మాత్రమే. మౌఖిక సాహిత్యం వల్ల, ఆధ్యాత్మిక చింతనలు, పునర్జన్మలు, ముక్తి మార్గాలు వారికి తెలియవు. బ్రతికినన్ని రోజులుఆరోగ్యంగా, ఆనందంగా, ఉల్లాసంగా జీవించటం మాత్రమే వారికి అవసరం. వారికి గల నిండైన కృతజ్ఞత, విశ్వాసాల సాక్షిగా నిరాకారులైన వారివారి కుల, గ్రామ దేవర్లనే పూజిస్తారు. వారి ఇలవేల్పులైన నాగోబా, జంగుబాయి, పెర్స పేన్, మేడారం సమ్మక్క, సారక్క, గుంజేడు ముసలమ్మ, కొమ్ములమ్మ, సడలమ్మ, గట్టమ్మ, దూలరాజు, మారయ్య వంటి దైవాలను గౌరవించుకుంటారు. మొక్కులు చెల్లించుకుని జీవిస్తుంటారు. వారికి వ్రతాలు, నోములు, పూజలు, మంత్రాలు, హోమాలు తదితర వాటితో సంబంధం లేదు. వాటిని ఆచరించి అంతులేని పుణ్యం, సంపదలు రావాలని వారు కోరుకోరు. వాటి అవసరం కూడా వారికి లేదు. కేవలం వారి పూర్వాచారాలే వారసత్వంగా అమలవుతున్నవి. అనారోగ్యం పాలైతే తెలిసిన మూలికా వైద్యం చేసుకుంటారు. మనోధైర్యం కోసం వారాంతపు దేవర్ల దగ్గరకు వెళ్లి పూనకం దేవర్లు చెప్పే ధైర్యపు మాటలు వింటారు. దీనితో మనోధైర్యం పెంచుకొని జబ్బుల బారి నుండి బయటపడుతుంటారు. పంటలు బాగా పండాలని కోరుకుంటారు. పంటలు బాగా పండాలని దేవర్లకు మొక్కుకుంటారు.



కృతజ్ఞతతో వారికి ధాన్యం, ఇప్పసారా,మాంసాహారం వంటి వాటిని ప్రసాదంగా సమర్పించుకుంటారు. ఒకరకంగా గిరిజనుల భక్తి భావనలో కేవలం నమ్మకం, కృతజ్ఞతలు తప్ప ప్రతిఫలాపేక్ష ఏ మాత్రం ఉండదు. ఇది ఒకనాటి గిరిజనుల భక్తి భావనల తీరు. అయితే, నేటి ఆధునికకాలంలోవస్తున్న మార్పుల్లో భాగంగా వీరి భక్తి విధానాలలో కొన్ని మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఆధునిక దైవాలైన శ్రీరాముడు, ఆంజనేయులు, గణపతి, అయ్యప్పలను పూజిస్తున్నారు. మాల ధారణలు, దీక్షలు మొదలు పెట్టారు. మొదట జంగుబాయి, సమ్మక్క సారక్క మాలధారణ దీక్షలకే పరిమితమయ్యేవారు. వీరు, గిరిజనేతరులతో కూడా కలిసి విడివిడిగా భక్తి కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నారు. అందులో భాగంగానే, ఇటీవల గిరిజన గ్రామాల్లో విరివిగా గణేష్ మండపాలు వెలిశాయి. గ్రామస్తులంతా చందాలు వేసుకుని పూర్తి ఆధునిక పద్ధతుల్లో పూజలు నిర్వహిస్తున్నారు. నవరాత్రులు మొత్తం పూజలు చేసే ఆర్థిక స్తోమత లేక మూడు లేదా ఐదు రాత్రులతో ముగించి నిమజ్జనం చేస్తున్నారు. అనంతరం సామూహిక అన్నదానంలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయితే, నిమజ్జనం,శోభాయాత్రల్లో మాత్రం తమదైన డోలు వాయిద్యం, గిరిజన నృత్యాలతో సాంప్రదాయపు ఊరేగింపులు నిర్వహిస్తున్నారు. దీనితో తమ గిరిజన సంస్కృతిని చాటుకోవడం విశేషం.ఇదే క్రమంలో సంక్రాంతి నాడు శ్రీరామభజన చేస్తూ గిరిజనగ్రామాల్లో పల్లకి సేవలు నిర్వహిస్తు న్నారు. సమీప ప్రాంతాల్లో జరిగే శివరాత్రి నాటి శివకళ్యాణం, హెలీకి, శ్రీరామ నవమి నాటి సీతారామ కళ్యాణం జరుపుకుంటున్నారు.నృసింహ జయంతికి జరిపే నరసింహ కళ్యాణం జరుపుకుంటున్నారు. భద్రాచలంలోని రామాలయంలో శబరి స్మృతియాత్ర వంటివివిధ తీర్థాలకు గిరిజనులు అధిక సంఖ్యలో వెళుతున్నారు. ఈ మధ్యన భగవద్గీత త్రైత కమిటీ ద్వారా కృష్ణుని పల్లకి సేవ, జయంతి పూజలు చేశారు. కాని వీటి వెనుక మనువాదం మిళితం అయిందని ఆలోచించడం లేదు.కానీ, తమ సంస్కృతికి విఘాతం ఏర్పడితే గిరిజన జాతి ఉనికికే ప్రమాదమని గ్రహించాలి. గిరిజనుల్లో అధికంగా సామూహిక కార్యక్రమాలు, ప్రయాణాలు ఉంటాయి. మద్యపాన వ్యసనం నుండి దూరం కావడం కోసం ఈకార్యక్రమాలు చేస్తుంటారు. సాధారణ ఆరోగ్యం కోసం, గిరిజన యువత అధికంగా మాలధారణ దీక్షలు చేపడుతున్నారు. వారిదైన గిరిజన సంస్కృతికి సంబంధించిన కొత్తలపండుగ, విత్తనాల పండుగ, వివిధ తెగల, గోత్రాలకు నిర్దేశించిన ఇలవేల్పు పండుగలను మర్చిపోతున్నారు. గ్రామపండుగలైన ఎల్లమ్మ, పోచమ్మ,పెద్దమ్మ తదితర పండుగలకు, జాతర్లకు కూడా దూరమవుతున్నారు. ఇలాంటి సంక్షోభ సమయంలో అక్షరాస్యులు, ఉద్యోగులైన గిరిజనయువత ఏర్పాటు చేసుకున్న తుడుందెబ్బ, సంక్షేమ పరిషత్,ఆదివాసీ సేన తదితర గిరిజన సంఘాలు ఆధునిక భక్తి భావాలపట్ల వ్యతిరేకతను ప్రకటిస్తున్నాయి. తమదైన గిరిజన సంస్కృతికి సంబంధించిన దేవర్లను,ఇలవేల్పులను, ఆదివాసీ వీరులను మాత్రమే పూజించుకునే ప్రయత్నాలు ఇప్పుడిప్పుడే మొదలవుతున్నాయి. ఈ చైతన్యం దిశగా గిరిజన సంఘాలు ప్రత్యక్ష కార్యాచరణకు పునుకోవాలి. అక్షరాస్యతద్వారా గిరిజనుల్లో వచ్చిన సామాజిక,ఆర్థిక మార్పుల వల్ల, జీవన విధానంలో చక్కటి మార్పువచ్చింది. అది ఆనందదాయకమే. నేటి గిరిజన యువతలోని అక్షరాస్యత కేవలం ఉద్యోగాల కోసం, ఆర్థికవృద్ధి కోసం మాత్రమే కాదు. తమ దైన సంస్కృతులను, సాంప్రదాయాలను, తమ అస్తిత్వాన్ని సంరక్షించుకోవాలి. •

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

గుంటూరు వార్త



## సెంట్రల్ డివైడర్ పనుల్లో నాణ్యతా లోపాలు గుర్తిస్తే సంబంధిత ఎమినిటి కార్యదర్శి, ఎఇలపై కఠిన చర్యలు: జిఎంసి కమిషనర్



గుంటూరు తూర్పు, ఆగస్టు 22 (ప్రభాతవార్త) : నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పనులు జరిగే సమయంలో ఎమినిటి కార్యదర్శులు పర్యవేక్షణ చేయాలని నగర కమీషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. శుక్రవారం ఆర్టీవో ఆఫీస్ రోడ్డులో జరుగుతున్న సెంట్రల్ డివైడర్ పనులను, రెడ్డిపాలెం, గోరంట్ల, శ్రీనగర్, పట్టాభిపురం, తదితర ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి పనులను, ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసుకున్న భవనాలను, రోడ్ల డ్రైన్ల ఆక్రమణలను పరిశీలించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈసందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ నగరంలో జరుగుతున్న డ్రైన్లు, రోడ్లు కల్వర్టు డివైడర్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, తమ క్షేత్రస్థాయి పర్యటనల్లో నాణ్యతా లోపాలు గుర్తిస్తే సంబంధిత ఎమినిటి కార్యదర్శి, ఏఈలపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇప్పటికే సిద్దార్థ ఇంజనీరింగ్ కాలేజీ ప్రొఫెసర్ల ద్వారా క్వాలిటీ పరీక్షలు చేయిస్తున్నామన్నారు. రెడ్డిపలెం, గోరంట్ల ప్రాంతాల్లో ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసుకున్న భవనాలను పరిశీలించి, శివారు ప్రాంతాల్లోని భవన నిర్మాణదారులు తప్పని సరిగా డ్రైన్ని మేజర్ డ్రైన్ వరకు నిర్మాణం చేయాలన్నారు. పట్టాభిపురం మెయిన్ రోడ్లోని జిఎంసి షాపింగ్ కాంప్లెక్స్ని పరిశీలించి షాప్ల అద్దెలు, లీజు గడువుపై రెవెన్యూ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆర్టీవో కార్యాలయం దగ్గరలోని అన్న క్యాంటీన్ని పరిశీలించి ఆహారం తీసుకుంటున్న వారితో ఆహారం నాణ్యత రుచిపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. క్యాంటీన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన పాత్ర సిబ్బందిని ఆదేశిచంఆరు. ఆయన వెంట ఇన్చార్జి ఎంహెచ్ఓ రామారావు, పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## 'ఆస్తిపన్ను యజమాని పేరుతోనే ఉండాలి'



గుంటూరు తూర్పు, ఆగస్టు 22 (ప్రభాతవార్త) : ఆస్తి పన్ను ఆస్తి యజమాని పేరుతోనే ఉండాలని, ఆ విధంగా లేని వారు ఈ నెలాఖరు లోపు స్థానిక వార్డు సచివాలయంలో దరఖాస్తు చేయాలని నగర కమీషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ జాతీయ స్థాయి కార్యక్రమంగా సెప్టెంబర్ 1నుండి రీ సర్వే జరుగుతుందని, సదరు సర్వే మేరకు ఆస్తి పన్ను కల్గిన వారికి ఒనర్ షిప్ కార్డు జారీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. నగరంలో ఇప్పటికే రిజిస్ట్రేషన్ జరిగే సమయంలోనే ఆటో మ్యూటేషన్ జరుగుతుందన్నారు. రిజిస్ట్రేషన్ జరిగి ఆస్తి పన్నులో పేరు మార్పు కాని వారు ఈ నెలాఖరు లోపు వార్డు సచివాలయంలో అడ్మిన్ కార్యదర్శికి అటెస్ట్ చేసిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్, ప్రస్తుత ఆస్తి విలువ, సర్టిఫికెట్, సెల్ఫ్ డిక్లరేషన్ బకాయిలు చెల్లించిన ఆస్తిపన్ను రసీదు, ఆస్తి యజమాని ఆధార్ నకలు కాపీలను అందించి దరఖాస్తు చేయాలన్నారు. వివరాలకు స్థానిక రెవెన్యూ ఇన్స్పెక్టర్లును సంప్రదించాలని తెలిపారు.

## సినీచరిత్రలో చిరంజీవి అధ్యాయం సువర్ణలిఖితం: 'తూర్పు' ఎమ్మెల్యే నసీర్



గుంటూరు తూర్పు, ఆగస్టు 22(ప్రభాతవార్త) : తెలుగు సినీ చరిత్రలో చిరంజీవి అధ్యాయం సువర్ణ లిఖితమని తూర్పు ఎమ్మెల్యే అసెంబ్లీ మైనార్టీ వెల్ఫేర్ కమిటీ ఛైర్మన్ మొహమ్మద్ నసీర్ అన్నారు. శుక్రవారం తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా మెగస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాలకు హాజరైన ఎమ్మెల్యే నసీర్ జన్మదినోత్సవ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ తెలుగు సినీ పరిశ్రమకు దొరికిన ఆణిముత్యం చిరంజీవి అని కొనియాడారు. పాతతరం, కొత్తతరానికి వారధిగా తెలుగు సినీ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పారని తెలిపారు.కాపు సంఘ నాయకులు, కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యంపై అవగాహన కల్పించండి



గుంటూరు తూర్పు, ఆగస్టు 22 (ప్రభాతవార్త) : విద్యా సంస్థలు, గృహ సముదాయాలు, పబ్లిక్ ప్రదేశాల్లో పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని టీడీపీ కేడర్కు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీ వెల్ఫేర్ కమిటీ ఛైర్మన్ నసీర్ సూచించారు. శుక్రవారం స్థానిక తూర్పు శాసన సభ్యుల వారి కార్యాలయంలో స్థానిక టీడీపీ నేతలు, కార్యకర్తలతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఈ ప్రాంతాల్లో పాఠశాలలు, ఇతర సముదాయాల్లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రపై అవగాహన కల్పించాలని సూచించారు. చేతులు శుభ్రం చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్గా తీర్చిదిద్దేందుకు కంకణం కట్టుకున్నారని తెలిపారు. అందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని సూచించారు. ఉదయం నిద్ర లేచినప్పటి నుండి రాత్రి పడుకునే వరకు చిన్నారులకు స్వచ్ఛత, ఆరోగ్యంపై ప్రతిరోజు వివరిస్తూ ఉంటే అదే క్రమశిక్షణ అలవడుతుందని తెలిపారు. దీనిని ప్రజల్లోకి తీసుకువెళ్ళేందుకు టీడీపీ శ్రేణులు ముందుండాలని సూచించారు.

## ఎకనామిక్స్ విభాగంలో పీహెచ్డి



ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,ఆగస్టు22, ప్రభాతవార్త: వర్సిటీలోని ఎకనామిక్స్ విభాగంలో పరిశోధన చేసిన వేమూరి కోటేశ్వరరావుకు పీహెచ్డీ డిగ్రీని ప్రదానం చేసినట్లు రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.సుధాకర్ తెలిపారు. కోటేశ్వరరావు వ్యవసాయ రంగంలో సంస్థాగతమైన పరపతి లభ్యతపై ఎకనామిక్స్ విభాగాధిపతి ఆచార్య కడిమి మధుబాబు పర్యవేక్షణలో పరిశోధన చేశారు. ఆయన ప్రస్తుతం గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాల ఎకనామిక్స్ విభాగంలో లెక్చరర్గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావును విభాగ అధ్యాపకులు, పరిశోధకులు అభినందనలు తెలిపారు.

## ఓవర్సీస్ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీతో ఏఎన్యు ఒప్పందం




ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,ఆగస్టు22, ప్రభాతవార్త: ప్రముఖ కన్సల్టెన్సీగా పేరొందిన రత్నాస్ ఓవర్సీస్ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఎంఓయు కుదుర్చుకుంది. శుక్రవారం ఇన్చార్జి వీసి ఆచార్య కె.గంగాధరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కన్సల్టెన్సీ డైరెక్టర్ ఆర్.హరిప్రసాద్, వీసిలు ఎంఓయు పత్రాలను మార్చుకున్నారు. ఎంఓయులో ఉన్నతవిద్యపై గైడెన్స్, విదేశాలలో పోస్ట్ గ్రాడ్యుయేషన్, పీహెచ్డి ప్రోగ్రాంలలో ప్రవేశాలు వంటి అంశాలలో అవగాహన కార్యక్రమాల నిర్వహణ, స్కాలర్షిప్లకు సపోర్టింగ్ ఇన్ హౌస్ ఐ.ఈ.ఎల్.టి.ఎస్ ట్రెయినింగ్ అండ్ సపోర్ట్ అప్లికేషన్, వీసా ప్రాసెసింగ్, వంటి సేవలు వర్సిటీ నుండే అందించనున్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ఇన్చార్జి రెక్టర్ ఆచార్య కె.రత్నషీలామణి, ఇన్చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, ఇన్చార్జి ప్రిన్సిపాల్ ఆచార్య సి.హెచ్.లింగరాజు, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ యం.గోపీకృష్ణ, డాక్టర్ డి.చంద్రమౌళి, ట్రెయినింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ యం.డి తౌసిఫ్ అహ్మద్, పలు విభాగాల కోఆర్డినేటర్లు డాక్టర్ బి.పూర్ణచంద్రశేఖర్,డా॥ ఉమామహేశ్వరి,డా॥ డి.అఖిలాజాన్, డా॥సతీష్, డా॥కె.చైతన్య, డా॥వై.సునీత తదితరులు పాల్గొన్నారు.

## కలువపూలతో అమ్మవారికి విశేషార్చన



గుంటూరు కల్చరల్,ఆగష్టు 22,ప్రభాతవార్త : స్థానిక అరండల్పేటలోని శ్రీఅష్టలక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయ ప్రధానార్చకులు మ ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 30కోటి కుంకుమార్చనలు వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న క్రమంలో చివరి శుక్రవారం ఉదయం శ్రీ చక్రమహామేరుకు విశేషాభిషేకార్చన, అమ్మవార్లకు వివిధ రకాల పుష్పాలు, సుగంధద్రవ్యాలు ప్రత్యేకంగా కలువపూలతో కనులపండువగా పూజలు నిర్వహించి నక్షత్ర హారతి,మంత్రపుష్పం అనంతరం తీర్థప్రసాదాలు అన్న ప్రసాద వితరణ జరిగింది. ఈ సందర్భంగా ప్రసాద్ శర్మ మాట్లాడుతూ శనివారం ఉదయం లక్ష గాజుల పూజ, శాంతిహోమం మహాపూర్ణాహుతి, సంప్రోక్షణ జరుగుతాయని భక్తులు, కోటి కుంకుమార్చనలో పాల్గొన్న సువాసినులు పాల్గొని అమ్మవారి కృషకు పాత్రులు కావాలని కోరారు.

## శ్రీవరలక్ష్మీ అమ్మవారిగా శ్రీకనక మహాలక్ష్మీ



గుంటూరు కల్చరల్,ఆగష్టు 22,ప్రభాతవార్త : స్థానిక సిద్దార్థనగర్లోని శ్రీకనకమహాలక్ష్మీ మందిరంలో శ్రీవరలక్ష్మీ అమ్మవారిగా శ్రీకనక మహాలక్ష్మీని అలంకరించి విశేషంగా పాల్గొన్న సువాసినులచే ఆలయ వ్యవస్థాపకులు ఘంటసాల విజయస్వామి నిర్వహించారు. విశేషహారతి, మంత్ర పుష్పం అనంతరం తీర్థప్రసాద వితరణ జరిగింది.

## సాస్కి కింద అదనంగా రూ.5,000 కోట్లు కేటాయించండి

### ఢిల్లీ పర్యటనలో కేంద్ర ఆర్థికమంత్రిని కోరిన ముఖ్యమంత్రి చంద్రబాబు

గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, ఆగస్ట్ 22 : ఢిల్లీ వెళ్లిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ను కలిశారు. రాష్ట్రంలో చేపట్టే పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆర్థిక సహాయం అందించవలసిందిగా కేంద్ర ఆర్థికమంత్రిని ముఖ్యమంత్రి కోరారు. ఆంధ్రప్రదేశ్కు ఇప్పటివరకు ప్రత్యేక మూలధన పెట్టుబడి సహాయం (SASCI-Special Assistance to



States for Capital Investment ) పథకం కింద రూ. 2,010 కోట్లు లభించాయని తెలిపారు. రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న మూలధన ప్రాజెక్టుల కోసం అదనంగా రూ. 5,000 కోట్లు కేటాయించాలని వినతి పత్రం సమర్పించారు. అలాగే 202425 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సింగిల్ నోడల్ ఏజెన్సీ (శివిత శ్ఫ్ఖ్ఖ్ఖ్) ప్రోత్సాహక పథకం మార్గదర్శకాల ప్రకారం రూ. 250 కోట్ల విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలపై తగు ఉత్తర్వులు ఇవ్వాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. తూర్పు ప్రాంత రాష్ట్రాల సమగ్రాభివృద్ధి కోసం కేంద్రం ప్రకటించిన పూర్వోదయ పథకాన్ని స్వాగతిస్తున్నామని చెప్పిన ముఖ్యమంత్రి...ఈ పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రయోజనం పొందగలదని తెలిపారు. దీని విధివిధానాలు రూపొందించి త్వరగా ఈ పథకాన్ని అమల్లో తేవాలని ముఖ్యమంత్రి కోరారు.

## పోలీసుస్టేషన్లలో రికార్డులు సక్రమంగా ఉండాలి: ఎస్పీ సతీష్కుమార్



గుంటూరు తూర్పు, ఆగస్టు 22 (ప్రభాతవార్త) : పోలీస్ స్టేషన్లలో రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉన్నప్పుడే న్యాయస్థానాల ద్వారా నేరస్థులకు కఠిన శిక్షలు వేయించగలమని ఎస్పీ సతీష్కుమార్ అన్నారు. ఈస్ట్ పోలీస్ స్టేషన్ సబ్ డివిజన్ కార్యాలయాన్ని శుక్రవారం ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫోక్సో, గంజాయి, తీవ్రనేరాలకు సంబంధించిన కేసుల రికార్డులను ఎస్పీ పరిశీలించారు. రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచి చట్ట వ్యతిరేక కార్యకలాపాలను నియంత్రణ చేయాలని చెప్పారు. రానున్న వినాయక చవితి ఉత్సవాలను దృష్టిలో పెట్టుకుని ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, గతంలో ఏమైనా ఘటనలు జరిగుంటే వాటికి కారణమైన వారిని బైండ్ఓవర్ చేయాలని సూచించారు. పాత గుంటూరు పోలీస్ స్టేషన్ల సీఐలు సమన్వయం కలిగి ఈస్ట్ సబ్ డివిజన్ పరిధిలో ఎటువంటి శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా చూస్తూ అసాంఘీక శక్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తూ వారిపై ఉక్కుపాదం మోపాలని తెలిపారు. ఎస్పీ వెంట ఈస్ట్ పోలీస్ సబ్ డివిజన్ డిఎస్పీ అబ్దుల్ అజీజ్, లాలపేట సిఐ శివప్రసాద్, కొత్తపేట సీఐ వీరయ్యచౌదరి, పాత గుంటూరు సిఐ వెంకటప్రసాద్, సీసీ ఆదిశేషు తదితరులు ఉన్నారు.

## వినాయక చవితి ఉత్సవాలకు అనుమతి అవసరం-ఎస్పీ



గుంటూరు తూర్పు, ఆగస్టు 22 (ప్రభాతవార్త) : వినాయక ఉత్సవాల నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసు వారి ముందస్తు అనుమతులు తీసుకోవాలని జిల్లా ఎస్పీ సతీష్కుమార్ తెలిపారు. మండపాల ఏర్పాటుకు ఎవరికి ఎటువంటి చలానాలు చెల్లించనవసరం లేదని తెలిపారు. గణేష్ ఉత్సవాలు నిర్వహించబోమే వ్యక్తులు ముందుగా ఒక కమిటీగా ఏర్పడి, ప్రభుత్వం ప్రవేశపెట్టిన సింగిల్ విండో విధానం ద్వారా గణేష్చవితి.నెట్ వెబ్సైట్ ఓపెన్ చేసి అనుమతులు పొందాలని కోరారు.

## పారిశుద్ధ్య పనుల్లో మెరుగైన మార్పులు రావాలి: మేయర్



గుంటూరు తూర్పు, ఆగస్టు 22 (ప్రభాతవార్త) : స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా నగరంలో నిర్వహించే ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల ద్వారా నగరంలో పారిశుద్ధ్యంలో మెరుగైన మార్పు రావాలని, అందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు సమిష్టిగా కృషి చేయాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. శుక్రవారం తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్, నగర కమీషనర్ పులి శ్రీనివాసులతో కలిసి శుక్రవారం నిర్వహించనున్న స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలపై నోడల్ అధికారులతో కౌన్సిల్ సమావేశ మందిరం నందు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా గుంటూరు నగరంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాల ద్వారా నగర ప్రజలు సంతృప్తి చెందేలా మెరుగైన మార్పు రావాలన్నారు. నగరంలోని సచివాయాల వారీగా ప్రజాప్రతినిధులను స్థానిక ప్రజలను ఎన్జీవోలను భాగస్వాములను చేస్తూ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. శనివారం నిర్వహించు పారిశుద్ధ్య కార్యక్రమాలలో నీటి కాల్వలు మురుగు కాలువలు, మరియు నీటితో నిండిన ప్రాంతాలలో ప్రత్యేక పారిశుద్ధ్య మరియు కాలువ శుభ్రపరిచే కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. నీటి నిల్వలు ఉన్న ప్రాంతాలలో దోమలు పెరుగుదలను నివారించడానికి ఫాగింగ్ నిర్వహించాలని, అలాగే పాఠశాలోల విద్యార్థులకు చేతులు శుభ్రం చేసుకోవడం వలన కలిగే ఉపయోగాలను వివరించాలన్నారు. పబ్లిక్ టాయిలెట్లు, కమ్యూనిటీ టాయిలెట్స్ క్లీనింగ్ చేయాలని, వార్డుల్లో అవసరమైన ప్రాంతాల్లో డ్రైన్లలో పూడికతీత నిర్వహించాలని తెలియజేశారు. నగరంలో 57డివిజన్లలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు పర్యవేక్షణకు 57మంది నోడల్ అధికారులకు విధులు కేటాయించడం జరిగిందని కార్యక్రమాలను ఫోటోలతో డాకు వ్యమెంట్లను తయారు చేసి స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర యాప్లో అప్లోడ్ చేయాలని తెలియజేశారు. ప్రజలు ఈ కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొనేలా వారికి అవగాహన కలిగించాలని తెలియజేశారు. సమావేశంలో డిప్యూటీ కమీషనర్లు డి.శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు, సిహెచ్ శ్రీనివాస్, ఇన్చార్జి యస్.ఈ.సుందర్రామిరెడ్డి, ఇన్చార్జి యంహెచ్ఓ రామారావు, కార్పోరేటర్లు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

## పశ్చిమ తెదేపా కార్యాలయంలో మెగాస్టార్ జన్మదిన వేడుకలు



గుంటూరు క్రైమ్,ఆగష్టు 22,ప్రభాతవార్త :స్థానిక పశ్చిమ నియోజకవర్గ తెదేపా కార్యాలయంలో మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మెగాస్టార్ చిరంజీవి సినీ రంగంలోనే కాకుండా సామాజిక సేవలో కూడా అగ్రగామిగా నిలిచారని తెలిపారు. ప్రజలకు స్ఫూర్తినిచ్చే నాయకుడిగా ఆయన ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని, చిరంజీవి ఆరోగ్యంగా ఉండి మరెన్నో శుభకార్యాలను నడిపించాలని ఆకాంక్షించారు. సమాజానికి మార్గదర్శకుడై ఆయన మరిన్ని శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆళ్ళహరి, ఉల్లి గోపాల్, మల్లిక మరియు మల్లె ఈశ్వర్, జనసేన పార్టీ నేతలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## న్యూఢిల్లీలో సీఎం చంద్రబాబు బిజీబిజీ టూర్



ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణన్కు సీఎం చంద్రబాబు మద్దతు తెలిపారు. (గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి)



ఢిల్లీలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు నివాసానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెళ్లారు. రామ్మోహన్ నాయుడు దంపతులకు ఇటీవల జన్మించిన బాబుకు దీవెనలు అందించారు. (గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి)

## పివికే నాయుడు మార్కెట్లో అసౌకర్యాలపై ఎమ్మెల్యే మాధవి తీవ్ర ఆగ్రహం



గుంటూరు క్రైమ్,ఆగష్టు 22,ప్రభాతవార్త : స్థానిక పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పివికే నాయుడు మార్కెట్ను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్లోని మౌలిక సదుపాయాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. వర్తకుల సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో నీరు నిలిచిపోవడం వలన ప్రజలుఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎమ్మెల్యే గళ్ళా మాధవి దృష్టికి తీసుకురావడం జరిగింది. ఈ సమస్యలను పరిష్కరించాలని ఈఈ, ఎస్ఈ లను పిలిపించి, ఆగ్రహం వ్యక్తంచేశారు. సంవత్సరం క్రితం తన పర్యటన సమయంలో కూడా సమస్యలు అదేస్థాయిలో ఉన్నాయని, చిన్న సమస్యలను కూడా పరిష్కరించలేదని ఎమ్మెల్యే అధికారుల మీద ఆగ్రహం వ్యక్తంచేశారు. ముఖ్యంగా మహిళల కోసం కనీసం మరుగుదొడ్లు కూడా పూర్తి చేయలేదని, ఇది ఏ విధంగాను తగదని, దీని వలన మహిళలు తీవ్ర అసౌకర్యానికి గురువుతున్నారని వెంటనే మరుగుదొడ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని ఆదేశించారు.

## 1998 డిఎస్సీ క్వాలిఫైడ్ ఉపాధ్యాయులకు న్యాయం చేయండి

గుంటూరు విద్య,ఆగష్టు 22,ప్రభాతవార్త : 1998 డిఎస్సీ క్వాలిఫైడ్ మిగిలిపోయిన 1814మంది ఎస్సీ ఎస్టీ బిసి మైనార్టీలు వికలాంగులు ఓసి మహిళలకు ఉద్యోగ అవకావం కల్పించాలని కోరుతూ 1998 డిఎస్సీ క్వాలిఫైడ్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు కె.శ్రీనివాసరావు శుక్రవారం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఓఎస్డీ ఆకుల వెంకటరమణ కలసి వినతిపత్రం అందజేశారు. ఇదే సమస్యపై పలుమార్లు ప్రభుత్వానికి పత్రాల ద్వారా సమస్యను విన్నవించామని అయితే సమస్య పరిష్కారం కావడం లేదని ఈ సందర్భంగా శ్రీనివాసరావు ఆకుల వెంకటరమణా దృష్టికి తెచ్చారు. మిగిలిపోయిన 1814అభ్యర్థులకు ఉద్యోగం కల్పిస్తామని అప్పట్లో హామీ ఇవ్వడం జరిగింది. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే మేము అనేకసార్లు కలిశాము అయినా ప్రస్తుతం 2719224 నెంబర్ గల ఫైలు ప్రస్తుతం ప్రిన్సిపాల్ సెక్రటరీ కోన శశిధర్ వద్ద ఉంది. కేవలం 595మందికిమాత్రమే కలదు, కేవలం వారికే ఉద్యోగం కల్పిస్తే మరల ఎసీస్సి, ఎస్టీ, బిసి, మైనార్టీ మహిళలు ఓసి అన్యాయం జరుగుతుంది. మిగిలిపోయిన 1814మంది ఉద్యోగాలు ఇవ్వని పక్షంలో మేమందరం ఆత్మహత్యలు చేసుకోవడానికి సిద్ధపడగలము. కావున మాయందు దయుంచి తమరు ఈ విషయం సీఎం కి, విద్యాశాఖ మంత్రి వరకు తీసుకెళ్లగలరని ఓఎస్డీ ఆకుల వెంకటరమణను ఈ సందర్భంగా కోరారు. ఇచ్చిన హామీ నిలబెట్టుకొని అందరికీ ఉద్యోగాలు కల్పించి మా కుటుంబాల్లో వెలుగులు నింపగలరని శ్రీనివాసరావు కోరారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్ : ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు క్రైమ్,ఆగష్టు 22,ప్రభాతవార్త : పశ్చిమ నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ సౌకర్యాల విస్తరణనే తన ప్రధాన ధ్యేయమని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ఈ ప్రజాదర్బార్కు నియోజకవర్గ ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని, తమ సమస్యలను నేరుగా ఎమ్మెల్యేకి తెలియజేశారు. ప్రతి ఫిర్యాదు, వినతిని సంబంధిత అధికారులతో వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ ఎన్డీయే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా పశ్చిమలోతాను వచ్చిన తర్వాత గంజాయి వాడకం తగ్గిందని ఎమ్మెల్యే గుర్తు చేశారు.

## 24న అవగాహన..లో ఆరోగ్యసభ

గుంటూరు కల్చరల్,ఆగష్టు 22,ప్రభాతవార్త : అవగాహన సంస్థ గత 15సంవత్సరాలుగా క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న ఆరోగ్యసభల్లో భాగంగా ఈవారం చెవి ముక్కు,గొంతు వ్యాధులపై అవగాహన సభ ఏర్పాటుచేయబడిందని సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తెలిపారు. జూన్ 24 ఆదివారం ఉదయం 11గంటలకు సంస్థ కార్యాలయంలో జరిగే ఆరోగ్యసభకు సీనియర్ ఇఎన్టి సర్జన్ డాక్టర్ వి.వి.కె.సందీప్ ప్రధానవక్తగా పాల్గొంటారన్నారు. అవగాహన సంస్థ 357 ఆదివారం ఆరోగ్యసభకు హాజరూ కావలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఎన్సిసిలో స్టెమ్ విద్యార్థుల ప్రతిభ



గుంటూరు విద్య,ఆగష్టు 22,ప్రభాతవార్త : ఎన్సిసి ఆఫీసర్ల ఆధ్వర్యంలో శిక్షణ అనుసరించి మొదటి సంవత్సరం ఆంధ్ర, నాగార్జున యూనివర్సిటీల్లో నిర్వహించిన ఎన్సిసి క్యాంపు శిక్షణను పూర్తిచేసుకొని రెండో సంవత్సరంలో ఎన్సిసి వారు నిర్వహించిన పరీక్షలో స్టెమ్ స్కూల్ విద్యార్థులు అత్యున్నత ప్రతిభను కనబరిచి ఎన్సిసి "ఏ" సర్టిఫికేట్లు సాధించారని స్టెమ్ స్కూల్ కరస్పాండెంట్ ప్రిన్సిపాల్ రెవ.భరత్రెడ్డి తెలిపారు. తమ పాఠశాల నుండి మొత్తం 27మంది విద్యార్థులు ఆయా పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడం వల్ల ఎన్సిసి క్యాడర్ "ఏ"సర్టిఫికేట్కు అర్హులయ్యారని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్టెమ్ పాఠశాల కరస్పాండెంట్ ప్రినిసిపాల్ రెవ.ఫాదర్ భరత్రెడ్డి, ఏవో వినీత ఆయా విద్యార్థులను అభినందించారు.

వార్త VAARTHA CLASSIFIEDS CLASSIFIEDS వార్త VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME

★ రంగావఝ్జల బుచ్చి రామ శాస్త్రి, S/o. వెంకట సచ్చిదానంద శాస్త్రి అను నేను నా పేరు రంగావఝుల బుచ్చి రామశాస్త్రి, S/o. వెంకట సచ్చిదానంద శాస్త్రి గా మార్చుకొనుచున్నాను. చిరునామా : 14-29-42, రావివారి వీధి, మారీస్పేట, తెనాలి, గుంటూరు జిల్లా-522202

(Ro.No.18667)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

# పల్నాడు జిల్లా వార్త



## జాతీయ లోక్ అదాలత్‌పై సమీక్షా సమావేశం

గురజాల, ఆగస్టు 22 ప్రభాతవార్తః పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో సెప్టెంబరు 13వ తేదీన మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌పై న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, పదో అదనపు జిల్లా జడ్జి జి ప్రియదర్శిని న్యాయవాదులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాజీపడదగిన సివిల్, క్రిమినల్, బ్యాంకు, చెక్‌బౌన్స్, ముందస్తు వాజ్యములు తదితర కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించడానికి కృషి చేయాలని కోరారు. దీని ద్వారా కక్షిదారులకు సమయము, ధనం, ఆదా అవుతుందన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ జడ్జి శ్రీనివాసరావు, పిడుగురాళ్ల జడ్జి ప్రవళ్లిక, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటా శ్రీనివాసరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.



## దాచేపల్లిలో కోళ్ల కుంభకోణం: మాజీ ఎమ్మెల్యే 'కాసు'

గురజాల, ఆగస్టు 22 ప్రభాతవార్తః దాచేపల్లి మండలంలో కోడి కుంభకోణం జరుగుతోందని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో హోల్‌సేల్‌గా కోళ్ల ఫారం నుంచి తెలంగాణకు చెందిన కొందరు కోళ్ల వ్యాపారం చేసే వారన్నారు. గత 9 నెలలుగా వారిని బెదిరించి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యాన పోలీసులు వ్యాపారం చేసుకునే వారిని పిలిపించి మీపై కేసులు పెడతాం,గంజాయి కేసులు పెడతాం అంటూ బెదిరించి కిలో కోడి రూ. 95కు అమ్ముతుంటే వీళ్లు మాత్రం రూ. 120లకు అమ్ముతున్నారన్నారు. యేడాదికి రూ. 1.50 కోట్లు దాచేపల్లి మండలానికే వస్తుందన్నారు. నియోజకవర్గం మొత్తం కూడా ఆవిష్కరించే మార్గాలు ఏర్పరుచుకుంటున్నారన్నారు. యేడాదికి రూ. 6 కోట్లు దాకా లాభం పొందవచ్చని కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతుందన్నారు. వ్యాపారాలు టీడీపీ వారే చేసుకోవాలా అని ప్రశ్నించారు. ఇప్పటికే వీధికి ఒక మద్యం దుకాణం, పేకాట క్లబ్‌లు అయితే నాలుగైదు ఉన్నాయన్నారు. తక్షణమే పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కొత్త విష సంస్కృతిని తీసుకు రావద్దని, ప్రైవేటు వ్యాపారాలు కూడా అధికార పక్షమే చేయాలంటే ఎలా అని ప్రశ్నించారు. యేడాది కాలంలోనే విమర్శలు పాలువుతున్నారన్నారు. మహిళలు కోరుకుంటున్న నెలకు రూ. 1500, యేడాదికి రూ. 18 వేలు వస్తాయో లేదో అని ఎద్దేవా చేశారు. దాచేపల్లిలో ఒక వార్డుకు ఎన్నిక వస్తుందట, 1600 ఓట్లు ఉన్న వారిలో 500 ఓట్లు తొలగించాలని చూస్తున్నారన్నారు. దీనిపై హైకోర్టులో కేసు వేయబోతున్నామన్నారు. సదరు వార్డు కోసం తాము పోరాడతామన్నారు. సమస్య వార్డు కాదని, 400 మంది ఓటర్లు అని అన్నారు. ప్రతిపక్షంగా తమ బాధ్యత తాము నిర్వహిస్తామని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు.



## కాపు యువసేన ఆధ్వర్యంలో చిరంజీవి జన్మదిన వేడుకలు

గురజాల, ఆగస్టు 22 ప్రభాతవార్తః కాపు యువసేన ఆధ్వర్యాన మెగాస్టార్ చిరంజీవి 70వ జన్మదిన వేడుకలను శుక్రవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆనిగ్రేస్ వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి అనంతరం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా అడపా శ్రీనివాసరావు, శరమాల హనుమంతురావు మాట్లాడుతూ చిరంజీవి గొప్ప నటుడే కాదు మంచి మానవతావాది అన్నారు. ఎన్నో యేళ్లుగా బ్లడ్ బ్యాంకు ద్వారా ఎంతో మంది నిరుపేదలకు అత్యవసర సమయంలో రక్తదానం చేశారన్నారు. చిరంజీవి చేస్తున్న సేవలు ఆదర్శనమీనయన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నీలంరాజు, కటకం అంజి, జక్కా దుర్గారావు, సొలసా కిషోర్, బొప్పూరి నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



## వైకాపా హయాంలో మాఫియా కుంభకోణం: టీడీపీ మైనార్టీ నేత జానీబాషా

గురజాల, ఆగస్టు 22 ప్రభాతవార్తః కోళ్ల కుంభకోణం జరిగిందని తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్న వైసీపీ గురజాల ఇన్‌చార్జి కాసు మహేష్‌రెడ్డి వైఖరి సరైంది కాదని టీడీపీ మైనార్టీ నేత జానీబాషా అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వైసీపీ హయాంలోనే మాఫియా కుంభకోణం జరిగిందన్నారు. తాను చేసే వ్యాపారంలో ఎవరినైనా ఇబ్బంది పెట్టానేమో దాచేపల్లి వచ్చి కనుక్కోవాలని సవాల్ విసిరారు. వైసీపీ హయాంలో మీ నేతలు, కార్యకర్తలు తనను ఇబ్బంది పెడితే అప్పుడు మీకు ప్రజలు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సూపర్‌సిక్స్ పథకాలను చూసి ఓర్వలేక విమర్శిస్తున్నారన్నారు.



## జీడీసీసీ బ్యాంకు నుంచి రుణాలు: గురజాల పీఏసీఎస్ చైర్మన్ నాగేశ్వరరావు



గురజాల, ఆగస్టు 22 ప్రభాతవార్తః జీడీసీసీ బ్యాంకులో క్రాప్, సీసీ, ఎడ్యుకేషన్, హౌసింగ్ రుణాలు మంజూరు చేస్తున్నట్లు గురజాల పీఏసీఎస్ చైర్మన్ పోటు నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని జీడీసీసీ బ్యాంకులో ఆయన రైతులతో సమావేశమై మాట్లాడారు. డిపాజిట్ మహోత్సవం సందర్భగా జీడీసీసీ బ్యాంకు 8శాతం వడ్డీ ఇస్తుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో చీఫ్ మేనేజర్ పునానరావు, మేనేజర్ బలరామిరెడ్డి, సూపర్‌వైజర్ లింగారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## మాచర్ల నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధే ధ్యేయం: ఎమ్మెల్యే 'జూలకంటి'

వెల్దుర్తి, ఆగస్టు 22 ప్రభాతవార్త: మాచర్ల నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్, ఆన్‌ఆర్ఈజీఎస్, మున్సిపల్, వ్యవసాయ శాఖల అధికారులతో శుక్రవారం ఆయన విడివిడిగా సమీక్షా సమావేశాలు నిర్వహించారు. పంచాయతీరాజ్, ఎన్‌ఆర్ఈజీఎస్ శాఖల ద్వారా నియోజకవర్గానికి మంజూరైన పలు గ్రాంట్లు, సకాలంలో పనులు గుర్తించి నిధుల సద్వినియోగంపై అధికారులకు పలు సూచనలు చేశారు. మాచర్ల పట్టణంలో జరుగుతున్న, ఇంకా జరుగాల్సిన అభివృద్ధిపై, నిధుల సద్వినియోగంపై చర్చించారు. మాచర్ల పట్టణంలో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్లు, పట్టణ ఇన్నర్ రింగ్‌రోడ్డుకు సంబంధించి పలు అంశాలను టౌన్ ప్లానింగ్ ద్వారా సమీక్షించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన సందర్భంగా రైతులకు సకాలంలో ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉండేలా చూడాలని వ్యవసాయశాఖ అధికారులను సూచించారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టించాలని ప్రయత్నించే వారిపై నిఘా ఉంచి, కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాచర్ల నియోజకవర్గ స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## మాచర్లలో మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు

మాచర్ల, ఆగస్టు 22 ప్రభాతవార్త: జనసేన, అల్లు అర్జున్, చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు మాచర్ల పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వెంకటేశ్వర్ల థియేటర్‌లో జన్మదిన కేకు కట్ చేసి అభిమానులు పంచిపెట్టారు. అభిమానులు మాట్లాడుతూ.. చిరంజీవి ఏర్పాటు చేసిన బ్లడ్ బ్యాంకు వల్ల ఎన్నో ప్రాణాలు రక్షించబడ్డాయన్నారు. ఆయన సామాజిక సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో అఖిల భారత చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షులు రమేష్, జనసేన పార్టీ నాయకులు మదన్, వినోద్, లాలు, సారిక్, శ్రీహరి, వెంకటేశ్వర్లు, రంగా, వెంకటేష్, మణి, సాయి తదితరులు పాల్గొన్నారు.



## సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి: మేకపోతుల శ్రీనివాస్

మాచర్ల, ఆగస్టు 22 ప్రభాతవార్త: ఈ నెల 23 నుంచి మూడు రోజులపాటు ఒంగోలులో జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ మాచర్ల ఏరియా కార్యదర్శి మేకపోతుల శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక సీపీఐ కొమెర వీరాస్వామి భవన్లో శుక్రవారం మహాసభల గోడ ప్రతులను ఆయన ఆవిష్కరించారు. టౌన్ సెక్రటరీ మిద్దెపోగు బాబురావు, ఏఐవైఎఫ్ నియోజకవర్గ నాయకులు నర్రా రంగస్వామి,బ్రహ్మచారి, లక్ష్మయ్య, కందుకూరి కిరణ్, కుందుర్తి వీరబ్రహ్మచారి, తాళ్లూరి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## నాదెండ్లలో ఆయిల్ ఫామ్ మెగా ప్లాంటేషన్



నాదెండ్ల,ఆగస్టు22, ప్రభాతవార్త: మండల కేంద్రమైన నాదెండ్ల గ్రామంలో ఆయిల్‌ఫామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమం, ఆవగాహన సదస్సును శుక్రవారం ఉద్యానవనశాఖ, గోద్రేజ్ ఆగ్రోవేట్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త సహకారంతో నిర్వహించారు. ఆయిల్‌ఫామ్ అంటే నూనె పంట. మార్కెట్‌లో ఎప్పుడూ డిమాండ్ ఉన్న పంట, ప్రతిసంవత్సరం ఒక లక్ష కోట్లు ఖర్చుపెట్టి విదేశాలనుంచి 150లక్షల టన్నుల వంటనూనెను దిగుమతి చేసుకుంటున్నాం. పామాయిల్ మొక్కలు నాటిన 4 సంవత్సరాలనుంచి కాపు మొదలై 30 సంవత్సరాల వరకు నిరంతరం దిగుబడితో ఆదాయం లభిస్తుందని ఉద్యానవనశాఖ జిల్లా అధికారి ఎ వెంకటరావు తెలిపారు. నాదెండ్ల పిఎసిఎస్ అధ్యక్షులు నల్లమోతు హరిబాబు, చిలకలూరిపేట డివిజన్ ఉద్యానశాఖ అధికారి లక్ష్మీ, గోద్రేజ్ కంపెనీ డిజిఎం శ్యాం, నాదెండ్ల మండల ఆర్ఎస్కే సిబ్బంది, గ్రామ రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వినాయక చవితి ఉత్సవాలపై జిల్లా కలెక్టర్, ఎస్పీ ప్రత్యేక సమీక్ష

నరసరావుపేట క్రైం, ఆగస్టు 22 ప్రభాతవార్త : పల్నాడు జిల్లాలో నిర్వహించే వినాయకచవతి ఉత్సవాలపై శుక్రవారం జిల్లా కలెక్టర్ పిఅరుణ్‌బాబు, ఎస్పీ కె శ్రీనివాసరావులు వివిధ శాఖలధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉత్సావాలకు సంబంధించి నిర్వహకులు సింగిల్ విండో పద్ధతిలో తప్పకుండా అనుమతులు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో పూర్తిగా ప్రశాంత, భక్తిపూర్వక వాతావరణంలో చవితి ఉత్సవాలు జరుపుకోవాలన్నారు. పర్యావరణానికి నష్టం వాటిల్లకుండా విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. నిర్దేశిత నిమజ్జన ప్రదేశాలలో ప్రణాళిక ప్రకారం విగ్రహ నిమజ్జనం జరిగేలా చూడాలన్నారు. నిమజ్జన ప్రదేశాలలో గజ ఈత గాళ్ళను , బోట్లను అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. మండపాల అనుమతి కొరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 271మంది దరఖాస్తు చేసుకొన్నారని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ కె శ్రీనివాసరావులతో పాటు సమీక్ష సమావేశంలో ఆర్డీవో మురళీ కృష్ణ, జిల్లా రెవిన్యూ అధికారి మురళి , కమీషనర్‌లు, తహశీల్దార్‌లు ఉన్నారు.




## జనసేన పార్టీ కార్యాలయంలో చిరంజీవి జన్మదిన వేడుకలు

నకరికల్లు, ఆగస్టు 22 ప్రభాతవార్త : పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను ఘనంగా పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సయ్యద్ జిలాని ఆధ్వర్యంలో నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టారు. పార్టీనాయకులు జివిఎస్ ప్రసాద్, షేక్ రసూల్, అచ్చుల సాంబశివరావు, షేక్ ఆద్రూఫ్, ఆర్ కె యాదవ్, శ్రీనివాసరావు, బాషా,నిర్మల, శివ తదితరులు పాల్గొన్నారు. తెలుగు సినిమా రంగంలో మహ నటునిగా చిరంజీవి ఎదిగారని తెలిపారు. స్వయంకృషితో నటనలో ప్రతిభతో ఎవ్వరి అండ లేకుండా అగ్ర స్దానంలో నిలిచారని పేర్కొన్నారు. ఫైట్స్, బ్రేక్, డిస్కో వంటి డ్యాన్స్‌లతో చిరంజీవి ఎదురులేని హిరోగా నిలిచారని పేర్కొన్నారు. నిజ జీవితంలో వారు ఎన్నో సేవ కార్యక్రమాలు నిర్వహిస్తూ యువతకు ఆదర్శంగా నిలిచారని తెలిపారు.




## దివ్యాంగులకు , వృద్ధులకు ఉచిత వైద్యశిబిరం



రొంపిచర్ల, ఆగస్టు 22 ప్రభాతవార్త : సింగరాజు ఛారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వివరాలను హాస్పిటల్ ఛైర్మన్ డాక్టర్ సింగరాజు సాయికృష్ణ తెలిపారు. పద్మభూషణ్ మెగాస్టార్ కొణిదెల చిరంజీవి పుట్టినరోజుసందర్భంగా పలు సేవా కార్యక్రమాలను ప్రతి ఏడాది నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో దివ్యాంగులతో పాటు, వయో వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించటం జరిగిందన్నారు. శిబిరంలో 50మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు ఉచితంగా అందించామన్నారు. అదే విధంగా పల్నాడు చిరంజీవి యువత ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి కేక్ కట్ చేసి మిఠాయిలు అందించామని, కార్యక్రమాన్ని విజయవంతం చేసిన చిరంజీవి అభిమానులకు డాక్టర్ సింగారాజు సాయికృష్ణా అభినందనలు తెలిపారు.

## కొండవీడు ఇ.యన్.టి హాస్పిటల్స్‌లో లైవ్ సర్జరీ వర్క్‌షాప్

నరసరావుపేట, ఆగస్టు 22 ప్రభాతవార్త : కొండవీడు ఇ.యన్.టి హాస్పిటల్స్‌లో లైవ్ సర్జరీ వర్క్‌షాప్ ను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడఅరవిందబాబు శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమానికి హాస్పిటల్ ఛైర్మన్ డాక్టర్ కంజుల జగన్ మోహన్‌రెడ్డి అధ్యక్షత వహించారు.జూనియర్ వైద్యుల కోసం ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయటం పట్ల ఎమ్మెల్యే నిర్వహకులకు అభినందనలు తెలిపారు. స్వయంగా జూనియర్ వైద్యులు తమ చేతుల మీదుగా శస్త్రచికిత్సలు చేయటం వర్క్‌షాప్ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఇతర రాష్ట్రాల నుండి డా.చావన్ కార్తీక్,డా.నికితారెడ్డి, డా.అఖిలేశ్వర్, డా.నిర్మల నరేంద్రన్, డా.కవిత వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. ట్రైనింగ్‌లో సీనియర్ శస్త్రచికిత్స నిపుణులు డా.సతీష్ చంద్ర, డా.రాజేంద్రప్రసాద్, డా.సంపత్, డా.శేఖర్‌రెడ్డి, డా.సుధీర్‌చంద్రలు పాల్గొన్నారు. డాక్టర్ జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ 22,23,24 తేదిలలో వర్క్‌షాప్ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ డాక్టర్ శ్రీ వర్షిని, కోటిరెడ్డి, మస్తాన్‌రెడ్డి హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.



## చోరీలకు గురవుతున్న వాహనాలు- పోలీసుల వైఫల్యం

### - నిద్రావస్థలో సీసీ కెమెరాలు - రక్షణ కల్పించాలని ప్రజల గగ్గోలు

కారంపూడి, ఆగస్టు 22 ప్రభాతవార్త: మండలంలో ద్విచక్రవాహనాల చోరీ జరుగుతుంది. కారంపూడిలోని సినిమాహాలు సెంటర్లో ఇప్పటికే మూడు గృహాల వద్ద ఉన్న వాహనాలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. మండలంలో ప్రధాన కూడలిలో సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ దుండగులు తమ పని చాకచక్యంగా చేసుకుపోతున్నారు. గతంలో కూడా పోలీసు కాంప్లెక్సులో కూడా మాస్కులతో వచ్చి చోరీ చేసిన ఘటన విధితమే. ఈ నేపథ్యంలో మండలంలోని గ్రామాల్లో వరస చోరీలు జరుగుతున్నప్పటికీ పోలీసులు మాత్రం నిద్రావస్థలో ఉన్నట్లు తెలుస్తుంది. పోలీసు యంత్రాంగం ప్రతిరోజు రాత్రి పట్టణంలో గస్తీ నిర్వహించాల్సి ఉండగా అలాంటిదేమీ కనిపించడం లేదు. ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పుటేజీలు కూడా నిద్రావస్థలో ఉన్నట్లు తెలుస్తోంది. గత సోమవారం రాత్రి సినిమాహాలు సెంటర్లోని గురుమూర్తి ఇంటి ఎదుట పార్కు చేసిన బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లడంతో యజమాని తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసు యంత్రాంగం రాత్రి వేళల్లో నిఘాను పెంచి చోరీలు జరగకుండా చూడాలని కోరుతున్నారు. ఇటీవలి కాలంలో కారంపూడి మండల పరిధిలో తరచూ దొంగతనాలు జరుగుతున్నాయి. పోలీసులు నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నారనడంలో సందేహం లేదు. రాత్రివేళల్లో పహారా నిర్వహణ లేమి, పెరుగుతున్న అనుమానాస్పద వ్యక్తుల సంచారంపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. గ్రామాల్లో దొంగతనాలు పెరుగుతున్నా పోలీసులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఫిర్యాదు చేసినా సరైన దర్యాప్తు జరగడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



**ప్రజల్లో పెరుగుతున్న ఆందోళన**

మండల కేంద్రంలోనే ఇలాంటి ఘటనలు జరగడం ప్రజల్లో భయాందోళనకు దారి తీస్తోంది. కేంద్రంలోనే రాత్రి వేళ బైక్ ఎత్తుకెళ్లగలిగితే, పల్లెలోన్ల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోండి... అని గ్రామస్థులు చెబుతున్నారు. ఇకపై బైకులు, వాహనాలు బయట ఉంచడానికి కూడా భయపడుతున్నామని పేర్కొంటున్నారు.

## క్యాన్సర్ వైద్య శిబిరానికి విశేష స్పందన




యడ్లపాడు, అగస్టు 22, ప్రభాతవార్త : మండల పరిధిలోని బోయపాలెం గ్రామంలోని అనంత లక్ష్మీ స్పిన్నింగ్ మిల్స్ నందు కామినేని చారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో కాకతీయ ఫౌండేషన్ మరియు బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ మరియు రిసెర్చ్ ఇన్స్టిట్యూట్ హైదరాబాద్ వారి సహకారంతో నిర్వహించిన క్యాన్సర్ నిర్ధారణ శిభిరంకు విశేష స్పందన వచ్చింది. గత రెండు రోజులలో నిర్వహించిన ఈ ఉచిత శిబిరంలో మొత్తం 300మందికి పరీక్షలు నిర్వహించగా ఇందులో 5గురికి క్యాన్సర్ నిర్ధారణ అయ్యిందన్నారు. వీరికి బసవతారకం హాస్పిటల్ నందు చికిత్సకు ఏర్పాటు చేయడమైనదన్నారు. కార్యక్రమాలను సామినేని చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు సామినేని కోటేశ్వరరావు పర్యవేక్షించారు.

## మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని

చిలకలూరిపేట,ఆగస్టు22,ప్రభాతవార్త: పట్టణంలోని పండరీపురంలో ఉన్న భారతరత్న ఇందిరాగాంధి మున్సిపల్ హైస్కూల్‌లో శుక్రవారం మున్సిపల్ ఛైర్మన్ షేక్ రఫాని మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందించే ఆహారాన్ని, కూరలను స్వయంగా తిని సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాలలో ఎన్టీఆర్ సుజల పథకం ఏర్పాటు చేసేందుకు శాసనసభ్యులు ప్రత్తిపాటి ఆదేశాల మేరకు పరిశీలించారు. త్వరలో పాఠశాలలో విద్యార్థులు స్వచ్ఛమైన మంచినీటిని తాగేందుకు ఎన్టీఆర్ సుజల పథకాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఛైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి నాగేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## నరసరావుపేట సెంటర్ నుంచి బైపాస్ మార్గంలో అక్రమ నిర్మాణాల తొలగింపు



చిలకలూరిపేట,ఆగస్టు22,ప్రభాతవార్త: పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు, రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న ఆక్రమణలను తొలగించే కార్యక్రమాన్ని పట్టణ మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు శుక్రవారం చేపట్టారు. నరసరావుపేట సెంటర్‌నుంచి బైపాస్ రోడ్డు వరకు ఉన్న రోడ్డు ప్రక్కల అక్రమంగా నిర్మించిన దుకాణాలను, ఇతర నిర్మాణాలను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఎటువంటి ప్రమాదాలు జరగకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఈ ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని నరసరావుపేట సెంటర్‌లోగల భారత పెట్రోల్ బంకునుంచి తొలగించడం ప్రారంభించారు. ఈ ఆక్రమణలను తొలగించడం ద్వారా పాదచారులు, వాహనదారులు సురక్షితంగా ప్రయాణించేందుకు అవకాశం ఏర్పడుతుందని టౌన్‌ప్లానింగ్ అధికారులు తెలిపారు. ఇలాంటి చర్యలు భవిష్యత్‌లో కూడా కొనసాగుతాయని, పట్టణాన్ని మరింత సురక్షితంగా, ప్రణాళికా బద్దంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని వారు తెలిపారు.

## శారదా హైస్కూల్‌కు రోబొటిక్స్ మెటీరియల్ అందజేత

చిలకలూరిపేట, ఆగస్టు 22, ప్రభాతవార్త: చిలకలూరిపేట రోటరిక్లబ్, వెంకటరాయ శ్రీధర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అమెరికా నుంచి రోటోటిక్స్ మెటీరియల్‌ను తెప్పించి శుక్రవారం పట్టణంలోని శారదా జిల్లా పరిషత్ హైస్కూల్, పెదనందిపాడు హైస్కూల్, ఉన్నవ హైస్కూల్ విద్యార్థులకు రోటరిక్లబ్ సభ్యులు అందచేశారు. శారదా జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 7,8,9,10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు రోబొటిక్స్ తయారుచేసే విధానాన్ని దృశ్య శ్రవణం ద్వారా వినిపించారు. ఈ కార్యక్రమంలో చిలకలూరిపేట రోటరిక్లబ్ అధ్యక్షులు ఉప్పుటూరి ప్రసాద్, వెంకటరాయ శ్రీధర్ ఫౌండేషన్ ప్రతినిధి,మాజీ రోటరి అధ్యక్షులు తోటకూర వెంకటనారాయణ, రోటరి డైరక్టర్ గళ్లా సాంబశివరావు, రోటరి కార్యదర్శి బోడి రామసుబ్బారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## మండల టిడిపి ఎస్‌సిసెల్ అధ్యక్ష, కార్యదర్శులుగా కోటేశ్వరరావు, సురేష్



చిలకలూరిపేట,ఆగస్టు22,ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ సంస్దాగత ఎన్నికలలో బాగంగా చిలకలూరిపేట మండలస్దాయి పార్టీ కార్యవర్గాల ఎన్నిక ప్రక్రియను శుక్రవారం పార్టీ కార్యాలయంలో ప్రారంభించారు. మండల ఎస్‌సిసెల్ కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ఎస్‌సిసెల్ కమిటి అధ్యక్షులుగా అరిగెల కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా జూపుడి సురేష్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ నియామకానికి సహకరించిన మాజీమంత్రి, స్దానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు ధన్యవాదాలు తెలియచేశారు. ఈ ఎన్నిక కార్యక్రమంలో పార్టీ నాయకులు నెల్లూరి సదాశివరావు, షేక్ కరిముల్లా, జవ్వాజి మదన్‌మోహన్, బడుగు జాకబ్‌రాజు, మురకొండ మల్లిబాబు, మండల సమన్వయకమిటి సభ్యులు పాల్గొన్నారు.

## మండల టిడిపి మహిళా విభాగం అధ్యక్ష, కార్యదర్శులుగా రమాదేవి, జయలక్ష్మి

చిలకలూరిపేట,ఆగస్టు22,ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ సంస్దాగత ఎన్నికలలో బాగంగా చిలకలూరిపేట మండల స్దాయి కార్యవర్గాల ఎన్నిక ప్రక్రియను పార్టీ శ్రేణులు పార్టీ కార్యాలయంలో శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుమహిళా విభాగం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల తెలుగుమహిళా విభాగం అధ్యక్షురాలుగా చాగంటి రమాదేవి, ప్రధాన కార్యదర్శిగా మొండెద్దు జయలక్ష్మిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ నియామకానికి సహకరించిన మాజీమంత్రి, స్దానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు ధన్యవాదాలు తెలియచేశారు. ఈ ఎన్నిక కార్యక్రమంలో పార్టీ నాయకులు నెల్లూరి సదాశివరావు, షేక్ కరిముల్లా, జవ్వాజి మదన్‌మోహన్, బడుగు జాకబ్‌రాజు, మురకొండ మల్లిబాబు, మండల సమన్వయకమిటి సభ్యులు పాల్గొన్నారు.



## మెగా అభిమానుల్లో సేవాస్ఫూర్తిని నింపిన చిరంజీవి : బాలాజీ



చిలకలూరిపేట,ఆగస్టు22,ప్రభాతవార్త: ఉభయ తెలుగు రాష్ట్రాలలో కోట్లాదిమంది హృదయాల రారాజు చిరంజీవి అని, చిరంజీవి స్ఫూర్తితో పాఠాలు నేర్చుకుందామని జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్రా కో కన్వీనర్ పెంటేల బాలాజీ తెలిపారు. చిరంజీవి సినీ ప్రయాణం కేవలం బాక్సాఫీస్ రికార్డుల వరకే పరిమితం కాలేదని, ఆయన స్దాపించిన చిరంజీవి బ్లడ్‌బ్యాంక్, ఐ బ్యాంక్ లక్షలాదిమంది ప్రాణాలను కాపాడుతున్నాయని, రక్తదాన ఉద్యమంలో ఆయన సృష్టించిన విప్లవం చెదరిపోని చరిత్ర అని అభివర్ణించారు. చిరంజీవి కష్టాలలో ఉన్నవారికి సాయం చేసే ఆపద్బాంధవుడు అని వెల్లడించారు

## ఆస్తి, మంచినీటి పన్ను చెల్లింపునకు రెవెన్యూ ఔట్ సోర్సింగ్ సిబ్బందితో స్పెషల్ డ్రైవ్

చిలకలూరిపేట, ఆగస్టు 22, ప్రభాతవార్త: చిలకలూరిపేట పట్టణంలో అభివృద్ధి పనులు చేపట్టటానికి కేంద్రప్రభుత్వం మంజూరు చేసే నిధులపై అధారపడకుండా ఆస్దిపన్ను రాబట్టటంపై మున్సిపల్ అదికారులు దృష్టి సారించారు. ఆర్దిక సంవత్సరం ముగింపు వరకు వేచిచూడకుండా పన్నుల వసూళ్ల వేగవంగం చేయాలని మున్సిపల్ కమీషనర్ పి శ్రీహరిబాబు రెవెన్యూ అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. ఈ ఆదేశాల మేరకు శుక్రవారం పట్టణంలోని గృహ యజమానులనుంచి ఆస్ది, నీటి పన్నుల వసూళ్లకు రెవెన్యూ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది స్పెషల్ డ్రైవ్‌ను చేపట్టారు. ఈ సందర్భంగా గృహ యజమానులతో రెవెన్యూ సిబ్బంది మాట్లాడుతూ పన్నులు చెల్లించని గృహలకు తాగునీరు అందించే కుళాయిలను కూడా తొలగిస్తామని హెచ్చరించారు.



## 1వ డివిజన్ శానిటరీ కార్యాలయాన్ని పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని



చిలకలూరిపేట,ఆగస్టు22,ప్రభాతవార్త: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం రోడ్‌లోని ప్రత్తిపాటి గార్డెన్స్ సమీపంలో ఉన్న 1వ డివిజన్ శానిటరీ కార్యాలయాన్ని శుక్రవారం మున్సిపల్ ఛైర్మన్ షేక్ రఫాని పరిశీలించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు, సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య కార్మికులు తమ విధులలో ఎదురవుతున్న సమస్యలను ఛైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు.దీనిపై స్పందించిన ఛైర్మన్ ఈ సమస్యలను శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు, మున్సిపల్ కమీషనర్ దృష్టికి తీసుకువెళ్లి తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. పట్టణంలో పరిశుభ్రతలో పారిశుధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకమని ఛైర్మన్ తెలిపారు. వారి సంక్షేమం కోసం మున్సిపల్ పాలకవర్గం ఎల్లప్పుడూ కృషి చేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య అధికారి సిహెచ్ రమణరావు, శానిటరీ మేస్త్రిలు, సిబ్బంది పాల్గొన్నారు.

## సంచార, అర్ధసంచార జాతుల ప్రజల సమస్యలను తెలుసుకున్న బిజెపి నాయకులు

చిలకలూరిపేట,ఆగస్టు22,ప్రభాతవార్త: రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పివిఎన్ మాధవ్ ఆదేశాలతో సంచార, అర్ధసంచార జాతులపై ప్రత్యేక శ్రద్ధతో వీరి అభివృద్ధికి, రాజ్యాధికారానికి పూర్తి సహయసహకారాలు అందిస్తూ రాష్ట్ర ఓబిసి మోర్చా అధ్యక్షులు గోపి శ్రీనివాస్ నేతృత్వంలో ఈ జాతులను ఏకం చేస్తూ,



వారి అభివృద్ధి మార్గాలపై అవగాహన కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టారు. దీనిలో బాగంగా చిలకలూరిపేట నియోజకవర్గంలో స్దానిక బిజెపి నాయకులు ఈ జాతులవారిని స్వయంగా కలిసి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ఓబిసి మోర్చా కార్యవర్గ సభ్యుడు అన్నపురెడ్డి వెంకటేశ్వర్లు,ఓబిసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదిమూలం గురుస్వామి, అసెంబ్లీ కన్వీనర్ తాడిపర్తి జయరామిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల శివనాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి గట్టా హేమకుమార్, బిజెపి నాయకులు బ్రహ్మం, పులుగుజ్జు మహేష్, కోటేశ్వరరావు, శివకోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల జిల్లా వార్త



# త్వరలో 1050 కొత్త బస్సులు

**-పొన్నూరు డిపో అభివృద్ధికి కృషి చేస్తాం-స్త్రీశక్తి పథకానికి విశేష స్పందన**
**-డిపో అభివృద్ధికి వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్యే నరేంద్ర**
**-పొన్నూరు డిపోకు 11కొత్త ఎలక్ట్రిక్ బస్సులు**





పొన్నూరు, ఆగస్టు 22,ప్రభాతవార్త: రాష్ట్రంలో నూతనంగా కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టి స్త్రీ శక్తి పథకానికి మహిళల నుంచి విశేష స్పందన వస్తుందని ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు చెప్పారు. పట్టణంలోని స్థానిక ఆర్టీసీ డిపోను ఆయన శుక్రవారం సందర్శించి డిపో స్థితి గతులను అడిగి తెలుసుకున్నారు. డిపో ఆవరణ మొత్తం కలియ తిరిగారు. పొన్నూరుకు వస్తున్న ద్వారకా తిరుమలరావుకు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్, పలువురు నాయకులు, కార్యర్తలు, అభిమానులు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ స్త్రీ శక్తి పథకం లేని సమయంలో స్త్రీల యొక్క ప్రయాణం తక్కువగా ఉండేదన్నారు. 60శాతం మంది పురుషులు, 40శాతం మంది స్త్రీలు ప్రయాణించేవారన్నారు. ఈ పథకం అమలులోకి వచ్చాక 60శాతం స్త్రీలు, 40శాతం పురుషులకు పడిపోయిందన్నారు. పథకం లేని సమయంలో నిత్యం 15నుంచి 16లక్షలు మంది స్త్రీలు మాత్రమే ప్రయాణించేవారన్నారు. ప్రస్తుతం రోజుకు 21లక్షల మంది స్త్రీలు ఆర్టీసి ప్రయాణాన్ని వినియోగించుకొంటున్నారన్నారు. ఈ పథకం అమలులోకి వచ్చాక బస్సులు, సిబ్బంది ఏ విధంగా వ్యవహరిస్తున్నారన్న విషయాలను తెలుసుకొంనేందుకు రాష్ట్రం మొత్తం తాను స్వయంగా పర్యటిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే సిబ్బందికి పలు సూచనలు చేశామన్నారు. సిబ్బంది ఎక్కడా ఆవేశానికి లోనుకాకుండా శాంతంగా సమాధానం చెప్పాలని సూచించామన్నారు. అందుకే ఇతర రాష్ట్రాల్లోని సమస్యలు మన రాష్ట్రంలో ఉత్పన్నం కాకుండా ముందు జాగ్రత్తలు తీసుకొంటున్నామన్నారు. త్వరలో రాష్ట్రానికి 1050ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయన్నారు. అయితే వీటికి చార్జింగ్ చేసేందుకు అవసరమైన ఎక్విప్‌మెంట్‌ను ఆయా డిపోల్లో ఏర్పాటు చేసేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నామన్నారు. పొన్నూరు డిపో అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ వినతిపత్రం అందజేశారని, తప్పకుండా పొన్నూరు డిపో ఆధునీకరణకు శక్తివంచన లేకుండా నిధులు మంజూరు చేసి మోడల్ డిపోగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. డిపోకు నూతన భవనాలు నిర్మాణానికి, గ్రామీణ, సుదూర ప్రాంతాలకు బస్సు సర్వీసులను పెంచేందుకు కూడా ఎమ్మెల్యే విజ్ఞప్తిని పరిశీలిస్తామన్నారు. పొన్నూరు డిపోకు 11ఎలక్ట్రిక్ బస్సులను మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్రకుమార్ మాట్లాడుతూ 1966లో ప్రారంభమైన ఆర్టీసి డిపో అనేక దశాబ్దాలుగా సేవలందిస్తున్నప్పటికీ వివిధ కారణాలతో వెనుకబాటు తనానికి కారణమైందన్నారు. గతంలో పొన్నూరు డిపో నుంచే బాపట్లకు బస్సు సర్వీసులు నడిచేవన్నారు. మన డిపో నుంచే చీరాలకు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు నిర్వహించేవారాన్నారు. 2009-2014 మధ్య డిపోను మూసివేస్తే ప్రజల పక్షాన పెద్ద ఎత్తున పోరాటాలు చేశామని గుర్తు చేశారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ళ సూచించిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తామని ద్వారకా తిరుమలరావు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ళ తిరుమలరావును అభినందించారు. అనంతరం డిపో ఆవరణలో మొక్కలను నాటారు. ఆర్టీసి ఆవరణలో మొక్కలను నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసి డిపో మేనేజర్ లంకా వెంకటేశ్వరరావు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విజ్ఞాన్స్‌లో వైభవంగా వరలక్ష్మీ వత్ర వేడుకలు

పొన్నూరు, ఆగస్టు 22,ప్రభాతవార్త: చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని వరలక్ష్మీ వ్రతాలను అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవోపేతంగా నిర్వహించారు. విజ్ఞాన్స్ యూనివర్సిటీ సిబ్బంది, పలువురు విద్యార్థినులు సామూహిక వ్రత పూజల్లో





పాల్గొని పూజలు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన విజ్ఞాన్స్ వీసి కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్ మాట్లాడుతూ వ్రతమంటే నియమబద్ధమైన నడవడిక, క్రమశిక్షణతో కూడిన ఆచరణ, వ్యక్తిగత, వృత్తిగత జీవితాల్లో ప్రాముఖ్యాన్ని తెలియజేప్పడమే వ్రతం ఆంతర్యమన్నారు. వరం అంటే శ్రేష్ఠత, మనకు దక్కిన ఏదైనా అత్యుత్తమమైనదిగా ఉండాలని కోరుకొంటామన్నారు. అలాగే జీవితంలో ఏ బాధ్యతల్ని స్వీకరించిన ఉత్తమంగా నిర్వర్తించాలన్నారు. శ్రద్ధ, ఆసక్తులతో చేస్తేనే సత్ఫలితాలు వస్తాయన్నారు. కాబట్టి చదువైనా, ఇతర పనులైనా మనసుపెట్టి పూర్తి చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఉత్సాహానికి, ఉత్సాహానికి, ప్రసన్నతకు, చిరునవ్వుకు అమ్మవారు ప్రతీక అని చెప్పారు. ప్రసన్నంగా, కరుణంతో సౌమ్యలక్ష్మిగా కనిపించే ఆ తల్లే అవసరమైతే వీరలక్ష్మిగా మారుతుందన్నారు. ఆశావహ దృక్పథంతో విజయం సాధిస్తే జయలక్ష్మిని, తలపెట్టిన కార్యానికి కావాల్సిన విజ్ఞానం, సమయస్ఫూర్తి, నిర్ణయ శక్తులను సంపాదించడం ద్వారా విద్యాలక్ష్మిని ఆరాధించవచ్చునన్నారు. మిగిలిన లక్ష్మీ పూజలకంటే వరలక్ష్మీ పూజ శ్రేష్ఠమన్నారు. విశేష ఫలితాలు దక్కుతాయన్నారు. విదేశీయులు సైతం ప్రస్తుతం మన సంప్రదాయాలను ఆచరిస్తున్నారని తెలిపారు. మన పండుగలు, వాటిని జరుపుకునే తీరు చూసి ప్రపంచం అబ్బురపడుతోందన్నారు. ఎప్పటికి మన సంస్కృతిని యువత మరిచిపోరాదనే ఉద్దేశంతోనే ఇలా అన్ని పండుగలను వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. తొలుత విఘ్నేశ్వరపూజ అనంతరం వరలక్ష్మీ వ్రతాన్ని కొనసాగించారు. కళాశాల విద్యార్థినులు ప్రత్యేక పూజల్లో ఆసక్తిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ

పొన్నూరు, ఆగస్టు 22,ప్రభాతవార్త: స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ చేతుల మీదుగా పట్టణ, మండలంలోని లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి



చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పెద్ద ఎత్తున ఎంతో ఉదారంగా నిధులను మంజూరు చేసి అందజేస్తున్నారన్నారు. పట్టణానికి చెందిన రావూరి మేఘనకు రూ.7లక్షలు, మారుపూడి విజయలక్ష్మికి రూ.4,50,712, వైరంగం రమణయ్యకు రూ.89,608, యూతాటి నిర్మలకు రూ.46,997, గేరా సుధీర్‌కు రూ.32,324, షేక్ ఆరిఫుల్లాకు రూ.18వేలు పట్టణంలో మొత్తం ఆరుగురికి రూ.13,37,641అందజేశారు. పొన్నూరు రూరల్ మండలంలో వెల్లలూరుకు చెందిన చిమటా రోజారాణికి రూ.40వేలు, నండూరుకు చెందిన కొండ బ్రహ్మరాంబకు రూ.45,903, ములుకుదురుకు చెందిన కూచిపూడి మార్తమ్మకు రూ.35వేలు మండలంలో ముగ్గురికి రూ.1,20,903 అందజేశారు. పట్టణం, రూరల్‌కు సంబంధించి తొమ్మిది మందికి రూ.14,58,544లు అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఎమ్మెల్యే నరేంద్రకుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పఠాన్ పిరోజ్‌ఖాన్, అహమ్మద్‌ఖాన్, ఎద్దు సోంబాబు, మాదల వెంకటేశ్వరరావు, బొర్రు రామారావు, తోటకూర నరేష్, బండ్లమూడి బాబూరావు తదితరులున్నారు.

## మండలంలో పంట నమోదు నత్తనడక

**-సిబ్బందికి ఇతర పనులు కూడా అప్పచెప్పడమే కారణమా..?**

పొన్నూరు, ఆగస్టు 22,ప్రభాతవార్త: పొన్నూరు మండలంలో పంట నమోదు కార్యక్రమం నత్తనడకన జరుగుతుందని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటి వరకు పావు భాగం కూడా నమోదు చేయలేకపోతున్నారని చెప్తున్నారు. పంట నమోదు సిబ్బందికి ఇతర పనులు కూడా



అప్పజెప్పడం....రైతు సేవా కేంద్రానికి వచ్చే రైతులకు సమాధానం చెప్పడం తదితర కారణాల వల్ల పంట నమోదు నత్తనడకన సాగుతుందని చెప్తున్నారు. ఉదాహరణకు నండూరు, చిన ఇటికంపాడు గ్రామాల్లో సుమారు 2వేల ఎకరాలకు పంట నమోదు చేయాల్సి ఉండగా ప్రస్తుతం సుమారు ఐదు వందల ఎకరాల్లో మాత్రమే పంట నమోదు చేయడం జరిగినట్లు తెలుస్తోంది. అయితే ఇటీవల అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్‌కు సంబంధించిన పలు సమస్యలపై రైతు సేవా కేంద్రానికి రైతులు వస్తుండడంతో సిబ్బంది పూర్తిస్థాయిలో పంట నమోదుపై దృష్టిపెట్టలేకపోతున్నటుల పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. వ్యవసాయాధికారులు పంట నమోదుపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టి త్వరితగతిన పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలు ఏ సమయాన ఏవిధంగా వస్తాయో తెలియని పరిస్థితులు ఉన్న నేపథ్యంలో ఏదైనా నష్టం జరిగితే రైతులు ఇబ్బందులు పడే అవకాశం ఉన్నందున పంట నమోదును త్వరితగతిన పూర్తి చేయాలని రైతాంగం కోరుతున్నారు.

## భక్తిశ్రద్ధలతో శ్రావణమాస పూజలు

పొన్నూరు, ఆగస్టు 22,ప్రభాతవార్త: శ్రావణమాసం అత్యంత పవిత్రమైన మాసం...ఈ మాసంలో మహిళు పెద్ద ఎత్తున నెల రోజులపాటు శ్రావణ శుక్రవారం....శ్రావణ మంగళవారాలు అమ్మవారికి ప్రత్యేకాభిషేకాలు.....కుంకుమార్చనలు నిర్వహించి భక్తి ప్రపత్తులు చాటుకొంటారు. ఈ నెల రోజులపాటు అత్యంత నిష్ఠగా ఉండి అమ్మవారికి ఇష్టమైన పిండివంటలను నైవేద్యంగా సమర్పించడంతోపాటు ఉపవాసాలు ఉండి తమ భక్తిని చాటుకొంటారు. అదేవిధంగా దేవాలయాల్లో కూడా ఆయా కమిటి సభ్యులు, అధికారులు కుంకుమార్చనలు నిర్వహిస్తారు. స్థానిక సహస్రలింగేశ్వరస్వామి దేవాలయంలో కార్యనిర్వహణాధికారి గద్దె వెంకట అమర్నాథ్ పెద్ద ఎత్తున సామూహిక కుంకుమార్చనలకు పిలుపునిచ్చారు. దీంతో చివరి శుక్రవారం కావడంతో మహిళా



భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. దేవాలయంలోని శ్రీ పార్వతీ అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వేదికపైకి అమ్మవార్లను, అయ్యవార్లను వేంచేపుచేసి ప్రత్యేకంగా అలంకరించారు. పూజాధికార్యక్రమాల అనంతరం భక్తులు పెద్ద ఎత్తున తీర్థప్రసాద వినియోగం జరిగింది. కార్యనిర్వహణాధికారి గద్దె వెంకట అమర్నాథ్ పర్యవేక్షణలో వట్టికూటి వాసు, తదితర సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

## యువతకు ప్రపంచస్థాయి అవకాశాలు

**-అనంత్ టెక్నాలజీ ఛైర్మన్ డాక్టర్ సుబ్బారావు పావులూరి**

పొన్నూరు, ఆగస్టు 22,ప్రభాతవార్త: కొత్త ఆవిష్కరణలు, ఉపగ్రహ ప్రాజెక్టులు, పరిశోధనలు-ఇవన్నీ యువతకు ప్రపంచ స్థాయి అవకాశాలను అందిస్తాయని హైదరాబాద్‌కు చెందిన అనంత్ టెక్నాలజీస్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సుబ్బారావు పావులూరి అన్నారు. చేబ్రోలు మండల, వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో టీమ్ సీవోఈ-స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ, డీన్ ప్రమోషన్స్ అండ్ కొలాబొరేషన్స్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నేషనల్ స్పేస్ డే సెలబ్రేషన్స్‌ను ఘనంగా



నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుబ్బారావు పావులూరి మాట్లాడుతూ భారతదేశం అంతరిక్ష పరిశోధనారంగంలో సాధించిన విజయాలను స్మరించుకోవడమే కాకుండా, భవిష్యత్తు తరం శాస్త్రవేత్తలకు స్ఫూర్తినిచ్చే రోజు జాతీయ అంతరిక్ష దినోత్సవమని తెలిపారు. 2023ఆగస్టు 23న చంద్రయాన్-3 మిషన్ ల్యాండర్ విక్రం చంద్రుడి ఉపరితలాన్ని తాకిన చారిత్రక సందర్భాన్ని గుర్తుగా చేసుకొంటూ, ఈ రోజును అధికారికంగా జాతీయ అంతరిక్ష దినోత్సవంగా జరుపుకుంటామన్నారు. ఇది కేవలం ఒక శాస్త్రీయ ఘట్టం మాత్రమే కాదు, దేశం కలలుగన్న అంతరిక్ష ప్రయాణాల దిశలో కొత్త అధ్యాయానికి నాంది అని చెప్పారు. 1969లో డాక్టర్ విక్రం సారాభాయ్ దర్శనంతో స్థాపించబడిన భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) సాధారణ రాకెట్ ప్రయోగాలతో మొదలైన తన ప్రయాణాన్ని నేడు ప్రపంచంలో అగ్రగామి అంతరిక్ష సంస్థలలో ఒకటిగా నిలబెట్టుకుందన్నారు. అంతరిక్షం అంటే కేవలం గ్రహాలపై పరిశోధన కాదని, అంతరిక్ష సాంకేతికత నేరుగా ప్రజల జీవితాలపై ప్రభావం చూపుతోందన్నారు.

**ఏపీ స్పేస్‌టెక్ అకాడమీ ఏర్పాటు:**

విజ్ఞాన్స్ వర్సిటీలో జరిగిన నేషనల్ స్పేస్ డే సెలబ్రేషన్స్‌లో ఆంధ్రప్రదేశ్ స్పేస్‌టెక్ అకాడమీ(ఏపిఎస్ఏ)ను ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి నూతన అధ్యక్షుడిగా అనంత్ టెక్నాలజీ లిమిటెడ్ ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పావులూరి సుబ్బారావు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 2025 మొదటి వారంలో అమరావతిలో తొలి ఏపి స్పేస్‌టెక్ సమ్మిట్ నిర్వహించనున్నట్లు చెప్పారు. డిసెంబర్‌లో జరిగే స్పేస్‌టెక్ సమ్మిట్‌లో విద్యావేత్తలు, పరిశ్రమలు, పాలసీ మేకర్స్, ఆవిష్కర్తలు ఒకే వేదికపైకి చేరి జ్ఞానం పంచుకోవడం, సాంకేతిక పురోగతిని ప్రదర్శించడం, తదుపరి తరాన్ని ప్రేరేపించడం జరుగుతుందన్నారు. రాబోయే అంతరిక్ష శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు, వ్యాపారవేత్తలు, నాయకులను తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ సమ్మిట్‌ను రూపొందించబడిందన్నారు. ఈ కార్యక్రమం సామర్థ్యాన్ని పెంచడమే కాకుండా, అంతరిక్ష శాస్త్రం నేరుగా సమాజ అభివృద్ధి, జాతీయ పురోగతికి దోహదపడే విధంగా ఆవిష్కరణ సంస్కృతిని పెంపొందించడమే లక్ష్యమన్నారు. అంతరిక్ష విప్లవంలో అగ్రగామిగా నిలవడానికి ఆంధ్రప్రదేశ్ కట్టుబాటును ఇది బలపరుస్తుందన్నారు. మరో అతిథి శ్రీహరికోట మాజీ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ వి.శేషగిరిరావు మాట్లాడుతూ దూర ప్రాంతాలకూ టెలివిజన్, మొబైల్ సర్వీసులు, ఇంటర్నెట్ అందించడంలో అంతరిక్ష సాంకేతికత వంతెనలా పనిచేస్తోందన్నారు.దేశీయ ఉపగ్రహ నావిగేషన్ వ్యవస్థ రవాణా, రక్షణ, అత్యవసర సేవల్లో విశ్వసనీయ మార్గదర్శిగా నిలుస్తుందన్నారు. చంద్రయాన్-1 ద్వారా చంద్రుడిపై నీటి అణువుల ఆవిష్కరణ, మంగళయాన్‌తో మొదటి ప్రయత్నంలోనే మార్స్ కక్ష్యలో ప్రవేశం, చంద్రయాన్-3 విజయంతో చంద్రుడి దక్షిణ ధ్రువంపై మృదువైన లా ్యండింగ్-ఇవన్నీ ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేసిన ఘట్టాలని విద్యార్థులతో పంచుకున్నారు. అంతరిక్షం పట్ల ఆసక్తి, ఆవిష్కరణ పట్ల నిబద్ధత, స్వయం సమృద్ధి పట్ల కాంక్ష-ఇవన్నీ కలిసి భారతదేశాన్ని రేపటి ప్రపంచ అంతరిక్ష శక్తిగా తీర్చిదిద్దుతున్నాయన్నారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన అతిథులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జెఎన్‌టియు మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఐ.వీ.మురళీకృష్ణ, ఏఎస్‌టీసీ సెక్రటరీ సీఎల్ నరసింహారావు, విట్ ప్రొఫెసర్ ఈ.శ్రీనివాసరెడ్డి, విజ్ఞాన్స్ వీసి కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్, సిఈవో డాక్టర్ మేఘన కూరపాటి, డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


## రక్తదానం చేయండి-ప్రాణదాతలుగా నిలవండి

**-మాజీ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య**



పొన్నూరు, ఆగస్టు 22,ప్రభాతవార్త: రక్తదానం చేయండి-ప్రాణదాతలుగా నిలవండి అని మెగాస్టార్ చిరంజీవి ఇచ్చిన నినాదాన్ని ఆయన అభిమానులు తూ.చ తప్పకుండా పాటించడం ఆయన పిలుపుకున్న శక్తి అని మాజీ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. పద్మవిభూషణ్, మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ కొణిదెల చిరంజీవి జన్మదినోత్సవాన్ని చిరంజీవి యువత ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కిలారి మాట్లాడుతూ సినీ, రాజకీయ రంగాల్లో తనకు ఎదురులేని నాయకుడిగా చిరంజీవి ఎదిగారన్నారు. సమాజాని సేవలు అందించాలన్నదే చిరంజీవి యొక్క ఆశయమన్నారు.ఆయన ఆశయాన్ని ఆయన అభిమానులు కూడా అందిపుచ్చుకొని సమాజాన్ని సంస్కరించడంలో ముందుకు సాగుతున్నారన్నారు. జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సొంత లాభం కొంత మానుకొని పొరుగువారికి తోడుపడవోయ్ అన్న గురజాడ చెప్పిన మాటలను చిరంజీవి అభిమానులు సమాజానికి సేవ చేస్తున్నారన్నారు. జనసేన రాష్ట్ర మహిళా నాయకురాలు బోని పార్వతీనాయుడు మాట్లాడుతూ రక్తం లేక ఏ గుండె ఆగిపోదదనే ఉద్దేశంతోనే మెగాస్టార్ చిరంజీవి బ్లడ్ బ్యాంకును ఏర్పాటు చేసి నేటికీ నిర్వహిస్తున్నారన్నారు. తొలుత శ్రీ వీరాంజనేయస్వామివారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేకల రవీంద్రబాబు, నాగిశెట్టి సుబ్బారావు, షేక్ కరీముల్లా, చందు శ్రీరాములు, వీరేళ్ళ వెంకటేశ్వరరావు, వల్లంశెట్టి శ్రీధర్, మాదాసు అప్పారావు, యరసాని నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



కొల్లూరు, ఆగస్టు 22 (ప్రభాతవార్త) : మండలంలోని నెసర్లంక గ్రామంలో వ్యవసాయ, ఉద్యాన, ప్రకృతి వ్యవసాయ శాఖల అధికారులు బహుళ పంటల సాగు, వ్యవసాయ సాంకేతిక ప్రకృతి వ్యవసాయంపై శుక్రవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రేపల్లె ఏడిఏ అద్దేపల్లి లక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎం.సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడుతూ బాపట్ల జిల్లాలో రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. రైతులు భూమి వారి నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రకృతి వ్యవసాయ పద్ధతుల లేనటువంటి నవధాన్యములు సాగు 365రోజులు పైరుని కప్పి ఉంచే విధానం ఎరువులకు బదులుగా ఘనజీవామృతం, ద్రవ జీవమృతం వాడాలని సూచించారు. రేపల్లె ఆర్డిఓ ఎన్.రామలక్ష్మి , ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సయ్యద్ భక్తర్ హుస్సేన్, కొల్లూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూధన్‌ప్రసాద్ కొల్లూరు తహాశీల్దార్ బి.వెంకటేశ్వర్లు, కొల్లూరు మండల వ్యవసాయ అధికారి వి.నరేంద్రబాబు, ఉద్యాన అధికారి జి.కళ్యాణ్ చక్రవర్తి, ఏఈఓలు, విఏఏలు, విహెచ్ఎలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## గర్భిణీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు



తెనాలి, ఆగస్టు 22 (ప్రభాతవార్త) : గర్భవతులు తీసుకోవాల్సిన తగు జాగ్రత్తలు, మరియు పౌష్టికాహారము తీసుకొనుట వలన ఉపయోగాలు గురించి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ కొర్ర విజయలక్ష్మి తెలియజేశారు. శుక్రవారం కొలకలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రమందు నందు గర్భిణీ స్త్రీలు పోషకాహార విలువలు కలిగిన ఆహార పదార్థములు తీసుకోవాలని గర్భిణీ స్త్రీలకు సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రములలో కాన్పులు జరగాలని సూచించారు. గర్భవతులుకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించవాలన్నారు. తమ సొంత గ్రామంలో రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సిహెచ్ నీరద 60మంది గర్భవతులకు తమ సొంత నిధులతో పౌష్టికాహారం కిట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో తెనాలి డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ చెన్నకేశవ వెంకట సుబ్బారావు, డాక్టర్ యు.దిలీఫ్, సూపర్‌వైజర్స్ వావిలాల సీతారామశాస్త్రి, ఏఎన్ఎంలు, యం.యల్.హెచ్.పి.లు, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

## పట్టణ టిడిపి నూతన కమిటీ నియామకం

తెనాలి, ఆగస్టు 22 (ప్రభాతవార్త) : పేదల సంక్షేమం కోసమే నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించారని ఎమ్మెల్సీ మాజీ మంత్రి తెనాలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల



సమావేశంలో తెలుగుదేశం పార్టీ నూతన కమిటీలను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రకటించారు. పట్టణ పార్టీ కమిటీ అధ్యక్షులుగా రాష్ట్ర మైనార్టీ నాయకులు మహమ్మద్ ఖుద్దూస్, జనరల్ సెక్రటరీగా వసంతం అశోక్, తెలుగుయూత్ అధ్యక్షులుగా కొల్లూరు శ్రీధర్, మహిళా అధ్యక్షురాలుగా దేవినేని రమాదేవి, జనరల్ సెక్రటరీగా మల్లేశ్వరి, బీసీ సెల్, ఎస్సీ సెల్ మండల కమిటీలను కూడా ఆలపాటి ప్రకటించారు. తెనాలి నియోజకవర్గంలోని కొల్లిపర మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా చిన్నకోటిరెడ్డి, జనరల్ సెక్రటరీతో పాటుగా ఎస్సీ, బీసీ, తదితర కమిటీలను కూడా ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఆల్ పార్టీ మాట్లాడుతూ పార్టీ జెండాను మా ఏజెండా అని తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిందని ప్రతి పేదవాడి సంక్షేమం కోసం స్వర్గీయ నందమూరి తారక రమారావు అన్న అనేక సంక్షేమ పథకాలను అందించారని ఆయన తెలిపారు. గత 42సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీ అన్ని స్థాయి కమిటీలను నియమించడం జరుగుతుందని అందులో భాగంగానే ఇప్పుడు నూతన కమిటీలను ఎన్నుకోవడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్ పార్టీ సంక్షేమం కోసమే కాకుండా రాష్ట్ర అభివృద్ధి కసం, ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేయడం జరుగుతుందని ఎమ్మెల్సీ మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మహమ్మద్ ఖుద్దూస్, కేసన కోటేశ్వరరావు, వసంతం అశోక్, జొన్నాదుల మహేష్, అన్నం పిన్నారావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వరదలకు పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

**---రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్**

కొల్లిపర, ఆగస్టు 22 (ప్రభాతవార్త) : వరదల కారణంగా పల్లపు ప్రాంతాల్లో ఉద్యాన వన పంటలు కొంత మేరా దెబ్బతిన్నట్లుగా అధికారుల నుండి సమాచారం అందుతుందని వారిని తప్పకుండా





ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బొమ్ముువానిపాలెంలో ఆయన పర్యటించారు. కృష్ణానది వరద ఉధృతిని గ్రామంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్‌ను పరిశీలించారు. లంక గ్రామాల్లో జ్వరాలు ఏమైనా ఉన్నాయా అని వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వరదలు తగ్గే వరకు వైద్య సిబ్బంది, మండల స్థాయి అధికారులు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ప్రకాశం బ్యారేజీ నుండి నాలుగు లక్షలక్యూసెక్కుల పైగా నీటిని విడుదల చేయడం జరిగిందన్నారు. అధికారులు కూడా తగు జాగ్రత్తగా ఉండాలని, లంక గ్రామాల ప్రజలను రైతులను అప్రమత్తం చేయాలన్నారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడానికి కలెక్టర్, సబ్ కలెక్టర్‌తో మాట్లాడటం జరిగిందని, రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను అందించనున్నట్లు తెలిపారు. లంక గ్రామాల రైతులు పామాయిల్ టోతలు వేస్తే 90శాతం సబ్సిడీ ఇప్పించనున్నట్లు తెలిపారు. పామాయిల్ తోటలు వేసుకుంటే రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొల్లి రజనీ, తహశీల్దార్ సిద్దార్ధ, డిప్యూటీ ఎంపీడీవో భార్గవ్, ఏడిఎ రాజకుమారి, నాయకులు అడపా నారాయణరెడ్డి, మొవ్వా వెంకయ్య, యర్రు వెంకయ్యనాయుడు, కన్నెగంటి శ్రీనివాసరావు, వివిధశాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కొల్లిపర మండల టిడిపి అధ్యక్షునిగా చినకోటిరెడ్డి



కొల్లిపర, ఆగస్టు 22 (ప్రభాతవార్త) : మండల టిడిపి అధ్యక్షులుగా భీమవరపు చినకోటిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు దుగ్గిరాల మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ వంగాసాంబిరెడ్డి, టిడిపి జిల్లా కార్యదర్శి కంచర్ల అమృతరాజు తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని వల్లభాపురంలో సాంబిరెడ్డి స్వగృమంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ మండల ఉపాధ్యక్షురాలుగా యేమినేని పార్వతి, ప్రధాన కార్యదర్శిగా కుమ్మరి సాల్మన్‌రాజు, తెలుగు మహిళా అధ్యక్షురాలిగా బి.చంద్రిక ఎన్నుకున్నట్లు తెలిపారు.

## కూరగాయల మార్కెట్ యూత్ ఆధ్వర్యంలో మెగాస్టార్ జన్మదిన వేడుకలు:

తెనాలి టౌన్ ఆగస్ట్ 22 (ప్రభాతవార్త): కూరగాయల మార్కెట్ యూత్ ఆధ్వర్యంలో పట్టణంలోని కూరగాయల మార్కెట్ వద్ద, గుంటూరు రమేష్, అడపాల కోటేశ్వరరావుల నిర్వహణలో మెగాస్టార్ చిరంజీవి డెబ్భైయ్యవ జన్మదిన వేడుకలను అభిమానుల కోలాహలనడుమ ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వహించిన సభకు మాజీ కౌన్సిలర్,జనసేన పార్టీ సీనియర్ నాయకులు,ప్రముఖ న్యాయవాది హరిదాసు



గౌరీశంకర్ అధ్యక్షత వహించారు.జనసేన పార్టీ సీనియర్ నాయకులు తోటకూర వెంకట రమణారావు ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడుతూ, తెలుగుచలనచిత్రసీమలో యాభైఏళ్లుగా,ఎన్నోవిజయవంతమైన చిత్రాల్లో నటించి ప్రేక్షకుల మెప్పుపొందటం ఎంతో గర్వకారణమన్నారు. అంతేకాకుండా స్వయంకృషితో చలనచిత్రసీమలో మెగాస్టార్గా ఎదిగి,చిత్రపరిశ్రమకే వన్నె తెచ్చిన మీ సినీ ప్రస్థానం ప్రతిఒక్కరికి స్ఫూర్తి దాయకమన్నారు.తెలుగింటి అభిమాన నటుడుగా ప్రజల హృదయాల్లో తనదయిన ముద్ర వేసుకున్న పద్మభూషణ్ మెగాస్టార్ చిరంజీవికి అభిమానులైన మీఅందరికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నానన్నారు.అనంతరం టపాసులు కాల్చి, డెబ్భైకిలోల కేక్ కట్ చేశారు. తదుపరి అన్నదానం చేశారు.ఈ కార్యక్రమంలో దివ్వెల వెంకయ్యనాయుడు,అమ్మిశెట్టి హరికృష్ణ,వల్లెం మురళి,చెట్టుపల్లి శ్రీనివాసరావు,షేక్ ఇస్మాయిల్, చదలవాడ వేణు,పెద్ద సంఖ్యలో చిరంజీవి అభిమానులు,పాల్గొన్నారు.

## రైతులకు సరిపడినంత యూరియా పంపిణీ చేయాలి

తెనాలి ఆగస్ట్ 22 (ప్రభాతవార్త): ఇటీవల కురిసిన భారీవర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను, జిల్లారైతుసంఘం నాయకులు శుక్రవారం పరిశీలించారు. మండలంలోని తెలప్రోలు, కంచర్లపాలెం గ్రామాల్లో పర్యటించిన రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ అధికవర్షాల వల్ల పంటలు దెబ్బతిని పెట్టుబడి మొత్తం రైతులు నష్టపోయారని,కావున రైతులకు సరిపడినంత యూరియా ను అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా వెదపెట్టిన పొలాల్లో వరిపైరు తుడిచిపెట్టుకుపోయిందని, రైతులు ఎకరానికి పదివేల రూపాయలు ఖర్చుపెట్టి వెద పెట్టారని,పెట్టుబడి అంతా నష్టపోయారని,కొత్తగా వరినారు కొని మళ్ళీ నాటుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని,ఈ పరిస్థితిలో ప్రభుత్వం రైతులకు అండగా వుండాలన్నారు. ఆయన వెంట రైతుసంఘం నాయకులు,పెద్దఎత్తున రైతులు పాల్గొన్నారు.

## వార్డుల్లో మున్సిపల్ కమీషనర్ పర్యటన

తెనాలి మున్సిపాలిటీ ఆగస్ట్ 22 (ప్రభాతవార్త): పట్టణంలో పలువార్డుల్లో మున్సిపల్ కమీషనర్ వివిఎం. లక్ష్మీ ్మపతిరావు పర్యటించారు. శుక్రవారం ఉదయం పంతొమ్మిదో వార్డులోని టెలిఫోన్ ఎక్సంజ్ రోడ్డులో ఉన్న డ్రెయిన్ నందు వ్యర్థాలను పారిశుధ్య సిబ్బందిచే తొలగింపజేసి, అక్కడి పారిశుధ్య నిర్వహణ మరింత మెరుగుపరచాలని,ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని శానిటరీ ఇన్స్పెక్టర్లకు, పారిశుధ్య సిబ్బందికి సూచించారు.

## ముగ్గురు పేకటరాయిళ్ల అరెస్టు

కొల్లూరు, ఆగస్టు 22 (ప్రభాతవార్త) : మండలంలోని ఈపూరు గ్రామ శివారులో కొందరు పేకాట ఆడుతున్నారని 112కాల్ ద్వారా శుక్రవారం స్థానిక కొల్లూరు పోలీస్ స్టేషన్‌కు సమాచారం రావడంతో శరవేగంగా స్పందించిన కొల్లూరు ఎస్సై జానకి అమరవర్ధన్ తన సిబ్బందితో ఈపూరు గ్రామ శివారులో పేకాట శిబిరంపై మెరుపు దాడి చేసి పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 2,100నగదు స్వాధీనం పర్చుకున్నారు. స్థానిక ప్రజల సహకారంతోనే నేరాలను అరికట్టగలమని కొల్లూరు ఎస్సై తెలిపారు. స్థానిక ప్రజలు టోల్‌ఫ్రీ నెం.112కాల్ చేసి అందజేసిన సంచారం మేరకు పేకాట శిబిరంపై దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు.

## గురజాల నియోజకవర్గంలో టిడిపి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో చికెన్ మాఫీయా

నకరికల్లు, ఆగస్టు 22 ప్రభాతవార్త : గురజాల నియోజక వర్గంలో స్థానిక టిడిపి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో చికెన్ మాఫియా నడుస్తుందనిమాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దాచేపల్లి మండలంలో చికెన్ బాషా అనే టిడిపి నాయకుడు ఆధ్వర్యంలో కోడి కుంభకోణం అధికార పార్టీ నిర్వహిస్తుందన్నారు. తెలంగాణ నుండి వచ్చే కోళ్ళను మరో వ్యాపారి ఎవ్వరూ తెచ్చుకునే అవకాశం లేకుండా పోలీస్‌లతో కేసులు పెట్టి వేధించి వారి షాపులు మూయిస్తున్నారని తెలిపారు. సాధారణంగా ప్రస్తుతం ఉన్న లైవ్ కోడి కేజీ రూ.90-95లు ఉంటే టిడిపి నాయకులు కేజీ లైవ్ కోడి ని రూ.125లకుపెంచి విక్రయాలు చేయటం దారుణమన్నారు. ఇటువంటి నీచమైన కుంభకోణాలకు టిడిపి ఎమ్మెల్యే పాల్పడుతూ నీతులు వల్లిస్తున్నారనివిమర్శించారు. నియోజకవర్గంలో పేకాట క్లబ్బులు, వీధికొక బెల్ట్‌షాపులు, మైనింగ్, వైన్ షాపులు ఇష్టానుసారం అవినీతి చేస్తున్నారనిపేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏడాదిన్నర కాలంలో తెలుగుదేశం బ్రష్టుపట్టి పోయిందన్నారు విజయవాడలో కూర్చొని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా తమ ఎమ్మెల్యేలు తప్పులు చేస్తున్నారని , అవినీతికి పాల్పడుతున్నారని చెప్పాటం ఇక్కడ క్షేత్రస్థాయిలో వీరు చేసే అక్రమాలకు అడ్డు లేకుండా పోయిందని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి విమర్శించారు.



## ఏఎంరెడ్డి విద్యాసంస్థల కార్యదర్శికి రవీంద్రనాథ్ ఠాగూర్ నేషనల్ అవార్డు

నరసరావుపేట, ఆగస్టు 22 ప్రభాతవార్త : ఏఎంరెడ్డి విద్యాసంస్థల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి కి ప్రతిష్టాత్మకమైన రవీంద్రనాథ్‌ఠాగూర్ నేషనల్ అవార్డ్ లభించింది. చేంజ్ మేకర్ ఇన్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్నోవేషన్ విభాగంలో వారు ఈ అవార్డుకి ఎంపికయ్యారు.శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఎడ్యుటెక్ ఎక్స్-2025 కార్యక్రమంలో ప్రముఖులు అవార్డు వారికి అందించారు. అవార్డు గ్రహీత అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యారంగ పురస్కారం అందుకోవటం గొప్ప గౌరవంగా ఉందన్నారు. ఉన్నత విద్యలో విద్యార్థి కేంద్రిత పద్ధతులను , వారిలోని సృజనాత్మకతను , ఇన్నోవేషన్ ఆధారిత బోధన విధానాలను అమలు చేయటం ద్వారా సమాజానికి ఉపయోగకరమైన ప్రతిభను అందిస్తున్నట్లు తెలిపారు. నూతన అవిష్కరణలతో తమ విద్యార్థులకు గ్లోబల్ స్టాండర్డ్స్ అందించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఈ పురస్కారం పల్నాడు జిల్లా ఉన్నత విద్యాకు లభించిన్నట్లు భావిస్తున్నామని అవార్డు గ్రహీత అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. జిల్లా ప్రముఖులు, అధికారులు వారికి శుభకాంక్షలు తెలిపారు.



## మహంకాళి అమ్మవారి ఆలయ నిర్మాణానికి రూ.1,01,116 విరాళం



నరసరావుపేట, ఆగస్టు 22 ప్రభాతవార్త : మండలంలోని ఇస్సపాలెం గ్రామంలో వేంచేసియున్న మహంకాళి ఆలయం పునర్నిర్మాణంకు పట్టణానికి చెందిన కోమిటినేని నాసరయ్య-రాజ్యలక్ష్మి విరాళం అందించారు. ఆలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమ వివరాలనుఆలయ కార్యనిర్వహణధికారి నలబోతు మాధవి దేవి తెలిపారు. కె నాసరయ్య-రాజ్యలక్ష్మి దంపతులు ఒక లక్ష వెయ్యి నూటపదహారు (రూ.1,01,116లు) ఆలయ నిర్మాణానికి చెక్కు రూపంలో అందించారని తెలిపారు. అమ్మవారి దర్శన అనంతరం వారికి తీర్ధ ప్రసాదాలు, అమ్మవారి శేషవస్త్రం అర్చకులు అందించారు. నిర్మాణానికి దాతలు అందించే విరాళంకు ఆదాయపన్ను మినహాయింపు ఉంటుందనిఇవో మాధవిదేవి తెలిపారు.

## ఇండియన్ బ్యాంక్ సేవలను వినయోగించుకోవాలి

నరసరావుపేట క్రైం, ఆగస్టు 22 ప్రభాతవార్త : ఇండియన్ బ్యాంక్ నరసరావుపేట శాఖ అందించే వివిధ రకాల బ్యాకింగ్ సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని శుక్రవారం తిరుమల మ్యాక్సీకేర్ మల్టీస్పెషాలటీ హాస్పిటల్స్ ఛైర్మన్ డాక్టర్ యనమదల వెంకట్రామయ్య అన్నారు. బ్యాంకు అధికారులు వినియోగదారులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారిని ఘనంగా సత్కారించారు. బ్యాంక్‌ద్వాక్రా గ్రూప్‌లకు సంబంధించి ముఖ్యంగా అనేక రకాల రుణాలు అందిస్తుందన్నారు. రైతులు, వ్యాపారులు, చిరు వర్తకుల కొరకు ఇండియన్ బ్యాంక్ అందించే రుణాలపై అవగాహన కల్గి ఉండాలని సూచించారు. రుణాలు తీసుకునే వారు వాటిని చెల్లించే పద్ధతిలో ఎటువంటి పొరపాటు చేయవద్దన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైతం అనేక పథకాలను తీసుకుని రావటం జరుగుతుందని డాక్టర్ యనమదల వెంకట్రామయ్య వివరించారు. కార్యక్రమంలో డ్వాక్రా గ్రూప్ సభ్యులు, బ్యాంక్ ఖాతాదారులు పాల్గొన్నారు.



## ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు-పాల్గొన్న ఎమ్మెల్యే

రొంపిచర్ల, ఆగస్టు 22 ప్రభాతవార్త : పట్టణంలోని పలు ప్రాంతాలలో ఘనంగా మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను చిరంజీవి యువత ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. స్థానిక కూరగాయాల మార్కెట్ వద్ద నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు హాజరయ్యారు. కార్యక్రమాన్ని యువత నాయకులు అద్దెపల్లి ఆనంద్, గుప్తా శ్రీకాంత్‌లు పర్యవేక్షించారు. కాపు సంఘం నాయకులు రాయల శ్రీనివాసరావు, పోతుల శంకర్, అల్లంశెట్టి మోహన్‌రావు, రామిశెట్టి సుబ్బారావు, ఢిల్లీ నాయుడు, రంగిశెట్టి రామకృష్ణ, కృష్ణంశెట్టి గోవిందరావు, బెల కొండ అనిల్ తదితరులు పాల్గొని విజయవంతం చేసారు. చిరంజీవి అభిమానులు ఏర్పాటు చేసిన కేక్‌ను ఎమ్మెల్యే కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టారు. సినిమాలలో రీల్ హిరోగా, నిజ జీవితంలో రియల్‌హిరోగా చిరంజీవి నిలిచారని తెలిపారు. బ్లడ్ బ్యాంక్, ఐ బ్యాంక్ వంటివి నిర్వహించి యువతకు వారు ఆదర్శంగా నిలిచారని తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబును చిరంజీవి యువత నాయకులు ఘనంగా సత్కారించారు.



## కాచవరం కాల్వ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే రాజగోపాల్ ఆదేశం

జగ్గయ్యపేట, ఆగస్టు 22, ప్రభాతవార్త : జగ్గయ్యపేట మండల పరిధిలోని కాచవరం కాల్వద్వారా త్రిపురవరం, అన్నవరం గ్రామాలకు సాగునీరు రాని పరిస్థితుల్లో రైతుల, సాగునీటి సంఘ ప్రతినిధుల కోరికపై స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) శుక్రవారం నీటి సంఘ అధ్యక్షులు, రైతులతో కలిసి కాచవరం కాల్వ పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. త్రిపురవరం, అన్నవరం ఎక్స్‌టెన్షన్ భూములకు నీటి లభ్యత లేకపోవటంతో అభివృద్ధి పనులు అక్విడక్ట్, లైన్నింగ్ పనుల నిర్వహణకు



సాంకేతిక సిబ్బంది తక్షణమే తగిన అంచనాలు రూపొందించాలని ఎమ్మెల్యే రాజగోపాల్ ఆదేశించారు. ఈకార క్రమంలో కాచవరం సాగునీటి సంఘ అధ్యక్షులు కానూరి కిషోర్, గ్రామ పెద్దలు కొల్లి మార్షల్‌స్టాలిన్, అన్నవరం గ్రామ రైతు నాయకులు దోగుపర్తి విష్ణు, కీతా శ్రీను, భద్రం తదితరులు పాల్గొన్నారు.

**సిఎం సహాయ నిధి నిరుపేదల పాలిట వరం**

ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరంగా పరిణమిస్తుందని, కార్పొరేట్ వైద్యం అందించేందుకు కూటమి ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుందని స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ అన్నారు. శుక్రవారం తన నివాసంలో 13 మందికి వైద్య నిమిత్తం మంజూరైన రూ.5,00,654ల విలువైన చెక్కులను రాజగోపాల్ తన నివాసంలో పంపిణీచేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు కన్నెబోయిన రామలక్ష్మి, గొట్టే నాగరాజు, నాయకులు మల్లెల కొండయ్య, వేదులాపురి సైదా, గాలం శ్రీను, షేక్ షబ్బు తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానంతో చిరంజీవి జన్మదిన వేడుక

జగ్గయ్యపేట, ఆగస్టు 22, ప్రభాతవార్త :జగ్గయ్యపేట పట్టణంలోని విజయ డిజిటల్స్ వద్ద పద్మవిభూషణ్, మెగాస్టార్ డాక్టర్ చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం మెగా అభిమానులు, జనసేన పార్టీ నాయకులు భారీ అన్నదాన సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత కేక్‌కట్‌చేసి కేక్‌తోపాటు మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం పేదలు, బాటసారులకు అన్నదానం ప్రారంభించారు. చిరంజీవి జన్మదిన వేడుకలను నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహించినట్లు నేతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర చిరంజీవి యువత నాయకులు షేక్ మోసిన్, జిల్లా చిరంజీవి యువత నాయకులు వల్లపునేని గోవింద్, లింగాల అరవింద్, జనసేన మండలపార్టీ అధ్యక్షులు తులసి బ్రహ్మం, నేతలు పొట్లకాయల నాగయ్య, జక్కంపూడి మల్లిఖార్జున్, మేడూరి వెంకట్, తులసి చినబ్రహ్మం, ఆసిఫ్, వేముల రాజు, వీర మహిళలు తుడుము శైలజ, చిలుకూరి శిరీష, రమణి తదితరులు పాల్గొన్నారు.



## భక్తులకు ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలతి : సిపి రాజశేఖరబాబు

విజయవాడ క్రైం,ఆగస్టు 22,ప్రభాతవార్త: దసరా శరన్నవరాత్రుల సందర్భంగా భక్తులకు ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని సిపి రాజశేఖరబాబు టెంపుల్ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. దసరా శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా చేయబోయే



ఏర్పాట్లను శుక్రవారం ఆయన సిబ్బంది,దేవస్థాన ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. దసరా శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని భక్తులకు ఎటువంటి అసౌకర్యం కల్గకుండా ప్రశాంతమైన వాతావరణంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా భక్తులందరూ ఆనందోత్సాహాలతో శాంతి భద్రతల మధ్య ప్రశాంతమైన వాతావరణలో అమ్మవారి దర్శనం చేసుకోవాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేయబోయే భద్రతా ఏర్పాట్లను పరిశీలించి ఈ సందర్భంగా అధికారులకు ఆయన పలు సూచనలిచ్చారు. ఈ నేపథ్యంలో ఆయన ఇతర పోలీసు అధికారులతో కలిసి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల కోసం మున్సిపల్ ఆఫీసు వద్ద,హెడ్ వాటర్ వర్క్స్ వద్ద ఏర్పాటు చేసే హోల్డింగ్ ఏరియాలను పరిశీలించి ఏ విధంగా బారికేడింగ్ చేయాలి,భక్తులు లోనికి వెళ్ళడానికి బయటకు రావడానికి ఏర్పాటు చేయబోయే మార్గాల గురించి టెంపుల్ ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి వారికి తగు సూచనలు చేశారు. అదే విధంగా రైల్వేస్టేషన్,బస్టాండు పరిసరాలు,పద్మావతి ఘాట్,సీతమ్మ వారి స్నాన ఘాట్,భవాని,పున్నమి ఘాట్లను,వినాయకుని గుడి వద్ద నుండి అమ్మవారి టెంపుల్ వరకు భక్తుల దర శన నిమిత్తం రావడానికి ఏర్పాటు చేసిన క్యూలైన్లను,అదే విధంగా దర్శనాంతరం భక్తులు వెళ్ళే మార్గాలను పరిశీలించి,ఎక్కడా ఇబ్బందులు లేకుండా పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని టెంపుల్ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. అదే విధంగా క్యూలైన్లు,ఘాట్లు,పార్కింగ్ ప్రదేశాలు,ప్రసాదం కౌంటర్లు,ఇంతర ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లపై పోలీసు అధికారులకు తగు సూచనలు,సలహాలను అందించారు.ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు పశ్చిమ జోన్ ఇన్‌ఛార్జి .జ డిసిపి జి.రామకృష్ణ,ఏసిపిలు,సిఐలు,శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థాన ఇంజనీరింగ్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## ఇకపై ఇన్సులిన్ ఇన్‌హెలర్లు..- ఇన్సులిన్ ఇంజెక్షన్లకు వీడ్కోలు

విజయవాడ, ఆగస్టు 22, ప్రభాతవార్త : మధుమేహ వ్యాధిగ్రస్తులకు త్వరలో ఇన్సులిన్ ఇంజెక్షన్ బాద నుంచి విముక్తి లభించనుందని, ఇకపై ఇన్సులిన్ ఇన్‌హెలర్లు అందుబాటులోకి రానున్నాయని ప్రఖ్యాత డయాబెటాలజిస్ట్ యలమంచి డయాబెటిస్ రీసెర్చ్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ యలమంచి సదాశివరావు తెలిపారు. ఆ క్రమంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ నుంచి రెండు సిఎంఈ క్రెడిట్ పాయింట్లు కూడా లభించాయని ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో వున్న అత్యాధునిక ఆవిష్కరణల వైద్యుల వేదికగా ఎండో డయాబ్ కాన్ 2025 నిర్వహించనున్నామని ఆయన తెలిపారు. అదేసమమంలో ఎండో డయాబ్ కాన్ 2025 బ్రోచర్‌ను ఆవిష్కరించారు.



## గణేష్ ఉత్సవాలపై అధికారులతో ఆర్డీఓ సమీక్ష

తిరువూరు, ఆగష్టు 22, ప్రభాతవార్త :బాద్రపద మాసంలో రాబోయే గణేష్ ఉత్సవాల దృష్ట్యా తిరువూరు రెవెన్యూ డివిజినల్ కార్యాలయంలో రెవిన్యూ డివిజినల్ అధికారి కె.మాధురి అధ్యక్షతన



డివిజన్‌లో ఉన్న రెవిన్యూ పోలీస్ మరియు వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.

## యువ ఇంజనీర్లకు రోబోఎక్స్‌పో 2025

పెనమలూరు ఆగస్టు22,ప్రభాతవార్త : యువ ఇంజనీర్లలో సాంకేతిక నైపుణ్యం పెంపొందించేందుకు సెప్టెంబరు 18,19తేదీలలో జాతీయస్థాయి లోరోబోఎక్స్‌పో 2025 పోటీలు నిర్వహించనున్నామని సిద్దార్థ యూనివర్సిటీ వైస్‌ఛాన్స్‌లర్ డా.పి.వి.రావు అన్నారు.ఈ మేరకు శుక్రవారం కానూరు వి.ఆర్.సిద్దార్థ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ యూనివర్సిటీలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇది పోటీ కాదని ఆవిష్కరణలను ప్రోత్సహించే వేడుకని విద్యార్థులు తరగతి గోడలు



దాటి ఆలోచించి వారి బంగారు భవిష్యత్తును నిర్మించుకునేందుకు అవకాశమని తెలిపారు.మెకానికల్ విభాగాధిపతి నర్రా రవికుమార్ మాట్లాడుతూ రెండు రోజులపాటు సాగే ఈ రోబో ఎక్స్‌పోలో విజేతలకు 2లక్షల వరకు బహుమతులు ప్రకటించబడ్డాయని తెలిపారు.సిద్దార్థ అకాడమీ ఆఫ్ జనరల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఎస్ఏజీటిఈ యొక్క గోల్డెన్‌జూబ్లీ వేడుకల సందర్భంగా రోబోటిక్స్ ఎక్స్‌పో నిర్వహించనున్నామని తెలిపారు.ఈ సందర్భంగా చేసిన పోస్టర్ విడుదల కార్యక్రమంలో ప్రో వైస్‌ఛాన్స్‌లర్ ఏ.వి.రత్నప్రసాద్, రిజిస్ట్రార్ ఎం.రవిచంద్,డీన్లు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రానికి చాపలు, పలకలు బహూకరణ

జగ్గయ్యపేట, ఆగస్టు 22, ప్రభాతవార్త :పట్టణంలోని 22, 24 వార్డులోగల అంగన్‌వాడీ కేంద్రానికి వాసవీ సేవా సమితి ప్రతినిధులు చాపలు, పలకలు బహూకరించారు. స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ సోదరుడు సాయిప్రసాద్ పుట్టిన రోజు సందర్భంగా శ్రీవాసవీ సేవా సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాకరపర్తి సోమేశ్వరరావు ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు పేరూరి నరసింహారావు, జిల్లా కార్యదర్శి పెనుగొండ రామకృష్ణ, జిల్లా కోశాధికారి కంభంపాటి రవికుమార్, వార్డు కౌన్సిలర్



గొట్టే నాగరాజు, కురివెళ్ళ వాసు, అంగన్‌వాడీ టీచర్ యలదండి కనకలక్ష్మి, సహాయకురాలు షేక్ అఖిల బేగం పాల్గొన్నారు.

**బంగారం కొట్ల కూడలిలో అన్నదానం**

పట్టణంలోని ముక్త్యాల రోడ్‌లో బంగారం కొట్ల కూడలి వద్ద ఆర్యవైశ్య నాయకులు భారీ ఎత్తున అన్నదాన సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే సోదరుడు సాయిప్రసాద్ పుట్టిన రోజు సందర్భంగా ఏర్పాటుచేసిన అన్నదాన శిబిరాన్ని మాజీమున్సిపల్ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు, టిడిపి యువనేత శ్రీరాం ధనుంజయ ప్రారంభించారు. పెనుగొండ వెంకటసతీష్, తొండపు జగన్మోహనరావు వితరణతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పేరూరి నరసింహారావు, పి రామకృష్ణ, బండారు రవికుమార్, చిన్నం ప్రసాదు, నోముల సుదర్శన్, రాయపూడి శ్రీనివాసరావు, ఎం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీల అభివృద్ధికి బీజేపీ ఎనలేని కృషి: కట్టా సుబ్బారావు

వినుకొండ, ఆగస్టు 22, ప్రభాతవార్త: ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీల అభివృద్ధికి బీజేపీ ఎనలేని కృషి చేస్తుందని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కట్టా సుబ్బారావు అన్నారు. శుక్రవారం మండలంలోని వితంరాజుపల్లి గ్రామంలోని వయ్యకంటి శివప్రసాద్ యానాదుల కాలనీలో ఆయన పర్యటించారు. బీజేపీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించి ఈ నెల 30 విజయవాడ నందు బీజేపీ ఆధ్వర్యంలో జరిగే స్ఫూర్తి కార్యక్రమానికి భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కాలనీలో నివాసం ఉంటున్న నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శివాజీ ,వెంకయ్య,కృష్ణ,కోటయ్య,కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



## 'దాబాల్లో మద్యం సరఫరా చేస్తే కఠిన చర్యలు'



వినుకొండ,ఆగస్టు22,ప్రభాతవార్త: ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టణంలోని దాబాల్లో ఆకస్మిక తనిఖీలు శుక్రవారం నిర్వహించారు. దాబాల్లో,బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం అనుమతి లేదని మద్యం సేవించినా,యాజమానులు సరఫరా చేసినా చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎక్సైజ్ ఇంచార్జి ఇన్స్‌పెక్టర్ డి. వెంకటేశ్వర్లు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సబ్ ఇన్స్‌పెక్టర్ సిహెచ్ వినీల,కానిస్టేబుల్స్ కె.వి గురుస్వామి,ఎం శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

## వినుకొండలో ప్రెస్‌క్లబ్ ప్రారంభం

వినుకొండ,ఆగస్టు22,ప్రభాతవార్త: వినుకొండలో విలేకరులు తమ సొంత ప్రెస్‌క్లబ్‌ను ఏర్పాటు చేసుకున్నారు. పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ టవర్ పక్కన ఉన్న ఈ ప్రెస్‌క్లబ్‌ను మున్సిపల్ కమీషనర్ సుభాష్‌చంద్ర బోస్ శుక్రవారం ప్రారంభించారు. కారా్యలయ ఏర్పాటుకు సహాయ,సహకారాలు అందించిన ప్రభుత్వ చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులుకు,మున్సిపల్ కమీషనర్‌కు విలేకరులు కృతజ్ఞతలు తెలిపారు. వినుకొండలోని జర్నలిస్టులందరికీ ఒక వేదిగా ఈ ప్రెస్‌క్లబ్ ఉపయోగపడనుంది.



## మెగాస్టార్ చిరంజీవి జీవితం స్ఫూర్తిదాయకం

మంగళగిరి, ఆగస్టు 22, ప్రభాతవార్త : మెగాస్టార్ చిరంజీవి జీవితం స్ఫూర్తిదాయకం అని మంగళగిరి మున్సిపల్ మాజీ చైర్మన్ జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ నాయకులు గంజి చిరంజీవి అన్నారు. పద్మ విభూషణ్ మెగాస్టార్ డాక్టర్ చిరంజీవి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని, చిరంజీవి యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు కంకణాల శంకర్ ఆధ్వర్యంలో మంగళగిరి మండలం చినకాకాని పరిధి లిటిల్ విలేజ్ రెస్టారెంట్ నందు శుక్రవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. చిరంజీవి యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు కంకణాల శంకర్ మాట్లాడుతూ మెగాస్టార్ ను స్ఫూర్తిగా తీసుకొని యువత సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. 70 ఏళ్ల వయసులోనూ మెగాస్టార్ చిరంజీవి క్రేజ్ ఏ మాత్రం తగ్గలేదని అన్నారు. విశ్వంభర చిత్రానికి సంబంధించి కొన్ని సన్నివేశాలు అద్భుతంగా ఉన్నాయని పేర్కొన్నారు. కరోనా సమయంలో మెగాస్టార్ చిరంజీవి పిలుపునిచ్చిన నేపథ్యంలో మంగళగిరి ప్రాంతంలో ఆక్సిజన్ సిలిండర్లను పంపిణీ చేసి ఎన్నో విలువైన ప్రాణాలను కాపాడినట్లు చెప్పారు.లిటిల్ విలేజ్ రెస్టారెంట్ అధినేత కన్నెగంటి వెంకటేశ్వరరావు, బడే కోమలి, జనసేన ఏంటీఎంసీ అధ్యక్షులు మునగపాటి మారుతి, తోట శీను, తదితరులు పాల్గొన్నారు





## పెదవడ్లపూడిలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం



మంగళగిరి, ఆగస్టు 22 ప్రభాతవార్త : మంగళగిరి నియోజకవర్గంలోని మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించి వారిలో ఆర్థిక పరిపుష్టి కల్పించడమే మంత్రి నారా లోకేష్ లక్ష్యమని రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య తెలిపారు. మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామంలో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ వారి సహకారంతో మహిళల కోసం ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రంను రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య స్థానిక నాయకులతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నందం అబద్దయ్య, టీటీడీ సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళలకు ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. మంగళగిరి మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్, మండల మహిళా అధ్యక్షురాలు గడ్డిపాటి అపర్ణ, యేళ్ళ శివరామయ్య, మాదల రమేష్ బాబు, పందిపాటి ఏసు ప్రసాద్, అన్నే చంద్రశేఖర్, చిట్టిబొమ్మ వెంకటేశ్వరరావు, యేమినేని సుధాకర్, అన్నే నందకిషోర్, సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల శుభ్రత ప్రజలందరి బాధ్యత

తాడేపల్లి,ఆగష్టు 22,ప్రభాతవార్త : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉంటుందని,తద్వారా అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చని కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీ విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్ ప్రజలకు సూచించారు.శుక్రవారం మండల పరిధిలోని చిర్రావూరు గ్రామంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఏఐ అండ్ డిఎస్,సీఎస్సీ-2 విభాగాల వాలంటీర్లు ఇంటింటికి తిరిగి చెత్తను డ్రైనీజీలు,రోడ్లపై వేయకుండా చెత్త రిక్షాలో వేసి ఇళ్ళను,వర్షపు నీటిని మురుగునీటిని పరిసరాల్లో నిల్వ ఉండకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించినట్లు ఏఐ అండ్ డిఎస్ విభాగాధిపతి డాక్టర్ విఎస్‌వి ప్రభాకర్ తెలిపారు.కాల్వల్లో మురుగు పేరుకుపోవడం వలన,ఖాళీ కొబ్బరి బొండాలు,టైర్లు వాడని నీటి తొట్టేల్లో దోమలు వృద్ధి చెంది మలేరియా,చికెన్ గున్యా,వంటి జ్వరాలు ప్రబలటానికి ఆస్కారం ఉంటుందని సీఎస్సీ-3 విభాగాధిపతి డాక్టర్ ఏ.సెంథిల్ అథితన్ వివరించారు.ఎన్ఎస్ఎస్ ఫీల్డ్ కోఆర్డినేటర్ పి.సురేష్,వాలంటీర్లను యూనివర్సిటీ విసి డాక్టర్ జి.పార్ధసారధివర్మ,ప్రొఫెసర్ విసీలు డాక్టర్ ఏవిఎస్ ప్రసాద్,డాక్టర్ ఎన్.వెంకట్రామ్,డాక్టర్ కె.రాజశేఖరరావు,డీన్ డాక్టర్ హబీబుల్లా,ప్రొగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీకాంత్‌రెడ్డి తదితరులు అభినందించారు.



## కెఎల్‌యు డైరెక్టర్ పిసిని సాయి విజయ్‌కి జాతీయ పురస్కారం

తాడేపల్లి,ఆగష్టు 22,ప్రభాతవార్త : హైదరాబాద్‌లోని ఎన్ఈఓ కన్వెన్షన్,జన్వాడాలో ఇటీవల ఈకే ఉపదేశ మీడియా ఆధ్వర్యంలో జరిగిన రవీంద్రనాద్ ఠాగూర్ నేషనల్ అవార్డ్స్ ఫర్ హయ్యార్ ఎడ్యుకేషన్ కార్యక్రమంలో కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీ కి చెందిన స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ డైరెక్టర్ పిసిని సాయి విజయ్‌కి చేంజ్ మేకర్ ఇన్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్నోవేషన్ అవార్డు లభించింది.ఈ పురస్కారం ఆయన విద్యార్థుల కోసం నిరంతర కృషి,నిబద్ధత,వినూత్నమైన పద్ధతుల ద్వారా యువత జీవితానికి అవసరమైన నైపుణ్యాలను అందించడానికి చేసిన అసాధారణ కృషికి గుర్తింపుగా ప్రధానం చేయబడింది.సాయి విజయ్ ఈ ప్రతిష్టాత్మక అవార్డు నిజమైన విద్యారంగంలో మార్పు సాధించనందుకు యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పి.ఎస్.వర్మ, ప్రొఫెసర్ విసిలు డాక్టర్ వెంకట్రామ్,డాక్టర్ కె.రాజశేఖరరావు,రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు,విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్,తదితరులు అభినందనలు తెలిపారు.




## గాదె పిచ్చిరెడ్డిని సన్మానించిన దానబోయిన సుందరరావు యాదవ్

తాడేపల్లి,ఆగష్టు 22,ప్రభాతవార్త : పెదకోనేరు వద్దనున్న ది మంగళగిరి ప్రాధమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో ఇటీవల సంఘం చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేసిన గాదె పిచ్చిరెడ్డిని శుక్రవారం టిడిపి బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిది దానబోయిన సుందరరావు యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం పలువురు దేశం నాయకులు కలసి అభినందించారు. అనంతరం దానబోయిన సుందర్రావు యాదవ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ అవిర్భావం నుంచి నాటి మాజీమంత్రి ఎంఎస్ఎస్ కోటేశ్వరరావు ముఖ్య అనుచరునిగా ఉంటూ,నాటి నుంచి నేటి వరకు పార్టీ అభివృద్ధికి విశేషంగా కృషిచేస్తున్న పిచ్చిరెడ్డిని పార్టీ గుర్తించి చైర్మన్ పదవి ఇవ్వడం అభినందనీయమన్నారు.రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌పార్టీలో సీనియర్‌ను గుర్తించి పదవులు ఇవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు.కార్యక్రమంలో టిడిపి నాయకులు చింకా కోటేశ్వరరావు,దానబోయిన రామారావు,రుద్రు మురళీ,దానబోయిన శివశంకరరావు,మద్దుల శ్రీకాంత్,కాపు విశ్రాంత ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు గుడిపాటి చిన్న తిరుపతి నాయుడు,సీపిఎం నాయకులు కుర్రా ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



23-8Pg5 9th_23-8Pg5.qxd 8/22/2025 10:11 PM Page 1





# శ్రీలంక మాజీ అధ్యక్షుడు విక్రమ్ సింఘే అరెస్టు

## ప్రభుత్వ నిధుల దుర్వినియోగం ఆరోపణలు

### సిఐడి అదుపులో మాజీ అధ్యక్షుడు

**కొలంబో, ఆగస్టు 22:** శ్రీలంక మాజీ అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘేను శుక్రవారం అరెస్టు చేశారు. ప్రభుత్వ నిధుల దుర్వినియోగానికి సంబంధించి ఆయనపై తీవ్ర ఆరోపణలు రావడంతో ఈ చర్యలు తీసుకొన్నారు. ఈ విషయాన్ని స్థానిక పోలీసు అధికారులు ధ్రువీకరించినట్లు ఓ అంతర్జాతీయ వార్తా సంస్థ పేర్కొంది. ప్రస్తుతం విక్రమసింఘే కొలంబో సిఐడి ఆధీనంలో ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఇప్పటికే ఆయనకు సమన్లు అందజేసి విచారణ కూడా చేపట్టారు. 2023 సెప్టెంబరులో విక్రమసింఘే లండన్‌లో పర్యటించారు. తన భార్యతో కలిసి ఓ విశ్వవిద్యాలయ గ్రాడ్యుయేషన్ వేడుకలో పాల్గొన్నారు. ఆ విస్తృత విదేశీ పర్యటన అధికారంగా చేపట్టింది కాదని తర్వాత ప్రకటించారు. కానీ, దానికి ప్రభుత్వ నిధులను వినియోగించారు.

హవానాలో జి-77 సద స్సులో హాజరై తిరిగి వస్తూ లండన్‌కు వెళ్లిన ప్పుడు తన భార్య ఖర్చులను ఆమే పెట్టు కుందని ప్రభుత్వ నిధులను వినియోగించలేదని విక్రమసింఘే వాదిస్తున్నారు. కానీ, సిఐడి మాత్రం ఆ పర్యటనలో ప్రభుత్వ సొమ్మునే వాడారని.. దీంతోపాటు ఆయన అంగరక్షకులకు కూడా చెల్లింపులు చేశారని చెబుతోంది. ఇక ఆయనను ఫైనాన్షియల్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ విచారించి కొలంబో ఫోర్ట్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చింది.

రణిల్ విక్రమసింఘే 2022లో అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటి వరకు పదవిలో ఉన్న గొటబయ రాజపక్సె వైదొలగడంతో ఈ బాధ్యతలను స్వీకరించారు. దేశ ఆర్థిక వ్యవస్థను స్థిరీకరించారన్న పేరును ఆయన సంపాదించుకున్నారు. 2024 ఎన్నికల్లో ఆయన ఓటమి పాలయ్యారు.



# దారికి రాకుంటే.. నరకమే..

## హమాస్‌కు ఇజ్రాయెల్ హెచ్చరిక

**టెల్‌అవీవ్, ఆగస్టు 22:** హమాస్ ఆయుధాలు విడిచిపెట్టకపోతే గాజా నగరాన్ని నాశనం చేస్తామని ఇజ్రాయెల్ మరోసారి హెచ్చరించింది. హమాస్ మా దారికి రాకపోతే గాజా విధ్వంసం తప్పదని, వారికి నరకదారులు తెరుచుకుంటాయని ఇజ్రాయెల్ రక్షణమంత్రి ఇజ్రాయెల్ కట్జ్ వ్యాఖ్యానించారు. వెంటనే తమ బందీలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 'హమాస్ ఆయుధాలు వదిలిపెట్టి, బందీలందర్నీ విడుదల చేసి,యుద్ధం ముగించేందుకు షరతులు అంగీకరించాలి. లేదంటే త్వరలోనే వారికి నరకానికి ద్వారాలు తెరుచుకుంటాయి' అని ఇజ్రాయెల్ మంత్రి పేర్కొన్నారు. ఇందుకు అంగీరించకుంటే గాజా నగరం మరో రఫా, బీట్ హనౌన్‌గా మారిపోతుందని హెచ్చరించారు.గాజా నగరాన్ని స్వాధీనం చేసుకునే ప్రణాళికకు ఆమోదం తెలిపిన ప్రధాని నెతన్యాహు ఇందుకోసం మరో ఆపరేషన్ చేపడతామన్నారు.హమాస్‌ను అంతం చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్న ఆయన యుద్ధం ముగించి, బందీలవిడుదల కోసం చర్చలు ప్రారంభించాలని ఆదేశించారు. ఈ క్రమంలోనే రక్షణమంత్రి మరోసారి స్పందించారు. మరోవైపు గాజాపై మరో దశ దాడులు చేస్తామని చెబుతోన్న ఇజ్రాయెల్.. రానున్న రోజుల్లో 60 వేలమంది రిజర్విస్టులను రంగంలోకి దించేందుకు సిద్ధమవుతోంది. ఇందుకు సంబంధించిన ప్రణాళికకు అత్యున్నత స్థాయి సైనికాధికారులు ఆమోదం తెలిపినట్లు సైనిక వర్గాలు వెల్లడించాయి. దీంతో క్రియాశీల రిజర్విస్టుల సంఖ్య 1.2లక్షలకు చేరుకుంటుందని అంచనా.

# పార్లమెంట్ వద్ద భద్రతా వైఫల్యం

## గోడదూకి లోపలికి ఆగంతకుడు!

**న్యూఢిల్లీ, ఆగస్టు 22:** దేశ రాజధాని ఢిల్లీలో పార్లమెంట్ భవనం వద్ద భద్రతాపరమైన ఉల్లంఘన చోటుచేసుకుంది. అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే ఆ ప్రాంతంలో ఒక చొరబాటుదారుడు చెట్టు ఎక్కి గోడ దూకి పార్లమెంట్ ప్రాంగణంలోకి ప్రవేశించాడు. శుక్రవారం ఉదయం 6.30 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. రైలు భవన్ వైపు నుంచి గోడ దూకి కొత్త పార్లమెంట్ భవనానికి చెందిన గరుడ గేట్ వద్దకు చేరుకున్నాడని అధికారులు తెలిపారు. ఆ చొరబాటుదారుడిని భద్రతా సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం అతడిని విచారిస్తున్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిసిన మరుసటిరోజే ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. జులై 21న ఈ సమావేశాలు ప్రారంభమయ్యాయి. 2023లో



పార్లమెంట్ శీతాకాల సమావేశాల వేళ లోక్‌సభలోకి ఇద్దరు దుండగులు దూసుకొచ్చిన సంగతి తెలిసిందే. పార్లమెంట్‌పై ఉగ్రదాడి జరిగిన 22 ఏళ్లు అయిన డిసెంబర్ 13న ఆ ఘటన చోటుచేసుకోవడం అప్పట్లో తీవ్ర కలకలం రేపింది. లోక్‌సభలోని పబ్లిక్ గ్యాలరీ వద్ద కూర్చొన్న ఇద్దరు యువకులు సభలోకి దూకి గందరగోళం సృష్టించారు. రంగుల పొగను వదిలి అందరినీ భయభ్రాంతులకు గురిచేశారు. అదే సమయంలో పార్లమెంట్ వెలుపల కూడా ఇద్దరు వ్యక్తులు ఇదే రకమైన నిరసనను చేపట్టారు. ఈ ఘటన తర్వాత పార్లమెంట్‌లో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. గతేడాది ఆగస్టులో కూడా ఈ తరహా ఉల్లంఘన చోటుచేసుకుంది. ఓ యువకుడు పార్లమెంట్ గోడ దూకి లోపలికి చొరబడేందుకు యత్నించాడు. నిందితుడిని ఉత్తరప్రదేశ్‌కు చెందిన మనీశ్‌గా పోలీసులు గుర్తించారు. అప్పుడు ఆ నిందితుడి వద్ద ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదు. అతడి మానసిక పరిస్థితి సరిగా లేదని అప్పట్లో పోలీసులు వెల్లడించారు. తాజా ఘటనలో పేర్కొన్న నిందితుడిది ఉత్తరప్రదేశ్. అతడి పేరు రామా అని అధికారులు వెల్లడించారు. 20 ఏళ్ల ఆ వ్యక్తి మానసిక పరిస్థితి సరిగాలేదని ప్రాథమికంగా భావిస్తున్నారు. అయితే అతడు ఏ ఉద్దేశంతో ఇలాంటి చర్యకు పాల్పడ్డాడో తెలుసుకునేందుకు ఐబి, ఢిల్లీ పోలీసులకు చెందిన ప్రత్యేక విభాగం అతడిని ప్రశ్నిస్తోంది.




## ప్రపంచంలోనే అత్యంత వృద్ధురాలిగా

# ఎథెల్ కాటర్‌హామ్ రికార్డు

**లండన్, ఆగస్టు 22 :** ఎథెల్ కాటర్‌హామ్.. ప్రపంచంలోనే అత్యంత వృద్ధురాలిగా ఖ్యాతి గాంచారు. ఆమె తన 116వ జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. గురువారం అంటే ఈ నెల 21వ తేదీ సర్రేలో లైట్‌వాటర్‌లోని సంరక్షణ కేంద్రంలో ఆమె ఈ వేడుకలు చేసుకున్నారు. తన కుటుంబసభ్యులతో కలిసి ఆమె చాలా సాదాసీదాగా ఈ జన్మదినాన్ని జరుపుకున్నాని హాల్‌మార్క్ కేర్ హోమ్స్ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఎథెల్ పుట్టినరోజు సందర్భంగా ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. దీంతో ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారందరికీ ఎథెల్ కుటుంబసభ్యులు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. అయితే ఏ యేడాది జన్మదినం సందర్భంగా ఎథెల్ కేటర్ హామ్ ఎవరికి ఎటువంటి ఇంటర్వ్యూలు ఇవ్వలేదు. అయితే కింగ్ చార్లెస్-3 ఆమెతో మాట్లాడటానికి సిద్ధంగా ఉంటే అంగీకరిస్తామని సంరక్షణ కేంద్రం వివరించింది. ఇక దేశంలో 100వ జన్మదిన వేడుకలు జరుపుకొనే పౌరులను అభినందిస్తూ.. వ్యక్తిగతంగా బ్రిటన్ చక్రవర్తి లేఖ రాసారు. ఆ క్రమంలో ఎథెల్ కాటర్‌హామ్‌కు గతేడాది 115వ పుట్టినరోజు సమయంలో కింగ్ చార్లెస్-3 లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆమెను అభినందనలతో ముంచెత్తారు.

1909, ఆగస్టు 21వ తేదీన ఎథెల్ కాటర్‌హామ్ జన్మించారు. అంటే టైటానిక్ విపత్తుకు సరిగ్గా మూడేళ్ల ముందు ఆమె జన్మించారు. ఆమె.. తన 18వ ఏటా భారత్‌కు వచ్చారు. భారత్‌లో ఒక సైనిక కుటుంబానికి సహాయకురాలిగా విధులు నిర్వహించేందుకు ఆమె ఈ దేశానికి వచ్చారు. కొద్దిరోజుల తర్వాత ఆమె స్వదేశానికి పయనమయ్యారు. ఆ కొద్దిరోజులకే ఆమె ఒక పార్టీకి వెళ్లారు. ఆ పార్టీలో నార్మన్ కాటర్‌హామ్‌తో ఆమెకు పరిచయం అయింది. అది కాస్తా ప్రేమగా మారింది. ఈ నేపథ్యంలో 1933లో నార్మన్ కాటర్‌హామ్‌తో ఆమెకు వివాహం జరిగింది. తర్వాత ఆ జంట హాంకాంగ్‌కు తరలివెళ్లింది. ఆ తర్వాత జిబ్రాల్టర్‌కు మకాం మార్చింది. చివరకు దక్షిణ ఇంగ్లాండ్‌లో స్థిరపడింది. అయితే 1976లో భర్త నార్మన్ కాటర్‌హామ్ మరణించారు. ఇక ఎథెల్ కాటర్‌హామ్‌కు ముగ్గురు మనవళ్లతోపాటు ఐదుగురు మునిమనవళ్లు ఉన్నారు.

ప్రపంచంలోనే అత్యంత వృద్ధురాలు ఇనా కానబారో లూకాస్. ఆమె వయసు 116 సంవత్సరాలు. నన్‌గా పనిచేసే ఆమె 116వ యేట మరణించింది. ఈ నేపథ్యంలో ప్రపంచంలోనే అత్యంత వృద్ధురాలిగా ఎథెల్ కాటర్‌హామ్ ఖ్యాతి పొందారు.



# దేశీయ విమాన ప్రయాణం ఫ్రీ

## విదేశీ పర్యాటకులకు థాయ్ బంపర్ ఆఫర్

**బ్యాంకాక్, ఆగస్టు 22:** భారతీయులతో సహా విదేశీ పర్యాటకులను ఆకర్షించేందుకు థాయ్‌లాండ్ బంపర్ ఆఫర్ ప్రకటించింది. తమ దేశంలోని పర్యాటక ప్రదేశాలు ఆదరణ పొందేందుకు కొత్త ట్రావెల్ స్కీమ్ ప్రవేశపెట్టనుంది. దీని కింద దేశీయ విమాన ప్రయాణాన్ని ఫ్రీగా కల్పించనుంది. థాయ్‌లాండ్‌లోని ఫుకెట్, బ్యాంకాక్ వంటి ప్రదేశాలకు మాత్రమే విదేశీ పర్యాటకులు ఎక్కువగా వెళ్తున్నారని గ్రహించిన ప్రభుత్వం.. వారు మిగిలిన ప్రదేశాలను కూడా చూసేలా తమ దేశంలో విమాన ప్రయాణం ఉచితం చేయాలని చూస్తోంది. 'బై ఇంటర్నేషనల్, ఫ్రీ థాయ్‌లాండ్ డొమెస్టిక్ ఫ్లైట్స్' పేరిట ఆ ఆఫర్‌ను అందుబాటులోకి తీసుకురానుంది. ఈ ప్లాన్ కింద దేశీయ విమానాల్లో ప్రయాణించే వారికి వన్‌వే టికెట్ ధర 1,750 బాత్, రౌండ్ ట్రిప్స్ అయితే 3,500 బాత్‌ను ప్రభుత్వమే ఇవ్వాలని యోచిస్తోంది. ఈ యేడాది ఆగస్టు నుంచి డిసెంబరు మధ్యలో ఈ ప్రోగ్రామ్ అందుబాటులో ఉండొచ్చని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి.

థాయ్‌లాండ్‌కు స్టాండర్డ్ ఇంటర్నేషనల్ టికెట్స్ తీసుకున్న ప్రయాణికులు ఎయిర్‌లైన్ వెబ్‌సైట్స్, మల్టీసిటీ ఆప్షన్స్, ఫ్లైత్రూ సర్వీసెస్, ఆన్‌లైన్ ట్రావెల్ ఏజెంట్స్ వద్ద ఈ ఆఫర్‌ను పొందొచ్చు. ప్రతి ప్రయాణికుడు రెండు దేశీయ విమాన టికెట్లు పొందడానికి వీలుంటుంది. 20 కిలోల బ్యాగేజీని అనుమతిస్తారు. ఈ ప్రాజెక్టు కింద రెండు లక్షల మంది అంతర్జాతీయ పర్యాటకులను రప్పించాలన్నదే థాయ్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దీని వల్ల అన్ని రకాలుగా ఆ దేశ ఆర్థిక వ్యవస్థ దాదాపు 21.80 బిలియన్ బాత్ మేర ప్రయోజనం కలగనుందని అంచనా. అందుకోసం ఆ దేశ టూరిజం అథారిటీ.. ఆరు దేశీయ విమానయాన సంస్థలతో పనిచేయనుంది.

# కర్ణాటక డి.సిఎం ఆరెస్సెస్ గీతాలాపన



## చర్చనీయాంశంగా మారిన డికె తీరు

### అసెంబ్లీలోనే ఆలపించడంపై రాజయకీయ వర్గాల్లో ఊహాగానాలు

**బెంగళూరు, ఆగస్టు 22:** కర్ణాటకలో సిఎం మార్పు అంశంపై పార్టీలో అంతర్గత కలహాలు కొనసాగుతున్నాయి. అయిదేళ్లు తానే ముఖ్యమంత్రినని ఓ వైపు సిద్ధరామయ్య నొక్కి చెబుతున్నా అటు ఉపముఖ్యమంత్రి డికె శివకుమార్ తన చేతుల్లో ఏమీలేదంటూనే ఆశ పడటంలో తప్పు లేదు కదా అనే సంకేతాలిస్తున్నారు. ఈ పరి ణామాల నేపథ్యంలో తాజాగా డికె వ్యవహ రించిన తీరు చర్చనీయాంశంగా మారింది. ఇటీవల జరిగిన కర్ణాటక అసెంబ్లీ సమావేశంలో శివకుమార్ తన రాజకీయ జీవితం గురించి మాట్లాడుతూ ఆరెస్సెస్‌తో తనకున్న సంబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆరెస్సెస్ గీతమైన నమస్తే సదా వత్సలేను ఆయన పాడడంతో బిజెపి నాయకులంతా చిరునవ్వులు చిందిస్తూ బల్లలపై చప్పట్లు చరుస్తూ నినాదాలు చేశారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో అసెంబ్లీలో శివకుమార్ ప్రవర్తనపై నెట్టింట చర్చ మొదలైంది. తనకు సిఎం పీఠం ఇవ్వకపోతే బిజెపిలో చేరే అవకాశం ఉందని కాంగ్రెస్ పార్టీని, సిద్ధరామయ్యను బెదిరించేందుకే ఆయన ఈ విధంగా చేసి ఉంటారని పలువురు నెటిజన్లు చర్చించుకుంటున్నారు. ఇటీవల స్వాతంత్ర్య వేడుకల్లో మోడీ ఆరెస్సెస్‌ను ప్రశంసించడాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే తప్పుపట్టిన నేపథ్యంలో శివకుమార్ పరోక్షంగా ఆయనకు పార్టీ మార్పు గురించి హెచ్చరికలు చేసి ఉంటారని మరికొందరు భావిస్తున్నారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి పదవిపై రాష్ట్ర కాంగ్రెస్‌లో తీవ్ర స్థాయిలో చర్చ జరిగింది. సిద్ధరామయ్య, డికె శివకుమార్‌లు రెండున్నరేళ్ల పాటు పదవిలో కొనసాగేలా ఓ అంగీకారానికి వచ్చారన్న వార్తలు వచ్చాయి. పలు కేసుల్లో సిద్ధరామయ్య పేరు బయటకు రావడంతో సిఎంగా ఆయనను తొలగించాలన్న డిమాండ్లు తెరపైకి వస్తున్నాయి. అయితే సిఎం మార్పునకు పార్టీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో శివకుమార్ అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. తాను కూడా ఎప్పటికైనా ముఖ్యమంత్రి పదవి స్వీకరిస్తానని పలుమార్లు బహిరంగంగానే చెప్పిన డికె, తన వ్యాఖ్యల వల్ల ఆ పీఠంపై తనకున్న ఆశను వెలిబుచ్చుతున్నారు.




## బెంగాల్ జైళ్లలో ఎఐ

# కరడుగట్టిన ఖైదీలపై నిఘా

**కోల్‌కతా, ఆగస్టు 22:** జైళ్లలో నేరుగా కదలికలను ఎప్పటికప్పుడు గమనించడానికి బెంగాల్ ప్రభుత్వం కీలక చర్యలు తీసుకుంటుంది. నేరగాళ్లపై నిఘా కోసం ఎఐ ఆధారిత కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు. ఇటీవల బెంగాల్‌లోని పరివర్తన కేంద్రాల్లో శిక్ష అనుభవిస్తున్న కరడుగట్టిన నేరగాళ్లు బయట జరిగే నేరాలకు జైళ్ల నుంచి ప్రణాళికలు వేయడం, గంజాయి అక్రమ రవాణా, బెదిరింపులు, హత్యలు వంటి నేరాలకు ప్లాన్ చేస్తుండటంతో జైలు కేంద్రాలు నేరాలకు నిలయాలుగా మారాయన్నారు. అటువంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను గుర్తించి, అడ్డుకునేందుకు వీలుగా ఎఐ ఆధారిత కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బెంగాల్ వ్యాప్తంగా ఉన్న దాదాపు 60 పరివర్తన కేంద్రాల్లో ఇప్పటికే అత్యాధునిక కెమెరాలు ఉన్నప్పటికీ ఖైదీలు తమ దృష్టి నుంచి తప్పించుకుంటున్నారని పోలీసులు పేర్కొన్నారు. అందువల్లే వాటిని ఎఐతో అనుసంధానిస్తున్నామన్నారు. ప్రతి ఖైదీ బయోమెట్రిక్ వివరాలను ఇందులో పొందుపరుస్తామన్నారు. ఇవి సాధారణ కెమెరాల్లా రికార్డు అవడమే కాక జైలు లోపల అనుమానాస్పద కదలికలు, తగాదాలు, విధ్వంసం, తప్పించుకునే ప్రయత్నాలు వంటి వాటిని గుర్తించి వెంటనే జైలు గార్డులను అప్రమత్తం చేస్తాయని తెలిపారు. ఇందులో ఉన్న ముఖ గుర్తింపు ద్వారా భోజన సమయాల్లో, హాజరు తీసుకునే సమయంలో గైర్హాజరైన వారిని, పారిపోవడానికి ప్రయత్నించిన వారిని ట్రాక్ చేసి అధికారులను అప్రమత్తం చేస్తుందన్నారు. ముఖ్యమైన కేసుల్లో అరెస్టయిన కరడు గట్టిన నేరగాళ్లు ప్రత్యేక నిఘాలో ఉంటారని తెలిపారు. అంతేకాకుండా ఎఐ ద్వారా జైళ్లలో సెల్‌ఫోన్లు, పదునైన ఆయుధాలు, మాదకద్రవ్యాలు వంటి నిషేధిత వస్తువులను గుర్తించవచ్చని తెలిపారు.

ఈ ఎ1- ఆధారిత వీడియో విశ్లేషణలు ఖైదీల ప్రవర్తన, మానసిక ఒత్తిడి, ఆత్మహత్య ధోరణులను కూడా అంచనా వేయగలవన్నారు. దీనివల్ల అధికారులు ముందుగానే జోక్యం చేసుకుని దిద్దుబాటు చర్యలు చేపట్టే అవకాశం ఉంటుందన్నారు.

## సంక్షిప్తంగా..



### గాజా సిటీలో తీవ్ర క్షామం

#### ధ్రువీకరించిన ఐరాస నివేదిక

**జెరూసలేం, ఆగస్టు 22:** ఇజ్రాయిల్, హమాస్ మధ్య సాగుతున్న పోరుతో గాజా సిటీలో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆ సిటీలో ఆర్తనాదాలు వినిపిస్తున్నట్లు ఐక్యరాజ్యసమితికి చెందిన శాఖ ధ్రువీకరించింది. ఇంటిగ్రేటెడ్ ఫుడ్ సెక్యూర్టీ ఫేస్ క్లారిఫికేషన్(ఐపిసి) తొలిసారి తన వార్నింగ్‌ను అయిదో దశకు చేర్చింది. ఆ వార్నింగ్ స్థాయి బట్టి గాజాలో తీవ్ర దుర్భిక్షం ఉన్నట్లు స్పష్టం అవుతున్నది. గాజాలోని గాజా సిటీతో పాటు పరిసర ప్రాంతాల్లో ఆకలి కేకలు వినిపిస్తున్నట్లు రిపోర్టులో వెల్లడించారు. ఆ తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు ఈనెలాఖరులోగా డెయిర్ అల్ బాలాహ్, ఖాన్ యూనిస్‌కు కూడా చేరనున్నట్లు తెలుస్తోంది. గాజా స్ట్రిప్‌లో ఉన్న సుమారు అయిదు లక్షల మంది ప్రజలు ఆకలితో బాధపడుతున్నారు. ఆకలి చావులను అడ్డుకోవాలంటే నిరవధిక సాయం అందాలన్నాయి.

### కొలంబియాలో పోలీసు హెడ్‌క్వార్టర్‌పై దాడి: 17 మంది మృతి



**బొగోటా, ఆగస్టు 22:** కొలంబియా దేశంలో ఒకేరోజు రెండు భయానక ఘటనలు చోటు చేసుకున్నాయి. గురువారం (స్థానిక కాలమానం ప్రకారం) రెండు వేర్వేరు ఉగ్రదాడులు జరగడంతో 17 మంది మరణించారు. అంతియోక్వియా ప్రాంతంలో కొకైన్ ఉత్పత్తికి ఉపయోగించే కోకా మొక్కల సాగును తొలగించే కార్యక్రమంలో భాగంగా పోలీసు సిబ్బంది హెలికాప్టర్‌లో బయలుదేరారు. ఈ హెలికాప్టర్‌ను లక్ష్యంగా చేసుకొని డ్రోన్‌తో మొదటి దాడికి పాల్పడ్డారు. ఈ దాడి కారణంగా హెలికాప్టర్‌లో భారీగా మంటలు చెలరేగేలా చేసింది. ఇక ఘటనలో 12 మంది పోలీసు అధికారులు మరణించగా, మరో ముగ్గురు గాయపడ్డారని అక్కడి అధికారులు వెల్లడించారు. ఈ దాడి ఇటీవల జరిగిన కొకైన్ పట్టి వేతకు ప్రతీకార చర్యగా జరిగినట్లు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇక రెండో దాడి కాలి నగరంలో మిలిటరీ ఏవియేషన్ స్కూల్ సమీపంలో జరిగింది. కారుబాంబు పేలడంతో ఐదుగురు మరణించగా, 30 మందికిపైగా గాయపడ్డారు. ఈ రెండుఘటనలకు కారణంగా దేశవ్యాప్తంగా భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

### సుదర్శన్ నక్సల్స్ మద్దతుదారుడు: అమిత్‌షా



**న్యూఢిల్లీ, ఆగస్టు 22:** సెప్టెంబరు 9న ఉపరాష్ట్రపతి ఎన్నికల పోలింగ్ జరగనుంది. అందుకోసం ఎన్నికల సంఘం సర్వం సిద్ధం చేస్తున్నది. అధికార, విపక్ష పార్టీలు ఇప్పటికే తమ అభ్యర్థులను ప్రకటించి, నామినేషన్ కూడా వేయించాయి. ఈ నేపథ్యంలో ఉపరాష్ట్రపతి ఎన్నికలు హీటెక్కుతున్నాయి. ఈ క్రమంలో కేంద్రహోంమంత్రి అమిత్ షా ప్రతిపక్షాల ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డిగురించి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సుదర్శన్ రెడ్డి నక్సలిజానికి మద్దతుగా తీర్పులు ఇచ్చారనిఆరోపించారు. శుక్రవారం మధ్యాహ్నం ఆయన మీడియాతో మాట్లాడారు. సుదర్శన్ రెడ్డి సల్వా జుడుం తీర్పు వెలువరించకపోతే, దేశంలో తీవ్రవాద వామపక్ష ఉద్యమం 2020కి ముందే ముగిసి ఉండేదని అన్నారు.

### ప్యాసింజర్ రైళ్ల నంబర్ల మార్పు

**హైదరాబాద్,ఆగస్టు22, ప్రభాతవార్త:** దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని పలు ప్యాసింజర్ రైళ్ల విషయంలో అధికారులు కీలక మార్పులు చేశారు. ప్రయాణికులు ఈ కొత్త మార్పులను గమనించాలని రైల్వే శాఖ సూచించింది. కాచిగూడ స్టేషన్ నుంచి వెళ్లే ప్యాసింజర్ రైలు (57601/57602) నంబర్లను 67785/ 67786గా మార్చినట్లు అధికారులు వెల్లడిం చారు. ఈ నెల 25వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయని స్పష్టం చేశారు.

అదేవిధంగా, కాచిగూడరాయచూర్ మధ్య సేవలందించే ప్యాసింజర్ రైలు (77647/ 77648) నంబర్‌ను 67787/67788గా మార్చారు. ఈ మార్పు ఆగస్టు 26 నుంచి వర్తిస్తుంది.

నంబర్ల మార్పుతో పాటు, కోచ్‌లలో కూడా కీలక మార్పులు చేస్తున్నారు. కాచిగూడ రైలులో ప్రస్తుతం ఉన్న ఐసీఎఫ్ కోచ్‌ల స్థానంలో ఆధునిక మెమూ రేక్‌ను, అలాగే కాచిగూడ -రాయచూర్ మార్గంలో డెమో స్థానంలో కూడా మెమూ రేక్‌ను వినియోగిం చనున్నట్లు రైల్వే శాఖ తెలిపింది.

# మీరు చోద్యం చూస్తున్నారా?

## ఆధార్‌కార్డును గుర్తింపుగా అంగీకరించాల్సిందే..

### 'బీహార్ ఓట్ల తొలగింపు'లో పార్టీల తీరుపై సుప్రీంకోర్టు ఆగ్రహం



**న్యూఢిల్లీ, ఆగస్టు 22:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ.. ఓటర్ల జాబితా సవరణ తీవ్ర దుమారం రేపుతున్న సంగతి తెలిసిందే. బీహార్ ఎన్నికలకు ముందు సుమారు 65 లక్షల మంది ఓట్లను ఓటర్ లిస్ట్ నుంచి తొలగించారంటూ వస్తున్న వార్తలు దేశవ్యాప్తంగా రాజకీయంగా తీవ్ర సంచలనంగా మారాయి. చివరికి ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరడంతో.. తాజాగా అత్యున్నత న్యాయస్థానం కీలక ఆదేశాలు ఇచ్చింది. ఓట్ల తొలగింపుపై దాఖలైన పిటిషన్లపై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. తొలగించిన ఓట్లను తిరిగి చేర్చేందుకు.. అవసరమైన ధ్రువపత్రాల జాబితాలో ఆధార్ కార్డు ను కూడా చేర్చాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని (ఇసిఐ) ఆదేశించింది. ఓటర్ల జాబితా సవరణ కోసం సమర్పించాల్సిన 11 ధ్రువపత్రాల్లో ఆధార్ కార్డు కూడా ఉండేలా చూడాలని ఈ సందర్భంగా ఈసీకి సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు తమ ఓట్లను జాబితా నుంచి తొలగించారని లక్షలాది ఓటర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. దీనికోసం ఆ రాష్ట్రంలో ప్రస్తుతం ఓటర్ల జాబితాకు సంబంధించి ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కొనసాగుతోంది. ఈ ప్రక్రియపై సుప్రీంకోర్టు శుక్రవారం కీలక ఆదేశాలు ఇచ్చింది. జాబితా నుంచి పేర్లు తొలగించిన వారు నివాస ధృవీకరణ కోసం ఆధార్ కార్డును కూడా సమర్పించవచ్చని సూచించింది. వారు సమర్పించిన ఆధార్ కార్డులను ఎన్నికల సంఘం తప్పకుండా ఆమోదించాలని తేల్చి చెప్పింది.

**రాజకీయ పార్టీలపై సుప్రీంకోర్టు అసంతృప్తి:** బీహార్‌లో ఓటర్ల జాబితాలో లక్షల మంది ఓట్లు తొలగించారంటూ దేశంలోని చాలా రాజకీయ పార్టీలు చేస్తున్న ఆరోపణలపై సుప్రీంకోర్టు స్పందించింది. ఓట్ల తొలగింపులపై ప్రతిపక్ష పార్టీలు నిరసన తెలుపుతున్నప్పటికీ.. తొలగించబడిన ఓటర్లకు సహాయం చేయడంలో మాత్రం రాజకీయ పార్టీలు సరైన రీతిలో పని చేయడం లేదని సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. మీకు ఓటు హక్కు లేదా.. 15 రోజుల్లోనే ఓటర్ ఐడీ కార్డులు, అప్లికేషన్ స్టేటస్ ఇలా తెలుసుకోండి!

రాజకీయ పార్టీలకు చెందిన బూత్ స్థాయి ఏజెంట్లు ఏం చేస్తున్నారని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. రాజకీయ పార్టీలు తమ పనిని తాము సరిగా నిర్వహించడం లేదని మండిపడింది. ఓటర్ల జాబితా నుంచి పేరు తొలగించబడిన వారికి రాజకీయ పార్టీలు తప్పనిసరిగా సహాయం చేయాలని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. తమ ఓటర్లను ఓటర్ లిస్ట్ నుంచి తొలగిస్తున్నారని పార్టీలు ఆరోపిస్తున్నప్పటికీ.. తమ ఏజెంట్ల ద్వారా అభ్యంతరాలను సమర్పించడం లేదని.. కేవలం ఎంపీలు, ఎమ్మెల్యేలు మాత్రమే ముందుకు వచ్చినట్లు కోర్టు తెలిపింది. సుప్రీంకోర్టు ఇచ్చిన తాజా ఆదేశాలతో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో మరింత పారదర్శకత వస్తుందని భావిస్తున్నారు. అర్హులైన వారు తమ పేర్లను మళ్లీ ఓట్ల కోసం నమోదు చేసుకునే అవకాశం లభిస్తుందని చెబుతున్నారు.

23-08pg6exHMNWJQEP 10 PG_23-08pg6exHMNWJQEP.qxd 8/23/2025 12:22 AM Page 1



# ఆదాయానికి మించి ఆస్తుల్లో కార్మికశాఖ పరిపాలనాధికారి ఇంట్లో ఏసిబి సోదాలు





**తిరుపతి,ఆగస్టు 22ప్రభాతవార్తప్రతినిధి:** ఆయన కార్మికశాఖలో క్రిందిస్థాయి నుండి పైకి ఎదిగిన అధికారి. ఆయన మాటలు కార్మికులకు తేనెలా ఉన్నా ఆదాయానికి మించి ఆస్తులు సంపాదించాడనే ఫిర్యాదులు భారీగా అవినీతినిరోధకశాఖ(ఏసిబి)కి అందాయి. ఆ పక్కా సమాచారంతో విజయవాడ ఏసిబి హెడ్‌క్వార్టర్ నుండి ఆదేశాలతో తిరుపతిలోని కేశవాయనగుంటలో ఉన్న కార్మికశాఖ సంయుక్తకమిషనర్ కార్యాలయంలోని పరిపాలనఅధికారి ఎం.బాలూనాయక్ ఇంటిపై శుక్రవారం ఉదయం ఏసిబి అధికారులు దాడులు చేశారు. ఉదయం ఇంట్లోనే ఉన్న బాలునాయక్‌ను ఏసిబి అదనపు ఎస్పీ విమలకుమారి ఆధ్వర్యంలో రెండు బృందాలు సమగ్రంగా విచారణ చేశాయి. అందిన ఆధారాలతో ఇంట్లోని రికార్డులు, బంగారు నగలు, బ్యాంకు బ్యాలెన్స్ పాసుపుస్తకాలు, ఆస్తులకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఏకకాలంలో తిరుపతిలోని కేశవాయనగుంట ఇంట్లో, గతంలో ఆయన పనిచేసిన మదనపల్లి ,రాయచోటి కార్మికశాఖ కార్యాలయాలు, ఆయనకు సంబంధించిన ఇళ్ళలో, బంధువుల ఇళ్ళలో, కర్నూలులోని ఆయన కార్యాలయంలో ఏసిబి దాడులు కొనసాగిస్తుంది. తిరుపతిలో సాయంత్రం వరకు సాగిన ఈ దాడుల వివరాలను ఎంతమేరకు ఆస్తులు కూడబెట్టారు, బ్యాంకు వివరాలు, బంగారు తదితర వివరాలను శనివారం ఏసిబి వెల్లడించనుంది.

## ఇది వైకాంగ్రెస్‌పార్టీ ప్రజలకు చేసిన ద్రోహం కాదా?: వైఎస్ షర్మిల

**విజయవాడ,ఆగస్టు 22,ప్రభాతవార్త ప్రతినిధి:** వైకాంగ్రెస్ పార్టీ ముసుగు మళ్ళీ తొలగిందని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. ,భాజాపాకు వైకాపా...బీ టీం అని నిజ నిర్ధారణ జరిగిందన్నారు. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థికి మద్దతుతో మరోసారి తేటతెల్లమైందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్షం ముసుగులో ఉన్నది మోడీ పక్షమేనని తేలింది. అవినీతి కేసులకు భయపడి భాజాపాకు వైకాపా మళ్ళీ దాసోహం అంటోంది. ఓటు చోరీతో రాజ్యాంగం ఖూనీ అయ్యేది వైకాపాకు కనిపించదు. ఓ తెలుగు బిడ్డ,న్యాయ నిపుణుడిని ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నిలబెడితే మద్దతు ఇవ్వలేరా? ఇది తెలుగు ప్రలకు చేసిన ద్రోహం కాకపోతే మరేంటో వైకాపా చెప్పాలి'అని షర్మిళ ప్రశ్నించారు.

## సత్యదేవుని సన్నిధిలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

### పూజలో పాల్గొన్న పదివేల మంది మహిళలు..

**శంఖవరం, ఆగష్టు 22. ప్రభాతవార్త:** అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి సన్నిధిలో ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతాలు వైభవంగా నిర్వహించారు.శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా రాష్ట్ర దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. శ్రీ స్వామివారి నిత్య కళ్యాణ మండపంతో పాటు,6 వ్రత మండపముల యందు మహిళలు ఈ వ్రతాలు ఆచరించారు. ఈ సందర్భంగా ఉదయం 8 గంటలకు దేవస్థానం ఇఓ వీర్ల సుబ్బారావు దంపతులు జ్యోతి వెలిగించి ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతములు ప్రారంభించారు.అర్చకులు, వేద పండితులు వరలక్ష్మి దేవితో పాటు, సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవారికి వివిధ ప్రత్యేక పూజలు నిర్వహించి, వరలక్ష్మీ దేవి వ్రతాలకు అర్చక స్వాములు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమం లో పాల్గొన్న మహిళా భక్తులు తమ వెంట కొబ్బరికాయ, అరటి పండ్లు, పువ్వులు తీసుకొని రాగా మిగతా పూజా సామాగ్రి దేవస్థానం వారు ఏర్పాటు చేసారు.సుమారు పదివేల మంది మహిళా భక్తులు ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతములు నిర్వహించుకున్నారు. వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో సౌకర్యాలు ఏర్పాటు చేసారు. పూజలలో పాల్గొన్న భక్తులందరికీ వరలక్ష్మి దేవి రాగి రూపు, రవికల ముక్కలు, స్వామి వారి ప్రసాదం అందజేసారు. మహిళా భక్తుల రాకపోకలకు ఉచిత బస్సులను ఏర్పాటు చేశారు.ముత్తైదువులు వేలాదిగా తరలిరావడంతో రత్నగిరి ప్రాంగణాలు కళకళలాడాయి.

# జూనియర్ ఎన్టీఆర్‌పై ఎమ్మెల్యే దగ్గుపాటి వ్యాఖ్యలు దుర్మార్గం

### - నందమూరి హరికృష్ణ సతీమణిని అవమానిస్తే చర్యలుండవా?

### - వైఎస్సార్సీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

**అనంతపురం, ఆగస్టు 22 (ప్రభాతవార్త బ్యూరో)** సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్‌పై అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమని అనంతపురం జిల్లా వైయస్ఆర్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మండిపడ్డారు. జూనియర్ ఎన్టీఆర్ తల్లిపై అసభ్యంగా మాట్లాడిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను చంద్రబాబు మందలించినట్లు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. సాక్షాత్తూ నందమూరి హరికృష్ణ సతీమణిని అవమానిస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని సూటిగా ప్రశ్నించారు. శుక్రవారం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత టీడీపీ ఎమ్మెల్యేల అరాచకాలు పెచ్చుమీరుతున్నాయి. టీడీపీకి చెందిన కొందరు ఎమ్మెల్యేలు బరితెగించి మహిళల పట్ల కూడా అనుచితంగా మాట్లాడటం, వ్యవహరించడం చూస్తున్నాం. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ జూనియర్ ఎన్టీఆర్ పైన దారుణమైన వ్యాఖ్యలు చేశారు. ఆయనపై చర్యలు తీసుకోవాల్సిన ముఖ్యమంత్రి చంద్రబాబు వారిని ప్రోత్సహిస్తూ, పైకి మాత్రం వారిపై ఆగ్రహంతో ఉన్నట్లుగా నటిస్తున్నారు. జూనియర్ ఎన్టీఆర్ తల్లి నందమూరి హరికృష్ణ భార్య. స్వర్గీయ ఎన్టీఆర్ కోడలు. నందమూరి బాలకృష్ణ, పురంధేశ్వరికి స్వయాన వదిన. అంటే నందమూరి కుటుంబానికి చెందిన మహిళపైనే, ఎన్టీఆర్ స్థాపించిన పార్టీలో ఎమ్మెల్యేగా ఉన్న నాయకుడు నోరు పారేసుకుంటే, పైపై మందలింపుల డ్రామాతో సరిపెట్టడానికి చంద్రబాబు ఎందుకు తంటాలు పడుతున్నారు. మీ సతీమణి భువనేశ్వరిపై ఎవరో వ్యాఖ్యలు చేశారంటూ పెద్ద ఎత్తున యాగీ చేసిన చంద్రబాబుకు, తన సోదరి వరస అయ్యే హరికృష్ణ సతీమణి పై సాక్షాత్తు టీడీపీ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఎందుకు సీరియస్ గా తీసుకోవడం లేదు? నేను కొట్టినట్టు కొడతా.. మీరు ఏడ్చినట్టు ఏడ్వండి అన్న చందాన చంద్రబాబు తీరు ఉంది. నాలుగైదేళ్ల కిందట సోషల్ మీడియాలో మహిళల పట్ల పోస్టులు పెట్టారంటూ రాష్ట్ర వ్యాప్తంగా వందల సంఖ్యలో సోషల్ మీడియా యాక్టివిస్ట్‌లను వెదికి వెదికి పట్టుకుని, జైళ్ళ పాలు చేశారు. మరి మీ పార్టీలోనే ఎమ్మెల్యేలుగా ఉన్న వారు, మీ కుటుంబంలోని ఒక మహిళ పట్ల ఇష్టారాజ్యంగా మాట్లాడితే ఎందుకు కఠినంగా స్పందించడం లేదో చంద్రబాబే చెప్పాలి. సీఎం అండతోనే టీడీపీ ఎమ్మెల్యేలు చెలరేగిపోతున్నారు అని అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. జూనియర్ ఎన్టీఆర్ తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సాటి నటుడిగా పవన్ కళ్యాణ్ ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. ఎమ్మెల్యే టిక్కెట్ల కోసం చంద్రబాబుకు, నారా లోకేష్‌కు కోట్ల రూపాయలు ఇచ్చాం... ఇప్పుడు సంపాదించుకోవడం మా హక్కు అని టీడీపీ ఎమ్మెల్యేలు బాహాటంగా వ్యాఖ్యానిస్తున్నారని అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. ప్రశాంతంగా ఉండే అనంతపురంలో కూటమి ప్రభుత్వ వచ్చాక అరాచకాలు, అన్యాయాలు, దౌర్జన్యాలు పెచ్చుమీరాయన్నారు. ఇటీవల అనంతపురంలో మైనార్టీకి చెందిన మహిళను దగ్గుపాటి అసభ్యంగా దూషించారని తెలిపారు. ఇంటి స్థలానికి సంబంధించి డబుల్ రిజిస్ట్రేషన్ చేసిన అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు.

# మైపాడుకు కేరళ తరహా టూరిజం సెంటర్‌గా అభివృద్ధి

### - టూరిస్టుల భద్రత కోసం బీచ్‌లో లైఫ్ గార్డులు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం :ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



**గఇందుకూరుపేట, ఆగష్టు 22, ప్రభాతవార్త** మైపాడు బీచ్‌ను ఒక సమగ్ర ప్రణాళికతో కేరళ తరహా టూరిజం సెంటర్‌గా అభివృద్ధి చేయాలన్నది ముఖ్యమంత్రి చంద్రాబునాయుడు సంకల్పమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. జిల్లా కలెక్టర్ ఆనంద్‌తో కలిసి మైపాడులో నిర్వహించిన బీచ్ అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మైపాడు బీచ్ అభివృద్ధికి సంబంధించిన కార్యచరణపై జిల్లాకలెక్టర్, టూరిజం అధికారులతో ఆమె చర్చించారు. అనంతరం బీచ్ సమీపంలో నిర్మిస్తున్న బంగారమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి సంబంధించి ద్వార బందర ప్రతిష్ఠ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ మైపాడు బీచ్ సమీపంలో ఉన్న ఉప్పు కాలువలో దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి ఆధ్వర్యంలో పీ 4 కార్యక్రమం ద్వారా సిల్ట్ క్లియరెన్స్ కు ముందుకు వచ్చిన స్థానికులను అబినందించారు. ఈ సిల్ట్ క్లియరెన్స్ చేయడం ద్వారా మత్స్యకారుల బోట్లు నేరుగా సముద్రంలో వెళ్లేందుకు రూట్ క్లియర్ అవుతుందన్నారు. దాదాపు 6 వేల మీటర్లు ఉన్న ఉప్పు కాలువలో కేరళ తరహా బోట్ రైడింగ్స్ నిర్వహించడం ద్వారా పర్యాటకులను ఆకర్షించవచ్చన్నారు. వీకెండ్స్ లో కుటుంబ సమేతంగా సరదాగా గడపాలంటే నెల్లూరు జిల్లాలో ఉన్న ఏకైక పర్యాటక కేంద్రమైన మైపాడు బీచ్‌ను అభివృద్ధి చేయాల్సిన అసవరం ఎంతైనా ఉందన్నారు. గతంలో పర్యాటకులు నెల్లూరు నుంచి మైపాడు బీచ్ చేరుకోవడానికి రోడ్డు మార్గం ప్రధాన అవరోధంగా ఉండేదని, గత ప్రభుత్వ హయాంలో కేవలం శిలాఫలకానికే పరిమితం అయి ఉన్న మైపాడు నెల్లూరు రహదారి నిర్మాణానికి కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక కదలిక వచ్చిందని త్వరలోనే ప్రారంభోత్సవం చేసుకోబోతున్నామన్నారు. మైపాడు పర్యాటక రంగం అభివృద్ధి చెందితే హోటల్స్, రిసార్ట్‌లు, హోమ్ స్టేలు, ఫుడ్ కోర్టులు వంటి సౌకర్యాల ఏర్పాటుతో స్థానికులకు ఉపాధి దొరుకుతుందన్నారు. టూరిస్టుల భద్రత కోసం బీచ్‌లో లైఫ్ గార్డులు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. మైపాడు బీచ్‌తో పాటు ఇందుకూరుపేట మండలాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలుపొందాక ఇందుకూరుపేట మండలంలో లో ఒల్టేజి సమస్యను నివారించేందుకు కుడిత పాళెం వద్ద 33కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణాన్ని చేపట్టడం జరిగిందన్నారు. చంద్రబాబునాయుడు సహాయ సహకారాలతో శంకుస్థాపన పరిమితం అయి ఉన్న ముదివర్తి- ముదివర్తిపాళెం కాజ్‌వే నిర్మాణాన్ని వేగవంతం చేశామన్నారు. పెన్నానదిపై ముదివర్తి- ముదివర్తి పాళెం కాజ్ వే నిర్మాణం పూర్తయితే ఇందుకూరుపేట-విడవలూరు మండలాల మధ్య ప్రస్తుతం గంటల్లో ఉన్న ప్రయాణ దూరం నిమిషాలకు చేరుతుందన్నారు.

# తప్పులకు ఆస్కారం లేకుండా కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు

### రైతులకు ఇచ్చేముందు మరోసారి పూర్తి స్థాయి పరిశీలన : మంత్రి అనగాని సత్యప్రసాద్

**విజయవాడ,ఆగస్టు22,ప్రభాతవార్తప్రతినిధి:** గత ముఖ్యమంత్రి ఫోటోల పిచ్చితో తన బొమ్మను ముద్రించుకున్న పట్టాదారు పాస్ పుస్తకాల స్థానంలో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను ఎటువంటి తప్పులకు అస్కారం లేకుండా పకడ్బందీగా సమాచారాన్నంతా క్షుణ్ణంగా పరిశీలించి ప్రింట్ చేయిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంపుల శాఖా మాత్యులు అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. ఎలాంటి తప్పులు లేకుండా పాస్ పుస్తకాలు ఇచ్చే బాధ్యత మా ప్రభుత్వానిదని, ఇంతవరకు తప్పులతో ఒక్క పాస్ పుస్తకం కూడా ఇవ్వలేదని అన్నారు. గత ప్రభుత్వ కాలంలో రీ సర్వే జరిగిన గ్రామాల్లోని రైతులకు కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తున్నామని, ఇందు కోసం 21 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలు సిద్దంగా ఉన్నాయని చెప్పారు. మంచి ఉద్దేశ్యంతో రైతులకు కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు అందిస్తున్నామని, అందుకు అందరూ సహకరించాలని కోరారు. కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల్లో 50 శాతం పుస్తకాల్లో తప్పుల తడకలే ఉన్నాయంటూ ఒక పత్రికలో వచ్చిన కథనాల్లో.,ప్రచారంలో వాస్తవం లేదన్నారు. గత ప్రభుత్వం కాలంలో హడావిడిగా చేసిన రీ సర్వే కారణంగా చాలా తప్పులు దొర్లాయని, వారిచ్చిన పట్టాదార్ పాస్ పుస్తకాల్లోనూ ఆ తప్పులు ఉన్నాయని చెప్పారు. అయితే వీటిని సరి చేసేందుకే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రీ సర్వే జరిగిన 6688 గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించగా 2 లక్షల 79 వేల అర్జీలు వచ్చాయని, వాటన్నంటినీ వంద శాతం పరిష్కరించామని చెప్పారు. అంతే కాక ఆ తర్వాత 17,600 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించామని, వాటిల్లో వచ్చిన లక్షా 85 వేల అర్జీలను పరిష్కరించామని చెప్పారు.

## ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌కు అమెరికాలో అరుదైన గౌరవం

**విజయవాడ,ఆగస్టు22, పభాత వార్తప్రతినిధి:** రాజ్యసభ మాజీ సభ్యులు, విశ్వహిందీ పరిషత్ జాతీయ అధ్యక్షులు, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, పద్మశ్రీ, పద్మభూషణ్ పురస్కారాల గ్రహీత, ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌కు టెక్సాస్ రాష్ట్రంలో అరుదైన గౌరవం లభించింది. టెక్సస్ రాష్ట్ర ప్రభుత్వంతో సహా, డాలస్ పరిసర ప్రాంతంలోని మూడు ముఖ్య నగరాలైన ఫ్రిస్కో, గార్లండ్, లిటిల్ ఎల్మ్ నగరాల మేయర్లనుండి యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అభినందన పూర్వక అధికారిక గుర్తింపు పత్రాలు పొందడం తెలుగువారం దరికి గర్వకారణంగా నిలిచింది. గార్లాండ్ నగర మేయర్ డిలన్ హెడ్రిక్ తో జరిగిన ప్రత్యేక సమావేశంలో డా. యార్లగడ్డకు అధికారిక గుర్తింపు పత్రాన్ని మేయర్ స్వయంగా అందచేసి అభినందిం చారు. సాహిత్య రంగంలోనే గాక, సాంస్క ృతిక రాయబారిగా, రచయితగా, ఉత్తర, దక్షిణ ప్రాంతాల భారతదేశ వారధిగా తన రచనలతో సౌభ్రాతృత్వం, జా తీయ ఐక్యతను పెం పొందించి నదుకు గాను టెక్సాస్ రా ష్ట్ర ప్రభుత్వంతో సహా టెక్సాస్ రాష్ట్రంలోని లిటిల్ ఎల్మ్, గా ర్లాండ్, ఫ్రిస్కో నగ రాలు ఆయన్ను అభి నందిస్తూ లేఖలు విడుదల చేశాయి. ఫ్రిస్కోలో స్థానిక తెలుగు వారు ఏ ర్పాటు చేసిన ఆత్మీ య సమావేశంలో ఆయా నగరాల అధికార ప్రతినిధులు ఆచార్య యార్లగడ్డకు అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రవాసాంధ్రులు డా. యార్లగడ్డ ను ఘనంగా సత్కరించారు. టెక్సాస్ రాష్ట్ర గవర్నర్‌కు, ప్రభుత్వానికి, ప్రజలకు, ఆయా నగరాల మేయర్లకు, ప్రజలకు లక్ష్మీప్రసాద్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో వేణు భాగ్యనగర్, ఆత్మచరణ్ రెడ్డి, గోపాల్ పోనంగి, డా. తోటకూర ప్రసాద్, జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం, శారద సింగిరెడ్డి, అనంత్ మల్లవరపు, సమీర్, చాంద్ పర్వతనేని, సుబ్బారావు పర్వతనేని, లెనిన్ వేముల, ఉదయగిరి రాజేశ్వరి, రమణ్ రెడ్డి క్రిస్టపాటి, మాధవి లోకిరెడ్డి, డా. ఆళ్ల శ్రీనివాసరెడ్డి, డా. తుమ్మల చైతన్య, చినసత్యం వీర్నపు, కాకర్ల విజయమోహన్, అత్తలూరి విజయలక్ష్మి, ఎల్ శివకుమారి, జ్యోతి వనం, మడిశెట్టి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



డా. యార్లగడ్డకు అధికారిక గుర్తింపు పత్రాన్ని అందిస్తున్న గార్లాండ్ నగర మేయర్ డిలన్ హెడ్రిక్

# తిరుమల గదుల్లో భక్తులకు సకల సదుపాయాలు

### - యుద్ధప్రాతిపదికన విశ్రాంతి గృహాలు కాటేజీలు మరమ్మతులు
### - రద్దీకి అనుగుణంగా మూడవ అన్నప్రసాదభవనం
### - టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ వెంకయ్యచౌదరి



**తిరుమల,ఆగస్టు 22ప్రభాతవార్తప్రతినిధి:** మరోనెలరోజుల్లో తిరుమలలో ప్రారంభమయ్యే శ్రీవారి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు వసతి సదుపాయం ఇబ్బంది లేకుండా చూడాలని, విశ్రాంతి గృహాలు కాటేజీల మరమ్మతులు సకాలంలో పూర్తిచేయాలని టిటిడి ఇఒ జె.శ్యామలరావు అధికారులను ఆదేశించారు. వసతికి సంబంధించి భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని గదుల్లో ఎలక్ట్రిక్ పనులు, మరుగుదొడ్లు,వేడినీళ్ళు ఇతర మరమ్మతులను వెంటనే చేపట్టి పూర్తిచేయాలన్నారు. బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 24వతేదీ నుండి ప్రారంభంకానున్న నేపధ్యంలో భక్తుల వసతి సదుపాయాలు, అన్నప్రసాదాలు ఇతరత్రా సౌకర్యాలపై శుక్రవారం మధ్యాహ్నం అన్నమయ్యభవనంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, సిఇ సత్యనారాయణ, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, డిఎఫ్ఒ ఫణికుమార్‌నాయుడు, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, డిప్యూటీ ఇఒలు భాస్కర్, సోమ్లానాయక్, విఎస్ఒ సురేంద్రతో కలసి ఇఒ శ్యామలరావు సమీక్షించారు. బ్రహ్మోత్సవాల్లో తిరుమలకు వచ్చే భక్తులకు వసతి,ఇతర సౌకర్యాలకు సంబంధించి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. వసతికల్పనవిభాగంతో సమన్వయంచేసుకుని ఇంజనీరింగ్ విభాగం పనులు పూర్తిచేయాలన్నారు యాత్రికుల వసతిసముదాయాల్లోనూ సెంట్రలైజ్డ్ బుకింగ్ విధానం అప్లికేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. తిరుమలలో భక్తులరద్దీ పెరిగినందున వెంగమాంబ అన్నప్రసాదం భవనంలో భక్తులు వేచిఉండే పరిస్థితులు కనిపిస్తున్నాయని, వేచిఉండే సమయం కూడా ఎక్కువగా ఉన్నందున మరో ప్రాంతంలో కూడా అన్నప్రసాద భవనం ఏర్పాటుచేయడానికి పరిశీలించాలని ఆదేశించారు. ఇప్పటికే తిరుమలలో యాత్రికుల వసతి సముదాయం (పిఎసి)4లో మినీ అన్నప్రసాద భవనం నడుపుతున్నారు. మరోమూడోచోట భక్తుల అవసరాలకు అనుగుణంగా మరో అన్నప్రసాద భవనం పిఎసిల ప్రాంతంలోనే ఏర్పాటుకు మార్గం సుగమంచేస్తున్నారు. ఇక తిరుమలలోని నూతనంగా ఏర్పాటుకానున్న హోటళ్ళు, ఫాస్ట్‌ఫుడ్‌సెంటర్లలో ఆహార నాణ్యతను పరిశీలించాలన్నారు. అలాగే పంచాయతి,రెవెన్యూ విభాగాలు ఫాస్ట్‌ఫుడ్‌సెంటర్లు, హోటళ్ళలో ఏర్పాటుచేసిన ధరలపట్టికను పరిశీలించాలని స్పష్టంగా తెలిపారు. సాంప్రదాయ భోజనం భక్తులకు అందించాలన్నారు. లడ్డూప్రసాదం వితరణ శాలలో అన్ని కౌంటర్లు పనిచేయాలన్నారు. భక్తుల నుండి సేకరించే అభిప్రాయాలపై సమీక్షించి అమలుకు చూడాలన్నారు.

## త్వరలో భూమన జైలుకెళ్లడం ఖాయం

### - ఆయన అక్రమంగా కోట్లుసంపాదించారు

### - రాష్ట్రబయోడైవర్సీటీ ఛైర్మన్ విజయకుమార్

**తిరుపతి,ఆగస్టు 22ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఛైర్మన్‌గా పనిచేసిన వ్యక్తి కోట్లరూపాయలు అక్రమాస్తులు సంపాదించాడని, ఆయన టిటిడి నిధులు దుర్వినియోగంచేసి తప్పుచేశాడని వైసిపి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డిపై టిడిపి అధికారప్రతినిధి, రాష్ట్ర బయోడైవర్సిటీ ఛైర్మన్ నీలాయపాళెం విజయకుమార్ ఘాటైన విమర్శలు చేశారు. తప్పుచేసిన భూమన ఎక్కడికీ తప్పించుకుపోలేడన్నారు. చట్టంముందు దోషిగా ఆయనను నిలబెడతామని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన త్వరలో జైలుకెళ్ళడం ఖాయమని నీలాయపాళెం అన్నారు .టిటిడిపై దుష్ప్రచారం చేస్తూ హిందూ ధర్మాన్ని విమర్శిస్తున్న భూమన కరుణాకర్‌రెడ్డి ప్రస్తుత టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడును విమర్శించడం ఏమిటన్నారు. ఆయన చేసే మంచిపనులు, నిజాయితీని చూసి విమర్శించే అర్హత భూమనకు లేదన్నారు. ఆయన కష్టంతో పైకివచ్చిన వ్యక్తిఅన్నారు. టిటిడిలో ఛైర్మన్‌గా పనిచేసిన కాలంలో కరుణాకర్‌రెడ్డి చేసిన అవినీతిని త్వరలోనే బయటపెడతామని అన్నారు. శుక్రవారం ఉదయం తిరుపతిలో టిడిపి నాయకులు వట్టికుంట శంకరనారాయణ, ఊకా విజయకుమార్, పాతకం వెంకటేశ్‌తో కలసి విజయకుమార్ మీడియా సమావేశంలో భూమన కరుణా కర్‌రెడ్డిపై ఘాటుగా స్పందించారు.

గత కొంతకాలంగా కరుణాకర్‌రెడ్డి ఓ పత్రిక టిటిడిపై దుమ్మెత్తిపోయడమే పనిగా పెట్టుకుని తప్పుడు కథనాలు వండి వారిస్తున్నారని వ్యంగ్యాలు చేశారు.

# వరలక్ష్మిగా అనుగ్రహించిన కనకదుర్గమ్మ

**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 22, ప్రభాతవార్త** శ్రీ దుర్గామలేశ్వర స్వామివార్ల దేవస్థానంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మి వ్రతాల సందర్భంగా రెండు బ్యాచ్‌లుగా నిర్వహించబడిన ఈ వ్రతాలు ఉదయం 7 గంటల నుండి 9 వరకు రు.1500 రుసుముతో ఆర్జిత సేవగాను, ఉదయం 10 నుండి 11.30 గంటల వరకు ఉచితంగాను ఘనంగా నిర్వహించామని, ఈ రెండు బ్యాచ్‌ల వ్రతాల్లో పాల్గొన్న వారికి కుంకుమ, జాకెట్ ముక్క, శ్రీ అమ్మవారి ప్రసాదం, శక్తి కంకణం అందించామని ఈవో వికె శీనా నాయక్ తెలిపారు. వ్రతానంతరం మహిళ భక్తులకు అమ్మవారి దర్శనం ఏర్పాటు చేశారు. దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం ఏలూరు న్యూ అశోక్‌నగర్‌కు చెందిన పి శ్రీరామ్ సీతారామయ్య ప్రియాంక దంపతులు త్రిలోక్య ఆర్య పేరు మీద రు.1,00,000/-ల విరాళాన్ని నిడమానూరు రామాలయం వీధికి చెందిన శివరామకృష్ణ ప్రసాద్ జేష్ట దంపతులు రూ.1,00,005/-లు అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం, అమ్మ వారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు.



వరలక్ష్మిగా కొలువైన దుర్గమ్మ



దాతలకు దుర్గమ్మ జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

# ఆగస్టు 25 నుంచి ఇంటింటికీ ఉచితంగా స్మార్ట్ రేషన్ కార్డులు : మంత్రి నాదెండ్ల మనోహర్



**విజయవాడ,ఆగస్టు22,,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజలకు సంక్షేమంతోపాటు పారదర్శకంగా కొత్త సాంకేతికతతో ఆగస్టు 25 నుంచి ఇంటింటికీ ఉచితంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేస్తున్నామని వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కానూరులోని సివిల్ సప్లైస్ భవన్ లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో శుక్రవారం వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ సామాన్యుడిని ఆదుకునే విధంగా నిజాయితీతో పనిచేయాలని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలియజేస్తుంటారని, ఆవిధంగా పనిచేస్తున్నామన్నారు. ఇంటింటికీ ఉచితంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేపట్టామన్నారు. నాలుగు దశల్లో 1 కోటీ 45 లక్షల స్మార్డ్ కార్డుల పంపిణీ ఆయా రేషన్ కార్డుల దుకాణాల వద్దనే గ్రామ, వార్డు సచివాలయాల సహకారంతో పంపిణీ చేస్తున్నామన్నారు. 6,71,000 కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తున్నామని, 16,67,032 రేషన్ కార్డుల అప్లికేషన్స్ కి అప్రూవల్ ఇచ్చామని,కార్డుల జారీ నిరంతర ప్రక్రియని, ఆన్ లైన్ లో ధరఖాస్తుల ప్రక్రియ ఎప్పుడూ అందుబాటులో ఉంటుందన్నారు. రేషన్ పంపిణీ 93 శాతానికి పెరిగిందన్నారు. రేషన్ డెలివరీ లో సర్వీసు పెరిగిందన్నారు. స్మార్ట్ కార్డుల పంపిణీకి సంబంధించి సంబంధిత సిబ్బందికి శిక్షణ అందించామన్నారు. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా అరికట్టేందుకు సాంకేతికతను ఉపయోగించి చర్యలు తీసుకుంటున్నామన్నారు. భారీ స్థాయిలో సాంకేతికతను ఉపయోగించి స్మార్ట్ కార్డులు పంపిణీ చేయడం దేశంలో బహుశా ఇదే మొదటిసారి అని అన్నారు. స్మార్ట్ కార్డుల్లో ప్రభుత్వ చిహ్నంతోపాటు కుటుంబ సభ్యుల వివరాలు, సేఫ్టీ కోసం క్యూఆర్ కోడ్, కస్టమర్ టోల్ ఫ్రీ నంబర్ కూడా ఉంటుందన్నారు. టోల్ ఫ్రీ నంబర్ 1967 కు ఎవరైనా ఎప్పుడైనా ఫోన్ చేయొచ్చన్నారు. 2 నెలలుగా స్మార్ట్ రేషన్ కార్డుల కసరత్తు చేశామన్నారు. చివరి మైలులో ఉన్న వ్యక్తికి కూడా సేవలు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. స్మార్ట్ కార్డులు రాష్ట్రం నుంచి జిల్లాకు అక్కడ నుంచి మండలాలకు, మండలాల నుంచి ఆయా రేషన్ షాపులకు బాక్స్ ల్లో భద్రంగా క్యూఆర్ కోడ్ తో చేరుస్తామన్నారు. దీనివల్ల ట్రేస్ బులిటీ సులువుగా ఉంటుందన్నారు.

ఇప్పటికే ప్రతి నెలా దివ్యాంగులకు, 65 సంవత్సరాలు పైబడిన దాదాపు 16,73,000 మందికి రేషన్ ను డోర్ డెలివరీ చేస్తున్నామన్నారు.ఆగస్టు 25 నుంచి 9 జిల్లాల నుంచి ఉచిత స్మార్ట్ కార్డుల పంపిణీని ఆయా జిల్లాల్లో మంత్రులు, శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పండుగ వాతావరణంలో ప్రారంభిస్తారన్నారు.

23-8P g7exHMNWJQE 11pg_23-8P g7exHMNWJQE.qxd 8/23/2025 12:23 AM Page 1



# స్థానిక ఎన్నికలకు ముందే పదవులు పంచాలి

## నేడు పిసిసి రాజకీయ వ్యవహారాల కమిటీ, అడ్వైజరీ కమిటీ సమావేశం



**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీలో బిసి రిజర్వేషన్, పదవులు పంపిణీ వంటి అంశాలు ఉత్కంఠ రేపుతోంది. హైదరా బాద్ గాంధీభవన్‌లో శనివారం సాయంత్రం ఎఐసిసి వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రు లు, కమిటీల సభ్యులు పాల్గొననున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంలో తదుపరి కార్యాచరణ, నామినేటెడ్ పోస్టుల భర్తీ విషయంలో కీలక నిర్ణయం తీసుకోనున్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాతే ఎన్నికలకు వెళ్ళాలి అని ప్రభుత్వం చూస్తుండగా అది రాష్ట్రపతి వద్ద పెండిం గ్‌లో ఉంది. మరోవైపు గవర్నర్‌కు పంపిన ఆర్డినెన్స్ కూడా న్యాయ సలహా కోసం పంపడంతో అది కూడా పెండింగ్‌లోనే ఉంది. కాగా స్థానిక ఎన్ని కలపై హైకోర్టు ఇచ్చిన గడువు సెప్టెంబరు 30 సమీపి స్తుండగా.. ఎన్నికలపై ఏం చేయాలా అని ప్రభుత్వం ఆలోచనలో పడింది. రిజర్వేషన్ల అంశం ఇంకా కొలిక్కి రాకపోవడంతో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ చేపట్టాలా వద్దా? ఒక వేళ ఎన్నికలకు వెళ్లాలనే భావి స్తే రిజర్వేషన్లు పార్టీ పరంగా ఇవ్వాలా లేదా మరేదైనా మార్గం చూడాలా అనే విషయంలో పార్టీలోని మెజార్టీ నేతల అభిప్రాయం మేరకు నిర్ణయించ బోతున్నారు. దీంతో శుక్రవారం సమావేశంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

అయితే పిఎసి సమావేశం ముగిశాక ఈ నెల 25న రాష్ట్ర కేబినెట్ సమావేశం జరగబోతు న్నది. ఈ నేపథ్యంలో స్థానిక ఎన్నికలు, రిజర్వేషన్ల విషయంలో అధికార పక్షం తుది నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్‌పై యాదవ సామాజికవర్గ నేతలు అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే తమకు పదవుల్లో అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. మంత్రి పదవి, ప్రభుత్వ సలహాదారు, 5 కార్పొరేషన్ చైర్మన్లు, 5 డీసీసీ అధ్యక్ష పదవులు ఇవ్వా లని డిమాండ్ చేస్తున్నారు. అలాగే వైన్ షాప్‌లలో ఎస్సీ, ఎస్టీ, గౌడ్స్‌తోపాటు బీసీలకు 30 శాతం రిజర్వే షన్లు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

## పాత పెన్షన్ సాధించే దాకా పోరాడుదాం

### ఉపాధ్యాయులతో టీచర్ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** పాతపెన్షన్ విధానం సాధించే వరకు పోరాడుదామని నల్గొండ- వరంగల్- ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులతో శుక్రవారం ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించిన ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి.. పాత పెన్షన్ విధానాన్ని సాధించేందుకు జరిగే పోరాటంలో ప్రతీ ఉపాధ్యాయుడు పాల్గొనాలని పిలుపునిచ్చారు. అలాగే సెప్టెంబర్ 1న పీఆర్‌టీయూటీఎస్ నేతృత్వంలో పెన్షన్ విద్రోహ దినం మహాధర్నా చేపట్టాలని నిర్ణయించిన విషయాన్ని గుర్తు చేశారు. జిల్లాల్లోని టీచర్లకు ఫోన్ చేసి ఆయన నేరుగా మహాధర్నా ఆవశ్యకతను వివరించారు. ప్రతీ ఉపాధ్యాయుడిని పాత పెన్షన్ కోసం చేపట్టే ఆందోళన వైపు నడిపించాలని సూచించారు. సిపిఎస్ రద్దు కోసం అనేక సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నామని, ఈసారి తమ గళాన్ని గట్టిగా విన్పించాల్సిన అవసరం ఉందన్న విషయాన్ని ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి ఉపాధ్యాయుల దృష్టికి తెచ్చారు. జిల్లా బాధ్యుల నుంచి ఫోన్లు అందుకున్న టీచర్లు ఇతర ఉపాధ్యాయులతో మహాధర్నా అవసరాన్ని ఫోన్ ద్వారా వివరిస్తారని శ్రీపాల్ తెలిపారు. గ్రామ స్థాయి ఉపాధ్యాయుల వరకూ ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని తీసుకెళ్తున్నట్టు ఎమ్మెల్సీ తెలిపారు. శుక్రవారం నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో పిఆర్‌టియు టిఎస్ నేతలు గుండు లక్ష్మణ్, పులగం దామోదర్ రెడ్డి పాల్గొన్నారు.



సంక్షేమభవన్ ముందు ధర్నాకు దిగిన ఆర్.కృష్ణయ్య, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్.

## ఫీజు బకాయిలు చెల్లించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు

### ఎంపి ఆర్.కృష్ణయ్య హెచ్చరిక

### మహాధర్నాలో పాల్గొన్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

**హైదరాబాద్ (మెహిదీపట్నం), ఆగస్టు 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన ఉదృతం చేస్తామని రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం స్కాలర్ షిప్ విధానాన్ని నీరుగారిచే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న 8 వేల కోట్ల స్కాలర్షిప్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షులు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో మాసబ్‌ట్యాంక్‌లోని సంక్షేమ భవన్ ముందు మహాధర్నా కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నినాదాలతో సంక్షేమ భవన్ దద్ద రిల్లింది. మహా ధర్నాలో ఆర్ కృష్ణయ్య, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ లు పాల్గొని మాట్లాడుతూ... పేద విద్యార్థుల చదువు కోసం ఎంతగానో ఉప యోగపడే స్కాలర్షిప్ పథకానికి ప్రభుత్వం నిధులను కేటాయిస్తున్నామని గొప్పలు చెప్ప డం తప్ప అమలు చేయడంలో పూర్తిగా విఫలం చెందిందని ఆరోపిం చారు. గత మూడు సంవత్సరాలుగా విద్యార్థులకు ఫీజులు ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను వెంటనే చెల్లించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చ రించారు. కార్య క్రమంలో గుజ్జ కృష్ణ, నీలం వెంకటేష్, నందగోపాల్, ప్రీతం, సుధాకర్, చంద్రశేఖర్, రాజేందర్, లింగయ్య, రాఘవేందర్, మణికంఠ, నరసింహ గౌడ్, ఉమేష్‌రాకేష్, అరవింద్ పాల్గొన్నారు.

## తెలంగాణ ఇచ్చిన పార్టీని చులకన చేయడం తగదు

### కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రజల స్వరాష్ట్ర ఆకాంక్షను నెరవేర్చిన కాంగ్రెస్ పార్టీ నేడు కెటిఆర్‌కు చిల్లర పార్టీ అయిందా, దేశం కోసం ప్రాణత్యాగాలు చేసిన నేతలు ఉన్న పార్టీని చులకన చేయడం తగదని అని మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి మండిపడ్డారు. గాంధీభవన్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడతూ అసలు ఇన్నాళ్లు కల్వకుంట్ల కుంటుంబం రాజకీ యాల్లో కొనసాగుతున్నారంటే తమ పార్టీ పెట్టిన భిక్షేనని అన్నారు. నాడు సోనియాగాంధీ ఇంటికి వెళ్లి కలిసినప్పుడు ఏం అనిపించ లేదా సెటైర్లు వేశారు. కెసిఆర్, కెటిఆర్ వెలిగిపోవడానికి కారణం కాంగ్రెస్ అన్న విషయం గుర్తు పెట్టుకోవాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కెటిఆర్ వ్యక్తిత్వం లేని వాడని అన్నారు. ఇంకా ఆయనకు రాజకీయ పరి పక్వత రావాల్సి ఉందని తెలిపారు. నిండు అసెంబ్లీలో తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది సోనియాగాంధీ అని చెప్పిన విషయం మరిచారా అని గుర్తు చేశారు. కాంగ్రెస్‌పార్టీ థర్డ్ క్లాస్ పార్టీ అయితే.. కెటిఆర్ అయ్య కూడా అదే థర్డ్‌క్లాస్ వ్యక్తి అంటూ జగ్గారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

## 33 బాటిళ్ల డిఫెన్స్ మద్యం పట్టివేత

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్‌లో బేకర్ దుకాణం. మరో పక్క బ్యాంకుల్లో రుణాలు కావాల్సిన వారికి రుణాలు ఇప్పిం చడం చేస్తున్న జి.సుదర్శన్‌రెడ్డి అనే వ్యక్తి గుట్టుచప్పుడు కాకుండా డిఫెన్స్ మద్యం బాటిళ్లను అమ్మకాలు జరుపుతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ సమా చారం అందుకున్న మహబూబ్‌నగర్ ఎక్సైజ్ డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ సీఐ కవిత, ఎస్సై రాజేందర్,

సిబ్బంది కలిసి సుదర్శన్‌రెడ్డి ఇంట్లో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 33 డిఫెన్స్ లిక్కర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టు కున్న మద్యం విలువ రూ. 1.50 లక్షలుగా ఉంటుందని అంచనా వేశారు. నిందితుడిని మహబూబ్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్ లో అప్పగించారు. డిఫెన్స్ క్యాంటిన్‌లో నెలవారి కోటా కింద తీసు కునే మద్యం బాటిళ్లను తక్కువ ధరలకు సేకరిస్తూ ఉంటాడు. డిఫెన్స్ బాటిళ్ల అంటూ ఎక్కువ ధరలకు అమ్మ కాలు జరుపుతూ సొమ్ము చేసు కుంటున్న సుదర్శన్‌రెడ్డిని అరెస్టు చేశారు.

## వివిధ సెట్స్ ప్రవేశాల్లో బేషరతుగా అడ్మిషన్స్ కల్పించాలి

### ఉన్నత విద్యామండలి చైర్మన్‌కు ఎబివిపి విజ్ఞప్తి

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వివిధ సెట్స్‌కి సంబంధించిన అడ్మిషన్స్ లో ఎలాంటి షరతులు లేకుండా చూడాలని అఖిల భారత విద్యార్థి పరిషత్(ఏబివిపి) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఏబివిపి రాష్ట్ర కార్యదర్శి మాచెర్ల రాంబాబు శుక్రవారం ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డికి వినతి పత్రం అంద చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ కార్యవర్గసభ్యులు జీవన్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజు, ఉస్మానియా యూనివర్సిటీ అధ్యక్షుడు దృహన్, విద్యానగర్ విభాగ్ కన్వీనర్ హరి ప్రసాద్ పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఐ సెట్, ఎడ్ సెట్, లా సెట్‌కి సంబంధించిన ప్రవేశాలు జరుగు తున్న తరుణంలో కళాశాలలు, ప్రభుత్వ యూనివర్సిటీలు కూడా విద్యార్థులకు ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను సాకుగా చూపి సర్టిఫికెట్స్ ఇవ్వడం లేదని రాంబాబు ఉన్నత విద్యా మండలి చైర్మన్ దృష్టికి తీసుకొ చ్చారు. సర్టిఫికెట్స్ ఇవ్వాలంటే మొత్తం ఫీజు విద్యార్థులే కట్టాలని ఒత్తిడి చేస్తున్నాయని ఆవేదన వ్యకతం చేశారు. విద్యార్థులు వారు గతంలో చదివిన కళాశాలల నుండి కస్టోడియన్ సర్టిఫికెట్ తీసుకొచ్చినప్పటికి కూడా అడ్మిషన్ పొందిన ప్రస్తుత కళాశాలలు వాటిని అంగీకరించట్లేదన్నారు. ఈ కారణాల వల్ల అడ్మిషన్ వచ్చిన విద్యార్థులు మనోవేదనకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కష్టపడి చదివి ర్యాంక్ సాధించినప్పటికీ ఇలాంటి కారణాల వల్ల విద్యార్థులు ఉన్నత కోర్సుల్లో అడ్మిషన్ పొందలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం సకాలంలో ఫీజురీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడమేనని రాంబాబు విమర్శించారు. ప్రభుత్వ తప్పులకు విద్యార్థులు మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిం దని.. కాబట్టి ఎలాంటి షరతులు లేకుండా అడ్మి షన్స్ చేసుకోవాలని కాలేజీలు, యూనివర్సిటీలను ఆదేశించాలని ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డికి విజ్ఞప్తి చేశారు.

## ఐసెట్ కౌన్సెలింగ్‌కు 13,056 మంది దరఖాస్తు

### మొదటి రోజు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు 2992 మంది హాజరు

### 25 నుంచి వరకు వెబ్ ఆప్షన్లు.. సెప్టెంబరు 2న సీట్ల కేటాయింపు

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఎంబిఏ, ఎంసిఏ సీట్ల భర్తీ కోసం నిర్వహించిన ఐ సెట్-2025 కౌన్సెలింగ్ బుధవారం నుంచి ప్రారంభం కాగా.. ఇప్పటి వరకు 13,056 మంది ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకున్నట్టు సాంకేతిక విద్య శాఖ కమిషనర్ శ్రీదేవసేన ప్రకటనలో తెలిపారు.

ఈ నెల 28 వరకు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. శుక్రవారం నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రారంభం కాగా.. మొదటి రోజు 2992 మంది హాజరయ్యారు.

ఈ నెల 29 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరగనుంది. అయితే ఈ నెల 27 ఆదివారం కావడంతో ఆ రోజు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉండదని ప్రకటించారు. ఈ నెల 25 నుంచి 30 వరకు వెబ్ ఆప్షన్లు ఇవ్వడానికి అవకాశమిచ్చారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారికి సెప్టెంబర్ 2న సీట్ల కేటాయింపు చేయనున్నారు.

## ఉన్నతాధికారులకు బదలీలు.. మాకు సస్పెన్షన్‌లా?

### ఆందోళనకు సిద్ధమవుతున్న అర్చకులు, పూజారులు

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** దేవాల యాల్లో పనిచేసే అర్చకులు, పూజారులు బయట ఇతర కార్యక్రమాల్లో పాల్గొనకూడదనే దేవాదాయ శాఖ ఉత్తర్వులను వ్యతిరిక్తి ఆందోళనలు చేసేం దుకు సిద్ధం అవుతున్నారు. ఎవరో ఒకరు ఇద్దరు చేస్తున్న పనిని దృష్టిలో ఉంచకుని ఈ విధంగా పూజారులు, అర్చకులను కించపరిచే విధంగా ఉత్త ర్వులు జారీ చేయడం సరికాదంటు న్నారు. తాము ఆహర్నిషలు కృషించి దేవాల యాల అభి వృద్ధికి తమ వంతు సహకారం అందిస్తున్నామని, ఇటువంటి సమయంలో ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసి తమను అవమా నిస్తోందని మండి పడుతున్నారు.

తమ పూజాపునస్కారాలతో ఉదయం లేచి ఆ భగవంతుని సేవలో తరిస్తూ అందరూ క్షేమంగా ఉండాలని భగవంతుని ప్రార్థి స్తున్నామన్నారు. ఎటువంటి సెలవులు, వారాంత రపు సెలవులు లేకుండా పని చేస్తున్న తమపై ఇటువంటి బలవంతపు ఉత్తర్వులు సరికాదం టున్నారు. పుణ్యదినాలు, పండగ రోజుల్లో తాము ఎటువంటి విరామం విసుగు లేకుండా పని చేస్తున్నామని, పండగ రోజుల్లో ఉదయం 3.30 గంట లకు లేచి దేవాలయాన్ని శుభ్రం చేసుకొని పూజా కార్యక్రమాలు అనంతరం మరోసారి దేవాలయాన్ని పరిశుభ్రం చేసుకుని కంటిమీద కునుకు లేకుండా శ్రమిస్తున్న తమ శ్రమను గుర్తించకుండా ఇటువంటి అర్థంపర్థం లేని ఉత్తర్వులతో తమను ఇబ్బంది పెట్టడమే అని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్త లోకోసుఖినో భవంతు: అని భావించి తాము భక్తులను దీవిస్తామని, దీని వెనుక ఎటువంటి ఉద్దేశ్యాలు ఉండవని లేనిపోనివి అభాండాలు, మాకు ఆపాదించి భగవంతునికి భక్తునికి అనుసంధా నంగా ఉండే మమ్మల్ని అవమానించడం కాక మరేమిటని వారు ప్రశ్నిస్తున్నారు. దేవాలయాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి పలు అభివృద్ధి పనులు చేపడుతుండటంతో ఆయా ఆలయాలకు పెద్ద ఎత్తున భక్తులు వస్తుండటంతో ఆలయాలకు కూడా పెద్ద మొత్తంలో కానుకలు, ఇతర రూపాల్లో ఆదాయం కూడా భారీగా పెరుగుతోందం టున్నారు. ఒక వైపు ఆలయాల అభివృద్ధికి చర్యలు చేపడుతూ మరో వైపు ఆ దేవుళ్ళన్న నమ్ముకుని వారినే ఆరాధిస్తున్న జీవితాలను గడుపుతన్న మమ్మల్ని ఈ నూతన ఉత్తర్వులు ఎంతో కృంగదీయడమే కాకుండా ఆత్మవిశ్వాసాన్ని కూడా దెబ్బతీస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జోగులాం గద్వాల్ దేవాలయంలో నూతన ఉత్తర్వులు ప్రకారం ఇద్దరి అర్చకులను సస్పెండ్ చేసి, ఇఒను మాత్రం బదలీ చేయడం ఎంతవరకు సబబుని వారి ప్రశ్నిస్తున్నారు. నిబంధనలు అధికారులకు ఒకలా అర్చకులు, పూజారులకు మరోలా ఉండవని కానీ ప్రభుత్వం ఈ విషయంలో ఉన్నత స్థాయి అధికారులను ఒకలా అర్చకులను, పూజారులను మరోలా చూస్తూ పక్షపాత ధోరణి అవలంబిస్తోందని వారు ఆరోపిస్తున్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇటువంటి నిబంధనల పెట్టి వేద మంత్రోచ్ఛరణ చేసే తమ నోర్లు మూయలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉత్తర్వులను వెనక్కి తీసుకోకపోతే పెద్దఎత్తున ఆందోళన చేసేందుకు కూడా వెను కాడమని ఆయా సంఘాల నేతలు హెచ్చరి స్తున్నారు.

## 'స్థానిక' ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సిపిఐ సిద్ధం కావాలి

### పార్టీ జాతీయ కమిటీ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి




గాజులరామారంలో జరిగిన రాష్ట్ర సిపిఐ నాలుగో మహాసభ మూడోరోజు సమావేశంలో ప్రసంగిస్తున్న చాడ వెంకట్‌రెడ్డి.

**హైదరాబాద్ (కుత్బుల్లాపూర్), ఆగస్టు 22, ప్రభాత వార్త:** ప్రజాసమస్యల పరిష్కారంకోసం నిరంతరం పోరాడుతున్న సిపిఐ శేణులు తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంసిద్ధం కావాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడా వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక సంస్థలలో ప్రాతినిత్యం పెంచుకోవడం ద్వారా పార్టీని మరింత బలోపేతం చేయా లన్నారు. మేడ్చెల్ మల్కాజ్‌గిరి జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజుల రామారం పొట్లూరి నాగేశ్వరరావు నగర్ లోని కామ్రేడ్ ఎన్.బాల మల్లేశ్ హాలు (మహారాజా గార్డెన్స్)లో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి నాలుగవ మహాసభల ముగింపు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

భూమి కోసం, భుక్తికోసం వెట్టిచాకిరీ విముక్తికోసం పోరాడిన కమ్యూనిస్టుపార్టీ వద్దకు వెళితేనే తమకు ఇంటిస్థలం దొరుకుతుందన్న నమ్మకం ప్రజల్లో నిలిచిఉంటడం తమపార్టీ గొప్పదనమన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీకి ఉధ్యమాలే ఊపిరి అని ఉధ్యమాల ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి ఉధ్యమించి ప్రజాప్రతినిధులుగా గుర్తింపుకోసం నినంతరం శ్రమించాలన్నారు. మతోన్మాద ఆర్.ఎస్.ఎస్ మద్దతుతో బిజెపి గత 11ఏళ్లుగా డిల్లిలో ఎర్రకోటపై జాతీయజెండాను ఎంతో దురష్టకరమన్నారు.

బిజెపి ప్రభుత్వ ఫాసిస్టు విదానాలకు వ్యతిరేకంగా బిజెపి హటావో దేశ్‌కు బచావో నినాదంతో దేశవ్యాప్తంగా ప్రచారాన్ని సిపిఐ నిర్వహిస్తుందని తెలిపారు. సమావేశంలో భారత కమ్యూనిస్టుపార్టీ మేడ్చెల్ మల్కాజ్‌గిరి జిల్లా కార్యదర్శి ఇ. ఉమా మహేశ్ ప్రసంగించారు. మహాసభ ఆహ్వానసంఘ అధ్యక్షులు ఎం.డి. యూసుఫ్, సమావేశానికి జిల్లా నలుమూడల నుండి భారీగా మహిళా నాయకులు, కార్యకర్తలు, వివిధ పరిశ్రమల ట్రేడ్‌యూనియన్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావడంతో ప్రాంగాణమంతా ఎర్రరంగు పులుకున్నతీరుగా మారింది.

## ఎప్‌సెట్ ఇంటర్నల్ స్లైడింగ్‌లో 3,590 సీట్ల కేటాయింపు

### నేడు కొత్త బ్రాంచ్‌ల్లో చేరాలి.. 9,419 మంది వెబ్‌ఆప్షన్లు

### ఇంటర్నల్ స్లైడింగ్ అనంతరం 85 శాతం సీట్ల భర్తీ.. 13,453 సీట్లు ఖాళీ

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్, ఫార్మసీ కాలే జీల్లో ఇంజనీరింగ్‌తోపాటు అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎప్ సెట్-2025 కౌన్సెలింగ్‌లో భాగంగా ఇంట ర్నల్ స్లైడింగ్ వెబ్ ఆప్షన్లు ముగియగా శుక్రవారం సీట్ల కేటాయింపు చేపట్టారు. ఇంటర్నల్ స్లైడింగ్‌లో భాగంగా 9419 మంది తమ బ్రాంచ్‌లను మార్చుకోవడం కోసం 9419 మంది వెబ్ ఆప్షన్లను ఇచ్చారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారిలో 3590 మందికి సీట్లను కేటాయించారు. ఇంటర్నల్ స్లైడింగ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు నేడు(శనివారం) కొత్త బ్రాంచ్‌ల్లో చేరాలని సాం కేతిక విద్య శాఖ కమిషనర్ శ్రీదేవసేన శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఎప్ సెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా 97,369 మంది సర్టిఫికెట్ వెరిఫి కేషన్‌ను నిర్వహించారు.

రాష్ట్రంలో 180 కాలే జీల్లో 90,246 కన్వీనర్ కోటా సీట్లు ఉన్నా యి. వాటిలో ఇంటర్నల్ స్లైడింగ్ పూర్తయ్యే నాటికి 76,793 సీట్లు భర్తీ అయ్యాయి. మరో 13,453 సీట్లు ఖాళీగా ఉన్నట్టు సాంకేతిక విద్య శాఖ కమిషనర్ తెలిపారు. మొత్తం కన్వీనర్ సీట్లలో 85.1 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. కోస్గిలోని గవర్నమెంట్ కాలేజీలో 198 సీట్లకి 49 సీట్లు భర్తీ కాగా మరో 149 సీట్లు ఖాళీగా ఉన్నాయి. యూనివర్సిటీ కాలేజీలు 21 ఉండగా వాటిలో 6440 సీట్లకిగాను 4482 సీట్లు భర్తీకాగా.. మరో 1958 సీట్లు ఖాళీగా ఉన్నాయి. రెండు ప్రైవేటు యూనివర్సిటీల్లో 1386 సీట్లు ఉంటే.. వాటిలో 1340 సీట్లు భర్తీ అయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా 156 ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో 82,222 సీట్లు ఉండగా.. వాటిలో 70,922 సీట్లు భర్తీ అయ్యాయి. మొత్తంగా కన్వీనర్ కోటాలో 90,246 సీట్లు అందుబాటులో ఉంటే 76,793 సీట్లు భర్తీకాగా.. మరో 13,453 సీట్లు ఖాళీగా ఉన్నాయి.

## మట్టి గణనాథుల పంపిణీకి 34 కేంద్రాలు ఏర్పాటు చేసిన హెచ్‌ఎండిఎ

**హైదరాబాద్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** వినాయక ఉత్సవాలు మరికొద్ది రోజుల్లో మొదలు కానున్నాయి. అయితేపర్యావరణాన్ని కలుషితం చేసే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వినాయకులను వాడొద్దని, మట్టి గణపతులనే పూజించాలని హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్ఎండిఎ) పిలుపు నిచ్చింది. పర్యావరణహిత వినాయకులను పూజించాలని పిలుపునివ్వడమే కాదు, ప్రతియేడులాగే ఈ యేడాది కూడా వేలాది మట్టి గణపతులను భక్తులకు ఉచితంగా పంచేందుకు సిద్ధం అయింది. నగరంలో పలు కేంద్రాల్లో మట్టి వినాయకులను పంపిణీ చేయనున్నట్టు ప్రకటించింది. దాదాపు 34 కేంద్రాల్లో ఈ మట్టి గణపతులు పంపిణీ పూర్తిగా ఉచితం అని పేర్కొంది. నగరవ్యాప్తంగా ఆయా కేంద్రాల్లో ఈనెల 24, 25, 26 తేదీల్లో లక్ష వినాయక ప్రతిమలను అందుబాటులో ఉంచుతున్నట్టు తెలిపింది.

## యాదాద్రి-వరంగల్ జాతీయ రహదారి 163 సర్వీస్ రోడ్ల పనులు పూర్తి చేయాలి

### కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీకి వరంగల్ ఎంపి కడియం కావ్య విజ్ఞప్తి



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 22:** కేంద్ర రహదారి రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో ఢిల్లీలో శుక్రవారం వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య సమావేశమయ్యారు. ఈ సందర్భంగా యాదాద్రి- వరంగల్ జాతీయ రహదారి 163 (హైదరాబాద్-భూపాలపట్నం రోడ్) లో పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రోడ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని కేంద్ర మంత్రికి వినతి పత్రం అందజేసి విజ్ఞప్తి చేశారు. నేషనల్ హైవేను నాలుగు లైన్లుగా విస్తరించినప్పటికీ, కొన్ని గ్రామాల వద్ద సర్వీస్ రోడ్లు అనుసంధానం లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎంపీ కేంద్ర మంత్రికి వివరించారు. నిడిగొండ, రఘునాథపల్లి, చాగల్, స్టేషన్ ఘనపూర్, చిన్నపెండ్యాల్, కరుణాపురం గ్రామాల వద్ద రోడ్లు ఉన్నా, జనగాం నుంచి ఈ గ్రామాల మధ్యలో లింకులు లేకపోవడం పెద్ద సమస్యగా మారిందని చెప్పారు. దీంతో గ్రామాల వాహనాలు నేరుగా ప్రధాన హైవేపైకి రావడం వల్ల రద్దీ పెరుగుతోందని, ప్రమాదాలు ఎక్కువవుతున్నాయని ఎంపీ కడియం కావ్య తెలిపారు. నాలుగు లైన్ల సమయంలోనే అవసరమైన భూమి సేకరించారని, ఇప్పుడు కేవలం నిర్మాణ పనులు పూర్తి చేయాల్సి ఉందని త్వరితగతిన పనులు ప్రారంభించాలని ఎంపీ డా.కడియం కావ్య కేంద్ర మంత్రిని కోరారు. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య విజ్ఞప్తి పట్ల సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఈ విషయాన్ని పరిశీలిస్తానని, అవసరమైన సూచనలు సంబంధిత అధికారులకు ఇస్తామని హామీ ఇచ్చారని ఎంపీ కావ్య తెలిపారు.



ధర్నాలో నినాదాలు చేస్తున్న రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం నేతలు

## రేషన్ డీలర్ల హామీలను అమలు చేయాలి

### డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల

**హైదరాబాద్ (ధర్నాచౌక్), ఆగస్టు 22, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో రేషన్ డీలర్లకు ఇచ్చిన అమలుచేయాలని తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బత్తుల రమేష్‌బాబు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సం క్షేమ సంఘం ఆధ్వర్యంలో శాంతియుత ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా నుద్దేశించి రమేష్‌బాబు మాట్లాడుతూ రేషన్ డీలర్లకు కనీస గౌరవవేతనం ఐదు వేల రూపాయలు, 300 రూపాయల కమీషన్ పెంపును తక్షణమే ప్రకటించాలని కోరారు. ఏప్రిల్ నుండి ఆగస్ట్ వరకు రావల్సిన ఐదు నెలల కమీషన్‌ను వెంటనే ఇప్పించి, రేషన్ డీలర్ల కుటుంబాలను ఆర్ధికంగా ఆదు కోవాలని విజ్ఞప్తి చేశారు. రేషన్ షాపులను మిని సూపర్‌మార్కెట్‌లుగా గుర్తించి, మరిన్ని నిత్యావసర సరుకులను పేదప్రజలకు అందుబాటులోకి తేవాలని, రేషన్‌డీలర్ల కుటుంబాలకు హెల్త్‌కార్డులు జారీ చేయాలని, బియ్యం దిగుమతి చార్జీలను ప్రభుత్వమే భరించాలని, పాత బకాయిలను చెల్లించాలని కోరారు. సంఘం ప్రధాన కార్యదర్శి రెడ్డిమల్ల హన్మండ్లు మా ట్లాడుతూ గోదాం ప్రాంగణంలో శాశ్వత ప్రాతిపదికన వేబ్రిడ్జిలు ఏర్పాటు చేయాలని, పోర్టబిలిటీ సిస్టం వచ్చినందున రేషన్‌కార్డుల బైఫర్గేషన్ విధా నాన్ని నిలుపుదల చేసి, కొత్తషాపుల ఏర్పాటు రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు.



సిఎం ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న చిన్నారెడ్డి.

## సిఎం ప్రజావాణికి అందిన దరఖాస్తులు 324

**హైదరాబాద్ (బేగంపేట), ఆగస్టు 22, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన సీఎం ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 324 దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 74దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు సంబంధించి 57దరఖాస్తులు, హోంశాఖకు సంబంధించి 26 దరఖాస్తులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం 102దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 65 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలియజేసారు. సిఎం ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డా. జి. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్యదేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు.

23-08pg10 12 GNT_23-08pg10.qxd 8/22/2025 10:15 PM Page 1



# మహిళల ప్రపంచకప్ టీమ్ ఖరారు




## అమన్‌జోత్ ఎంట్రీ
## షెఫాలీకి దక్కని చోటు

**న్యూఢిల్లీ:** ఈ ఏడాది జరగనున్న మహిళల ప్రపంచకప్ కోసం టీమ్ఇండియా సభ్యుల పేర్లను భారత క్రికెట్ నియంత్రణ మండలి (బిసిసిఐ) ప్రకటించింది. స్వదేశంలో జరగనున్న ఈ టోర్నీకి 15 మంది సభ్యులతో కూడిన జట్టును కూర్పు చేసింది. ఈ జట్టుకు హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్ కాగా స్మృతి మంధాన వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తారు. అయితే ఈ టీమ్‌లో లేడీ సెహ్వాగ్, స్టార్ ఓపెనర్ షెఫాలి వర్మకు షాక్ తగిలింది. వన్డే ప్రపంచకప్ సహా ఆస్ట్రేలియా సిరీస్‌కు సైతం ఎంపిక కాలేదు. ఇటీవల ముగిసిన ఆస్ట్రేలియా పర్యటనలో షఫాలీ ఇండియా జట్టులో భాగమైంది. కానీ ఆమె ఆడిన గత మూడు వన్డే మ్యాచ్‌లతో సహా ఆరు వైట్‌బాల్ మ్యాచ్‌లలో పెద్దగా ఆకట్టుకోలేకపోయింది. దీంతో షఫాలీ వర్మను పక్కన పెట్టనట్లు తెలుస్తోంది. ఇటీవలి కాలంలో సత్తా చాటిన ప్రతీక రావల్పై సెలక్టర్లు నమ్మకముంచారు. పేసర్ రేణుక సింగ్ జట్టులో పునరాగమనం చేసింది. మరో పేసర్ క్రాంతి గౌడ్ జట్టులో స్థానం సంపాదించింది. టీమ్ విషయాని కొస్తే అంచనాలకు తగ్గట్టుగానే జట్టు కూర్పు జరిగినట్లు తెలుస్తోంది.

ఆల్ రౌండర్ అమన్‌జోత్ కౌర్ ప్రస్తుతం గాయపడి బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కోలుకుంటోంది. ఆస్ట్రేలియాతో జరిగే వన్డే సిరీస్‌కు ఆమెను ఎంపిక చేయలేదు. వరల్డ్ కప్ కోసం ఆమె ఫిట్‌గా అవుతుందని భావిస్తున్నట్లు కెప్టెన్ హర్మన్ ప్రీత్ సింగ్ చెబుతోంది.

ఇక ప్రపంచ కప్‌తో పాటు, ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్ కోసం భారత మహిళా జట్టును కూడా బిసిసిఐ ప్రకటించింది. అయితే ప్రపంచకప్ జట్టుతో పోలిస్తే ఆస్ట్రేలియా సిరీస్‌లో జట్టులో ఒకేఒక్క మార్పు జరిగింది.

సయాలి సత్ఘారే ఈ సిరీస్‌కోసం జట్టులో చేర్చారు. మహిళల ప్రపంచ కప్ కోసం ఎంపిక చేసిన టీమ్ఇండియా జట్టులో హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), ప్రతికా రావల్, హర్లీన్ డియోల్, దీప్తి శర్మ, జెమిమా రోడ్రిగ్స్, రేణుకా సింగ్ ఠాకూర్, అరుంధతి రెడ్డి, రిచా ఘోష్ (వికెట్ కీపర్), క్రాంతి గౌడ్, అమన్‌జోత్ కౌర్, రాధా యాదవ్, శ్రీ చరణి, యాస్తిక భాటియా (వికెట్ కీపర్), స్నేహ్ రాణా. రిజర్వ్ ప్లేయర్స్‌గా తేజల్ హసబ్నిస్, ప్రేమా రావల్, ప్రియా మిశ్రా, ఉమా చెత్రీ, మిన్ను మణి, సయాలి సత్ఘారేను ఎంపిక చేశారు.



## ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో..
## ఎలావెనిల్‌కు స్వర్ణం

**న్యూఢిల్లీ:** 16వ ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ పోటీలో భారత ఒలింపియన్ ఎలావెనిల్ వలరివన్ తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగించింది. కజికిస్తాన్‌లో శుక్రవారం జరిగిన ఈ ఛాంపియన్‌షిప్ పోటీల్లో వలరివన్ స్వర్ణం సాధించి జాతీయ రికార్డు సృష్టించింది. జకార్తాలో జరిగిన 2024 ఆసియా ఛాంపియన్‌షిప్‌లో రజత పతకం సాధించిన తర్వాత, ఈ తాజా విజయం ఆమె కాంటినెంటల్ ఈవెంట్‌లో వరుసగా రెండవ వ్యక్తిగత పతకాన్నిసాధించింది. తమిళనాడుకు చెందిన 26 ఏళ్ల ఈ అమ్మాయి ఫైనల్లో అద్భుతమైన సంయమనాన్ని ప్రదర్శించింది, 253.6 పాయింట్లతో అద్భుతమైన స్కోరుతో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. ఈ అద్భుతమైన స్కోరు కొత్త జాతీయ రికార్డును నెలకొల్పింది. ఆమెతో పాటు చైనాకు చెందిన పెంగ్ జిన్లు రజత పతకం, దక్షి ణ కొరియాకు చెందిన క్వాన్ యున్‌జి కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు. ఇక ఈ పోటీలో ఉన్న మరో భారతీయురాలు మెహులి ఘోష్ ఎనిమిది షూటర్ల ఫైనల్లో 208.9 స్కోరుతో నాల్గవ స్థానంలో నిలిచింది. ఆమె మొదట 10వ స్థానంలో నిలిచింది. కానీ ఇద్దరు ఉన్నత స్థానంలో ఉన్న భారతీయ షూటర్లు, ఆర్య బోర్సే, సోనమ్ మస్కర్ ర్యాంకింగ్ పాయింట్ల కోసం మాత్రమే పోటీ పడుతున్నందున పక్కకు తప్పుకోవడంతో ఫైనల్‌కు చేరుకుంది. ఎలావెనిల్, మెహులి ఘోష్ మరియు నాయుడు అనన్య త్రయం టీమ్ ఈవెంట్‌లో 1891.0 స్కోరుతో కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది.

## మహిళల అనధికారిక టెస్ట్‌లో..
## భారత్ ముందంజ
### 141 రన్స్ వెనుకబడిన ఆస్ట్రేలియా

**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియా మహిళల జట్టుతో జరుగుతున్న ఏకైక అనధికారిక టెస్ట్ మ్యాచ్‌లో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో గౌరవప్రదమైన స్కోర్ చేసింది. టాపార్డర్ విఫలమైనా, లోయర్ ఆర్డర్ బ్యాటర్లు అద్భుతంగా పోరాడటంతో 300కు ఒక్క పరుగు తక్కు వద్ద ఆలౌట్ అయింది. బ్రిస్బేన్‌లో శుక్రవారం రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా 5 వికెట్లనష్టానికి 158 పరుగులకే పరిమితమైంది. వర్షం కారణంగా తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఐదు వికెట్లకు 72 పరుగులకు పరిమితమైన భారత్ కష్టాల్లో పడింది. కానీ ఓవర్ నైట్ 26 పరుగులతో ఉన్న బిస్ట్, మొదట రాధా యాదవ్ (33)తో 6 వికెట్‌కు 64 పరుగుల భాగస్వామ్యాన్ని పంచుకుంది. తర్వాత మిన్ను మణి (28)తో కలిసి 75 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి భారత్‌ను ఇబ్బందుల నుండి గట్టెక్కించింది. భారత ఇన్నింగ్స్ 63వ ఓవర్లో మీడియం పేసర్ మైట్లాన్ బ్రౌన్ ఆమెను క్లీన్ అవుట్ చేసి మణిని కూడా ఔట్ చేసింది. కానీ జోషిత, టైటాస్ సాధు (23) 9వ వికెట్‌కు 75 పరుగుల విలువైన భాగస్వామ్యాన్ని పంచుకున్నారు, తద్వారా భారత్ 300 పరుగులమార్కును చేరుకుంది. జోషిత ఆఫ్‌స్పిన్నర్ లిల్లీ మిల్స్ బౌలింగ్‌లో బౌల్డ్ అయింది. ఆస్ట్రేలియా తరఫున మీడియం పేసర్లు జార్జియా ప్రెస్ట్‌విడ్జ్ (3/37) మరియు బ్రౌన్ (3/65) తమ మధ్య 6 వికెట్లు పంచుకున్నారు. ఇక ఆస్ట్రేలియా 43 ఓవర్లలో 5 వికెట్లకు 158 పరుగులు చేసి కష్టాల్లో పడింది. ఇండియా తరఫున మీడియం పేసర్ సైమా ఠాకూర్ (2/21), ఎడమచేతి వాటం స్పిన్నర్ రాధా (2/40) చెరో 2 వికెట్లు పడగొట్టగా, ఆస్ట్రేలియా బ్యాట్స్‌మన్‌గా సాధు (1/27) రాణిం చింది. కెప్టెన్ తహిలా విల్సన్ 49పరుగులు చేయగా, రాచెల్ ట్రెనామన్ (21)తో కలిసి ఓపెనింగ్ భాగస్వామ్యానికి 46 పరుగులు జోడించింది. స్టంప్స్ వద్ద, వికెట్ కీపర్ నికోల్ ఫాల్టమ్ (30 నాటౌట్), సియానా జింజర్ (24 నాటౌట్) క్రీజులో ఉన్నారు. ఇంకా రెండు రోజుల ఆట మిగిలి ఉండగానే ఆస్ట్రేలియా భారత్ కంటే 141 పరుగులు వెనుకబడి ఉంది.

## విన్‌స్టన్ సేలం ఓపెన్‌లో..
## రోహన్ బోపన్న జోడీ ఓటమి



**న్యూఢిల్లీ:** విన్‌స్టన్‌సేలం ఓపెన్-2025, పురుషుల డబుల్స్ క్వార్టర్స్‌లో యుకీ భాంబ్రీ-మైఖేల్ వీనస్ జంట రోహన్ బోపన్న-రొమైన్ ఆర్నియోడో ద్వయాన్ని ఓడించింది. అమెరికాలోని నార్త్ కరోలినాలో జరిగిన ఎటిపి 250 టోర్నమెంట్, 25వ విన్స్టన్‌సేలం ఓపెన్‌లో భారత స్టార్ ఆటగాడు యుకీ భాంబ్రీ మరియు అతని భాగస్వామి న్యూజిలాండ్‌కు చెందిన మైఖేల్ వీనస్ సెమీఫైనల్లోకి ప్రవేశించారు. 1 గంటా 22 నిమిషాల పాటు జరిగిన ఈ పోరులో ఈ జంట ఇండోమోనెగాస్క్ జంట రోహన్ బోపన్న మరియు రొమైన్ ఆర్నియోడోపై వరుస సెట్లలో (76(2), 6 3) విజయం సాధించింది. వరుసగా మూడు టోర్నమెంట్లలో తొలి రౌండ్‌లోనే ఓడిపోయిన రెండో సీడ్ ఇండోన్యూజిలాండ్ జోడీకి ఇది ఈ ఏడాది తొలి సెమీఫైనల్ అవుతుంది. క్వార్టర్ ఫైనల్స్‌లో, రెండు జంటలు తమ సర్వీస్‌లను నిలబెట్టుకోవడంలో సవాళ్లను ఎదుర్కొంటూ తీవ్రంగా పోరాడారు. మొదటి సెట్‌లో ప్రతి ఒక్కరూ రెండు బ్రేక్‌లు ఇవ్వడంతో, టైబ్రేకర్‌కు దారితీసింది, అక్కడ రోహన్, రొమైన్ 2-7 తేడాతో ఓడిపోయారు. ఇండోకివీ ద్వయం రెండవ సెట్ ప్రారంభంలో ఇబ్బంది పడింది, మొదటి గేమ్‌లో బ్రేక్ కోల్పోయింది, కానీ అద్భుతంగా పుంజుకుంది, తరువాతి గేమ్‌లలో రెండు బ్రేక్‌లు సాధించి వరుస సెట్లలో మ్యాచ్‌ను కైవసం చేసుకుంది.

## మహిళల ఛాంపియన్‌షిప్‌లో
## భారత్ విజయం
### బంగ్లాదేశ్ 2-0 తేడాతో ఓటమి

**న్యూఢిల్లీ:** మహిళల ఛాంపియన్‌షిప్-2025 టోర్నమెంట్‌లో బంగ్లాదేశ్‌తో జరిగిన పోరులో భారత్ జట్టు విజయం సాధించింది. శుక్రవారం థింపులోని చాంగ్లిమితాంగ్ స్టేడియంలో జరిగిన శాఫ్ అండర్ 17 మహిళల ఛాంపియన్‌షిప్‌లో బంగ్లాదేశ్‌పై భారత్ వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసి 2-0 తేడాతో చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. పెర్ల్ ఫెర్నాండెజ్ మరియు ప్రత్యామ్నాయ క్రీడాకారిణి బోనిఫిలియా షల్లాయ్ యంగ్ టైగ్రెస్సెస్‌కు గోల్స్ చేశారు. ఈ విజయంతో, భారతదేశం ఆరు పాయింట్లను సాధించి పట్టికలో అగ్రస్థానంలో తన స్థానాన్ని సుస్థిరంచేసుకుంది. పెర్ల్ ఫెర్నాండెజ్ (13 నిముషం) మధ్యలో బలమైన పరుగుతర్వాత స్కోరింగ్‌ను ప్రారంభించింది. 75వ నిమిషంలో ప్రత్యామ్నాయ క్రీడాకారిణి బోనిఫిలియా షల్లాయ్ అలీషా లింగ్డో కార్నర్ నుండి అద్భుతమైన వాలీని కొట్టడంతో యంగ్ టైగ్రెస్‌లు తమ ఆధిక్యాన్ని రెట్టింపు చేశారు. 14వ నిమిషంలో, సెంటర్‌బ్యాక్ దివ్యని లిండా డీప్ నుండి స్ఫూర్తిదాయకమైన పరుగు చేసి బంతిని తీసుకొని మిడ్‌ఫీల్డ్ గుండా వెళ్లింది. డిఫెండర్లు ఆమెపైకి చేరుకోవడంతో, ఆమె తెలివిగా దానిని పెర్ల్‌కు అందించింది, ఆమె బాక్స్ అంచున గుర్తు లేకుండా మిగిలిపోయింది. బంగ్లాదేశ్ కీపర్ ఇయర్జాన్ బేగం బంతిని కొట్టినప్పటికీ, ఆమె దానిని ఆపలేకపోయింది. రెండవ అర్ధభాగం కూడా ఇదే లయను అనుసరించింది, భారత్ ఆటను నియంత్రించింది. ఇక బాంగ్లాదేశ్ ఆల్పి అక్టర్ భారత గోల్ కీపర్ మున్నీ ఒత్తిడి తెచ్చినా ముందుకు సాగలేకపోయారు.

## భారీ నష్టాల్లో సూచీలు



**హైదరాబాద్,ఆగస్టు22, ప్రభాతవార్త:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాలు చవిచూశాయి. జాక్సన్‌హక్షల్ సింపోజియంలో అమెరికా ఫెడ్ చీఫ్ వడ్డీరేట్లపై ఎలాంటి ప్రకటన చేయబోతున్నారనే దానిపై ఇన్వెస్టర్లలో ఆసక్తి నెలకొంది. అయితే దీనికి తోడు భారత్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన 25శాతం పన్నుల భారం ఆగస్టు27 నుంచి అమలుచేయనున్నారు. గడువు దగ్గర పడుతుండడంతో వారాంతంలో మార్కెట్ సూచిలు నష్టాలపాలయ్యాయి. సెన్సెక్స్ సుమారు 700 పాయింట్ల మేర నష్టపోగా..నిఫ్టి మళ్లీ 25వేల స్థాయిలో ముగిసింది. సెన్సెక్స్ ఉదయం 81,951,48 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమయింది. రోజంతా నష్టాలతోనే సాగింది. ఇంట్రాడేలో 81,291,77 పాయింట్ల వద్ద కనిష్టాన్ని తాకిన సూచి చివరకు 693.86పాయింట్ల నష్టంతో 81,306.85వద్ద స్థిరపడింది. నిఫ్టి 213.65 పాయింట్ల నష్టంతో 24,870,10 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయ మారకం విలువ 87.53గా ఉంది. సెన్సెక్స్ 30సేచిలో ఏషియన్ పెయింట్స్ అల్ట్రాటెక్ సిమెంట్,ఐటిసి, టాటా స్టీల్, హెచ్‌సిఎల్, టెక్నిలజిస్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. మహీంద్ర అండ్ మహీంద్ర, మారుతి, సుజుకి, సన్‌ఫార్మా, బీఈఎల్, భారతి ఎయిర్‌టెల్ షేర్లు లాభపడ్డాయి.

## మ్యూచువల్ ఫండ్స్‌లో ఆరు కొత్త స్కీమ్‌లు




**హైదరాబాద్,ఆగస్టు22, ప్రభాతవార్త:** మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తున్న వారికి ఆయ ప్రముఖ అసెట్ మేనేజ్మెంట్ కంపెనీల కొత్తగా ఆరు స్కీంలను అందుబాటులోకి తెచ్చాయి. ఈటిఎఫ్, ఫండ్ ఆఫ్ ఫండ్ వంటి కేటగిరీలతో అధిక రాబడి వచ్చే అవకాశం ఉంటుందని ఆయా కంపెనీలు పేర్కొన్నాయి. ఈక్విటీ పెట్టుబడుల ద్వారా హైరిటర్న్ అందుకోవచ్చనే కారణంతో చాలా మంది ఇప్పుడు మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెడుతున్నారు. తమ ఆర్థిక లక్ష్యాలు, రిస్క్ సామర్థ్యాన్ని బట్టి అనువైన ఫండ్స్ ఎంచుకుని దీర్ఘకాలం పాటు పెట్టుబడులు కొనసాగిస్తుంటారు. అయితే, చాలా మంది ఇప్పటికే అందుబాటులో ఉన్న పథకాలను గత చరిత్ర, పనితీరును బట్టి ఎంచుకుంటున్నారు. ప్రధానంగా మీరే అసెట్ మ్యూచువల్ ఫండ్ తీసుకొచ్చిన మీరే అసెట్ గోల్డ్ సిల్వర్ పాసివ్ ఫండ్ ఆఫ్ ఫండ్, ఏంజెల్ వన్ గోల్డ్ ఈటీఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్ ఆఫర్‌లు ప్రారంభమయ్యాయి. మొదటి స్కీమ్ ఆగస్టు 25 వరకు అందుబాటులో ఉండగా.. అలాగే ఏంజెల్ వన్ ఫండ్ స్కీం సెప్టెంబర్ 3 వరకు కొనసాగుతోంది. అసెట్ మల్టీ ఫ్యాక్టర్ పాసివ్ ఫండ్ ఆఫ్ ఫండ్ (డొమెస్టిక్)స్కీం గడువు ఆగస్టు 25 వరకు ఉంటుందని పేర్కొంది. అలాగే ఎడెల్వేయిస్ మల్టీ అసెట్ ఓమ్నీ ఫండ్ ఆఫ్ ఫండ్ స్కీం ఆగస్టు 26 వరకు అందుబాటులో ఉంటుంది. ఆలోపు బిడ్లు దాఖలు చేసిన వారికి యూనిట్లు కేటాయిస్తారు. ఇప్పటికే ప్రముఖ ఏఎంసీ ఏంజెన్ వన్ మ్యూచువల్ ఫండ్ నుంచి గోల్డ్ స్కీమ్ వచ్చింది. ఇండెక్స్ ఫండ్ కేటగిరీలోకి వస్తే యాక్సిస్ నిఫ్టీ 500 ఈక్వాలిటీ 50 ఇండెక్స్ ఫండ్ ఉంది.

## రాపిడో టాక్సీకి రూ.10 లక్షలు జరిమానా

### వినియోగదారులను తప్పుదారి పట్టించే ప్రకటనల వ్యవహారం





హైదరాబాద్,ఆగస్టు22, ప్రభాతవార్త: వినియోగదారులను ఆకర్షించేందుకు కంపెనీలు వినూత్నంగా ప్రకటనలు చేసి సొమ్ము చేసుకుంటారు. మాయమాటలతో వంచించే ప్రకటనలపై సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ ఆథారిటీ (సిసిపిఎ) దృష్టిసారించింది. ఈ క్రమంలో రాపిడోపై చర్యలు చేపట్టింది. ఐదు నిమిషాల్లో ఆటో రాకపోతే రూ. 50 ఇస్తామని చెప్పి, ఒక్కరికి కూడా డబ్బులు ఇవ్వలేదు. ప్రకటనను వెంటనే నిలిపివేయాలని వినియోగదారుల వ్యవహారాల శాఖ ఆదేశించింది. అయితే రాపిడో ట్యాక్సీపై ఎన్నో ఫిర్యాదులు వెలువెత్తుతున్న నేపథ్యంలో తప్పు ప్రకటనపై రూ.10లక్షల జరిమాన విధించినట్లు వెల్లడించింది. కంపెనీ అందించే సేవలపై చాలా మంది అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. యాడ్‌తో చాలా మంది ప్యాసింజర్లు రాపిడో ఆటో బుక్ చేసుకుంటున్నారు. అయితే 5 నిమిషాలు దాటినప్పటికీ ఒక్కరంటే ఒక్క ప్యాసింజర్ కు కూడా యాడ్ లో చెప్పినట్లు రూ. 50 రీఎంబర్స్‌మెంట్ ఇవ్వలేదని పేర్కొంది. ఆలస్యమైతే డ్రైవర్లదే బాధ్యత కానీ, కంపెనీది కాదని షరతుల్లో ఉంది. ఇది కంపెనీ జవాబుదారీ నుంచి తప్పించుకోవడమే అవుతుందని వివరించింది. అదేవిధంగా చిన్నచిన్న అక్షరాల్లో సిసిపిఏ జరిపిన దర్యాప్తులో మరో విషయం వెలుగుచూసింది. ఐదు నిమిషాల్లో ఆటో రాకపోతే రూ. 50 ఇస్తామని ప్రకటనలో ఉంది. కానీ నిజానికి ఇది క్యాష్ కాదు, రాపిడో కాయిన్స్ అని ప్రకటనలో చిన్న చిన్న అక్షరాల్లో రాసి ఉంది. ఈ కాయిన్స్ ను కేవలం బైక్ రైడ్స్ కోసమే ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది. అయితే ఇవి కేవలం ఏడు రోజుల్లోనే గడువు ముగించి చెల్లకుండా ఉంటాయని తెలిపింది. ఇక 2023 ఏప్రిల్ నుంచి 2024 మే వరకు ఫిర్యాదుల సంఖ్య 575 గా ఉండగా, 2024 జూన్ నుంచి 2025 జులై వరకు ఫిర్యాదులు 1,224తో రెట్టింపు అయ్యాయని జాతీయ వినియోగదారుల హెల్ప్ లైన్ గణాంకాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. చాలా మంది ప్యాసింజర్లు రాపిడో రీఫండ్ పేమెంట్ల విషయంలో ఫిర్యాదు చేశారు. అలాగే కొందరు ఎక్కువ ఛార్జీ వసూలు చేశారని, మరికొందరు సర్వీస్ లేదని వాపోయినట్లు పేర్కొంది.

## ఐదేళ్ల తర్వాత.. భారత్, చైనా వాణిజ్య కలాపాలు

**హైదరాబాద్,ఆగస్టు22, ప్రభాతవార్త:** భారత్, చైనా మధ్య సరిహద్దు ఉద్రిక్త తలు కొనసాగుతున్న నేపథ్యంలో, ఇరు దేశాల మధ్య ఒక కీలకమైన సానుకూల పరిణామం చోటుచేసుకుంది. దాదాపు ఐదేళ్ల తర్వాత హిమాలయ ప్రాంతంలోని మూడు కీలక వాణిజ్య మార్గాలను తిరిగి ప్రారంభించాలని నిర్ణయించాయి. దీంతో వాణిజ్యంలో చైనా కంటే భారత్‌కే ఎక్కువ ప్రయోజన సరిహద్దు గ్రామాలు, టిబెట్ ఆర్థిక వ్యవస్థపై సానుకూల ప్రభావం చూపే అవకాశం మెరుగ్గా ఉంది. ఈ మేరకు వాణిజ్య కేంద్రాలు తెరుచుకున్నాయి. ఈ నిర్ణయం సరిహద్దు ప్రాంతాల ప్రజలకు, టిబెట్ ఆర్థిక వ్యవస్థకు, ఇరు దేశాల సంబంధాలకు ఎంతో ప్రాధా న్యత సంతరించు కుంది. ఇటీవల ఢిల్లీలో పర్యటించిన చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో జరిగిన చర్చల సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నారు.హిమాచల్ ప్రదేశ్‌లోని షిప్కిలా పాస్, ఉత్తరాఖండ్‌లోని లిపులేఖ్ పాస్, సిక్కింలోని నాథూ లా పాస్‌ల ద్వారా వాణిజ్యం పునఃప్రారం భం కానుంది. ఈ మార్గాలు టిబెట్‌లోని షిగాట్సే, లాసా, నియింగ్చి వంటి ప్రాంతాలను భారత సరిహద్దు ప్రాంతాలతో కలుపుతాయి.2020లో కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు ఈ మూడు మార్గాలను మూసివేశారు. ఇరుదేశాల సైనికులమధ్య సరిహద్దుల్లోఘర్షణలు, సైనికప్రతిష్టంభన.

## వాణిజ్యం

### భారత్‌లో ఓపెన్ ఎఐ!




**హైదరాబాద్,ఆగస్టు22, ప్రభాతవార్త:** భారత్‌లో చాట్‌జిపిటి సంస్థ ఓపెన్ ఏఐ కార్యకలాపాలను త్వరలో విస్తరించనుంది. ఇందులో భాగంగా భారత్ రాజధాని ఢిల్లీలో ఏడాది చివరిలో కార్యాలయం ఏర్పాటు చేసేందుకు సన్నహాలు చేస్తుంది. అయితే చాట్ జిపిటి వినియోగం గణనీయంగా పెరగడంతో నిర్ణయం తీసుకున్నట్లు వాణిజ్య నిపుణుల వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. భారత్‌లో ఏఐకు అద్భుతమైన అవకాశాలు ఉన్నాయి. గ్లోబల్ ఏఐ టీడర్‌గా ఎదిగేందుకు అవసరమైన అన్ని అంశాలు భారత్‌లో ఉన్నాయని గుర్తించింది. ప్రతిభ, ప్రపంచస్థాయి డెవలపర్ సిస్టం, ఇండియా ఐఏ మిషన్ ద్వారా బలమైన ప్రభుత్వ మద్దతు లభిస్తుంది. తొలి కార్యాలయాన్ని ప్రారంభించి టిమ్‌ను నియమించి మిషన్‌కు కట్టుబడి భారత్‌లో కృత్రిమ మేధను మరింత అందుబాటులోకి తెస్తామన్న నిబద్ధతకు తొలిమెట్టు. అయితే ఓపెన్ ఏఐ సిఈవో శామ్‌ఆల్ట్‌మన్ వెల్లడించారు. ఇదిలా ఉండగా భారత్ ఈ విషయాన్ని ధృవీకరించాల్సి ఉంటుంది. మరోవైపు ఓపెన్ ఏఐ ఇప్పటికే ఇండియా ఏఐ మిషన్ భాగస్వామి అయ్యేందుకు అంగీకరించింది. ప్రభుత్వం కోసం ఏఐ వ్యవస్థల నిర్మాణం జరుగుతుందని. దీంతో దేశంలో సేవలు అపారంగా విస్తరించనున్నాయి. ప్రస్తుతం ఇక్కడ లక్షల మంది విద్యార్థులు, ఎడ్యుకేటర్లు, ప్రొఫెషనల్స్ డెవలపర్లు దీన్ని వాడుతున్నారు. చాట్‌పిజిటి డేటా ప్రకారం అమెరికా తర్వాత రెండో అతిపెద్ద మార్కెట్‌గా భారత్ నిలిచిందని నిపుణులు పేర్కొంటున్నారు. యాక్టివ్ యూజర్ల సంఖ్య కూడా వారంలో నాలుగు రెట్ల వేగంగా పెరుగుతుందని చెబుతున్నారు. ఓపెన్ ఏఐలో మొదటి అయిదు డెవలపర్ల మార్కెట్‌లో, అంతేకాకుండా అత్యదిక విద్యార్థులు సైతం ఉన్నది భారత్ ఒకటిగా నిలిచింది.

## తెలంగాణలో త్వరలో హెలీ టూరిజం- హైదరాబాద్ నుంచి సోమశిల, శ్రీశైలం మధ్య సేవలు

### ప్రతిపాదనలు రూపొందిస్తున్నాం - మంత్రి జూపల్లి

**హైదరాబాద్,ఆగస్టు22, ప్రభాతవార్త:**త్వరలోనే తెలంగాణలో హెలీ టూరిజాన్ని అభివృద్ధి చేయనున్నట్లు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు.పర్యాటకులను విశేషంగా ఆకర్షించే విధంగా హెలీ టూరిజం నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు.గగనతలంలో కొద్దిసేపు విహరింపజేసి పర్యాటకులకు అహ్లాదాన్ని,అనుభూతిని కల్పించేందుకు హెలీ టూరిజం నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు.ఇందులో భాగంగా ఈజ్ మై ట్రిప్ సంస్థ సహకారంతో హైదరాబాద్ నుంచి సోమశిల అక్కడి నుంచి శ్రీశైలం మీదుగా హైదరాబాద్‌కు హెలి టూరిజం నిర్వహణకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు.దీంతో పర్యాటక రంగం కూడా కొత్తమలుపు తిరుగుతుందని,దీనికి సంబంధించిన వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని ప్రకటించారు.రూ. 68.10 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న సోమశిల వెల్‌నెస్, స్పిరిచ్యువల్ రిట్రీట్ నల్లమల ప్రాజెక్టు అభివృద్ధి పనులకు పర్యాటక,సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం శ్రీకారం చుట్టారు.కొల్లాపూర్ నియోజకవర్గంలో అమరగిరిలో రూ. 45.84 కోట్ల వ్యయంతో అమరగిరి ఐలాండ్ వెల్‌నెస్ రిట్రీట్ నిర్మాణ పనులు,రూ.1.60 కోట్లతో సోమశిల విఐపీ ఘాట్ - బోటింగ్ పాయింట్ కోసం ట్రెంచింగ్ పనులకు మంత్రి జూపల్లి భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. పర్యాటక ఆతిథ్యానికి తెలంగాణ అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది.సిఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం అనేక పర్యాటక ప్రాజెక్టులు చేపడుతోందన్నారు.టూరిజం అభివృద్ధికి తెలంగాణలో అనుకూల పరిస్థితులు ఉన్నప్పటికీ గత పదేండ్లలో టూరిజం నిర్లక్ష్యానికి గురైందని,స్వదేశీ,విదేశీ పర్యాటకుల సంఖ్యను పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు.విదేశీ పర్యాటకుల సంఖ్యను పెంచేందుకు మోలిక వసతుల కల్పనతో పాటు విస్తృత ప్రచారం నిర్వహిస్తామని,తద్వారా ఉద్యోగ కల్పనతోపాటు ఆయా ప్రాంతాల్లో మోలిక వసతులు మెరుగవుతాయన్నారు. వాటర్ స్పోర్ట్స్,అడ్వెంచర్ టూరిజానికి పెద్దపీట వేస్తాం.అమరగిరి ఐలాండ్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు.ఏడాది లోగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని,నీటి ప్రవాహం తగిన, పర్యాటకులను ఐలాండ్ తీసుకువచ్చేలా ఫ్లోటింగ్ జెట్టి ఏర్పాటు చేస్తున్నామన్నారు.కొత్త పర్యాటక ప్రాజెక్ట్ ల అభివృద్ధి వల్ల పర్యాటకుల సందర్శన మరింత పెరగనుందని,నల్లమల్ల అడవుల మధ్యలో కృష్ణా నది ఒడ్డున ఉన్న సోమశిల, అమరగిరి అందాలను చూసేందుకు పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తారని, తద్వారా టూరిజం ప్రాజెక్టుల అభివృద్ధి వల్ల రాష్ట్ర ఆదాయం పెరిగి ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.సోమశిల సిద్దేశ్వరం ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం పూర్తైతే దూరాభారం తగ్గడంతో పాటు పర్యాటకుల సంఖ్య పెరుగుతుందన్నారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14